



ESTD: 1999

www.voodayam.com

# వుదయం






ఆదిలాబాద్ | 04-04-2026 శనివారం | సంపుటి : 13 | సంచిక : 319 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal | Follow us on


పేదల ఇండ్లు కూల్చే మీ నుంచి

## మేం నేర్చుకోవాలా?



సీఎం రేవంత్ పై కేరళం సీఎం పినరయి విజయన్ ఫైర్

తెలంగాణలో పేదల ఇళ్లపై బుల్డోజర్లు నడిపిస్తున్నరు

కేరళం అభివృద్ధి గురించి మాకు పాఠాలు చెప్పొద్దు

అవినీతిలో ఆరో స్థానంలో తెలంగాణ

9

రేవంత్ పోవాలి..

## మార్పు రావాలి

- మాజీ మంత్రి జీవన్ రెడ్డి ధ్వజం
- రెండేళ్లలోనే కాంగ్రెస్ పాలనపై ప్రజా వ్యతిరేకత, అసంతృప్తి
- నా అడ్డు తొలగించుకునేందుకే నామినేటెడ్ పదవుల్లో జాప్యం చేశారు
- కాళేశ్వరం ప్రాజెక్ట్ పునరుద్ధరణపై రాష్ట్ర సర్కార్ నిర్లక్ష్యం



**హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఎంఎంస్) :** 'రెండేళ్ల పాలనలోనే సీఎం రేవంత్ రెడ్డి పోవాలి.. మార్పు రావాలి' అనే పరిస్థితి ఏర్పడిందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో కూడా కేసీఆర్ పోయి మార్పు రావాలనే నినాదంతోనే ప్రజలు కాంగ్రెస్ కు ఓటేశారని స్పష్టం చేశారు. ఈ రెండేళ్ల కాలంలో రేవంత్ రెడ్డి పాలన పై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. శుక్రవారం జగిత్యాలలోని తన నివాసంలో ఆయన మీడిమాతో మాట్లాడారు. ఇంతకాలం పార్టీలో తన అడ్డు తొలగించుకునేందుకే నామినేటెడ్ పదవుల్లో జాప్యం చేశారని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై జరుగుతున్న విమర్శలు రాజకీయ కోణంలో మాత్రమే ఉన్నాయని చెప్పారు.

మిగతా 2లో

వరంగల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో

## ఏసీబీ దాడులు

- బట్టబయలైన సబ్ రిజిస్ట్రార్ల అక్రమ లావాదేవీలు
- వెలుగుచూసిన అనధికారిక వ్యక్తులతో చీకటి ఒప్పందాలు
- 70 డాక్యుమెంట్లు స్వాధీనం
- రైటర్ల ద్వారా ఇద్దరు సబ్ రిజిస్ట్రార్ల లంచాలు

2

ప్రైవేట్ విద్యాసంస్థల

## నిలువు దోపిడీ

- 30 నుంచి 40 శాతం ఫీజులు పెంచారు
- ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలి
- సీఎం విద్యాశాఖ మంత్రి కావడమే దురదృష్టం
- ప్రైవేట్ కార్పొరేట్ స్కూల్స్‌లో తెలంగాణ వారికి ఉద్యోగాలు ఇవ్వాలి
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

## దక్షిణాసియా టెక్స్‌టైల్ రాజధానిగా

# తెలంగాణ


### టెక్స్‌టైల్స్ తెలంగాణ ప్రజల డీఎన్ఏలో ఉంది

ప్రపంచం మొత్తం తెలంగాణలో తయారైన దుస్తులు ధరించాలి

నిర్దేశించుకున్న విజన్‌లో పారిశ్రామిక వేత్తలు భాగస్వాములు కావాలి

ప్రపంచంలోని ప్రతి దేశం తెలంగాణలో తయారైన దుస్తులను ధరించేలా చేయాలన్నది సంకల్పం

13వ ఏషియా టెక్స్‌టైల్ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 3 (వుదయం ప్రతినిధి) :** వస్త్ర పరిశ్రమ రంగంలో 2047 నాటికి తెలంగాణను దక్షిణాసియాలోనే గొప్ప టెక్స్‌టైల్ రాజధానిగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. టెక్స్‌టైల్ రంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం నిర్దేశించుకున్న విజన్‌కు అనుగుణంగా ప్రపంచాన్ని మార్చగల వాతావరణాన్ని సృష్టించడంలో తమతో భాగస్వామ్యం కావాలని పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు. ప్రపంచంలోని ప్రతి దేశం తెలంగాణలో తయారైన దుస్తులను ధరించేలా చేయాలన్నది తమ సంకల్పమన్న సీఎం... తెలంగాణ రైజింగ్ ప్రయాణంలో అందరూ భాగస్వాములు కావాలని పెట్టుబడిదారులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ తో కలిసి 13వ ఏషియా టెక్స్‌టైల్ సదస్సును నిర్వహించింది. ఈ సదస్సులో సీఎం అటెక్స్ కాన్-2026 నివేదిక విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్స్‌టైల్స్ తెలంగాణ ప్రజల డీఎన్ఏలో ఉందని వ్యాఖ్యానించారు. నిజాం కాలంలో ప్రపంచ నలుమూలల నుంచి వ్యాపారులు హైదరాబాద్ నగరానికి వచ్చి వస్త్రాలు, ముత్యాలు కొనుగోలు చేశారని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఈ విషయాన్ని గర్వంగా చెప్పగలదన్నారు. వస్త్ర పరిశ్రమలో తెలంగాణ ముందంజలో ఉండటానికి చారిత్రక కారణాలున్నాయని వివరించారు. దేశంలో పత్తి ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్నామన్నారు. ఇక్కడి పత్తి నాణ్యతకు ప్రపంచవ్యాప్తంగా పేరుందన్నారు.. టెక్స్‌టైల్ తెలంగాణకు కేవలం పరిశ్రమ మాత్రమే కాదు. ప్రజల జీవనాధారమని పేర్కొన్నారు. ప్రసిద్ధి చెందిన పోచంపల్లి ఇక్కత్, గద్వాల చీరలు, వరంగల్ దుర్రీస్, నారాయణపేట చేనేత వరకు అనేకం ఇక్కడున్నాయని వెల్లడించారు. తెలంగాణలో నైపుణ్యం, మంచి సంకల్పం కూడా ఉంద న్నారు. అందుకే డీప్‌టెక్, ఫార్మా, లైఫ్ సైన్సె స్, ఏరోస్పేస్, డిఫెన్స్ మాన్యుఫాక్చరింగ్, ఎనర్జీ వంటి అనేక రంగాల్లో తెలంగాణ ముందంజలో ఉందన్నారు.

మిగతా 2లో

### ఉద్యోగ నియామకాలపై మా చిత్తశుద్ధికి నిదర్శనమిది

- సుప్రీం తీర్పును స్వాగతించిన సీఎం రేవంత్
- గ్రూప్ 1 నియామకాలకు లైన్ క్లియర్
- హైకోర్టు తీర్పుపై జోక్యం చేసుకోబోమన్న సుప్రీం కోర్టు
- ఉద్యోగాలకు ఎంపికైన వారికి మరోసారి అభినందనలు : సిఎం

2

చమురు, ఎల్ఎన్‌జి సరఫరాల

## పెంపునకు రష్యా సిద్ధం

- బలపడుతున్న రష్యా, భారత్ భాగస్వామ్యం
- అణుశక్తి రంగంలో కొనసాగుతున్న సహకారంపై ఇరుపక్షాల పునరుద్ఘాటన
- ఈ రంగంలో దీర్ఘకాలంగా భాగస్వాములు
- భారతదేశంలో అధికారిక పర్యటన సందర్భంగా రష్యా తొలి డిప్యూటీ ఛైర్మన్ డెనిస్ మాంతురోవ్
- భారత మార్కెట్‌కు చమురు, ద్రవీకృత సహజ వాయువు సరఫరాలను క్రమంగా పెంచే సామర్థ్యం రష్యా కంపెనీలకు ఉంది
- యూరియా ఉత్పత్తి కోసం ఒక ఉమ్మడి ప్రాజెక్ట్ ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉంది
- కుదంకుళం అణు విద్యుత్ కేంద్రం కోసం విద్యుత్ యూనిట్లు

2



# విధ్వంసమే లక్ష్యంగా దాడులు

### ఇరాన్, అమెరికాల మధ్య క్షిపణి, డ్రోన్ దాడులే కాదు మాటల తూటాలు

యుఎస్, ఇజ్రాయెల్ దాడులను తీవ్రతరం చేస్తే

యుఎస్ ప్రాంతీయ ఆస్తులను ధ్వంసం చేస్తాం

ఇరాన్ సైన్యం హెచ్చరిక

మేమింకా మా పూర్తి శక్తిని ప్రదర్శించనే లేదు : ట్రంప్

విజయాన్ని ప్రకటించి యుద్ధాన్ని విరమించమని

ఇరాన్‌కు ఆ దేశ మాజీ విదేశాంగ మంత్రి జావేద్ జరీఫ్ హితవు



### హోర్ముజ్‌ను తిరిగి తెరవాలి


యుకె ఏర్పాటు చేసిన, 60కి పైగా దేశాలు

హాజరైన వర్చువల్ సమావేశంలో భారత్ పిలుపు

నావికులను కోల్పోయింది మేమే

గల్ఫ్ ప్రాంతంలో వాణిజ్య నౌకలపై జరిగిన దాడుల్లో మరణించిన వారిలో భారతీయ నావికులు ఉన్నారు

5





## ఇరాన్ నుంచి భారత్‌కు రావలసిన నౌక చైనాకు?

ముడిచమురుతో గుజరాత్ రావలసిన నౌక మార్గం మళ్లింపు

2019 తర్వాత కొనుగోలు చేసిన తొలి ఇరాన్ ముడి చమురు స్టాక్ అయి ఉండేది

5



### హోర్ముజ్ జలసంధి తీర్మానంపై ఓటింగ్ వాయిదా

**వుదయం డెస్క్, ఏప్రిల్ 3 :** హోర్ముజ్ జలసంధి తీర్మానంపై ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో శుక్రవారం జరుగవలసిన ఓటింగ్‌ను శనివారం జరుగనుందని, మండలి అధికార ప్రతినిధి పేర్కొన్నారు. హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకాయానానికి రక్షణ కల్పించేందుకు బహ్రెయిన్ ప్రవేశపెట్టిన తీర్మానంపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఓటింగ్‌ను శనివారానికి వాయిదా వేశారు. సురక్షిత ప్రయాణాన్ని నిర్ధారించడానికి అవసరమైన అన్ని రక్షణ చర్యలను అధికారికంగా అనుమతించడమే ఈ తీర్మానం లక్ష్యం. అయితే, ఇది చైనా, రష్యాల నుంచి వ్యతిరేకతను ఎదుర్కొంటోంది.

మిగతా 2లో

**వుదయం డెస్క్, ఏప్రిల్ 3 :** ఇరాన్, అమెరికాల మధ్య కేవలం క్షిపణి, డ్రోన్ దాడులే కాదు మాటల తూటాలు కూడా తీవ్రంగా పేలుతున్నాయి. అమె రికా ఇమేజ్ మరెన్నడూ కోలుకోలేనంతగా దెబ్బతీస్తామని ఇరాన్ హెచ్చరిస్తుండగా, ప్రపంచంలో అత్యంత గొప్పదైన తమ సైన్యం ఇరాన్‌లో మిగిలిన వాటిని ధ్వంసం చేయడం కూడా ప్రారంభించలేదంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేస్తున్నారు. ఈ క్రమంలోనే తమ మౌలిక సదుపాయాలపై యుఎస్, ఇజ్రాయెల్ తమ దాడులను తీవ్రతరం చేయడంతో, ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై ఇరాన్ తాజా దాడులను ప్రారంభించింది. ఇరాన్‌లో ఒక ప్రధాన వంతెనను గురువారం ధ్వంసం చేసిన అనంతరం, అక్కడి పౌర కేంద్రాలు, విద్యుత్ కేంద్రాలపై మరిన్ని దాడులు చేస్తామని యుఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అది యుద్ధ నేరం కిందకు వస్తుందన్న హెచ్చరికలను ఆయన లెక్క చేయలేదు. ఇందుకు ఇరాన్ కూడా తీవ్రంగా స్పందించింది. యుఎస్, ఇజ్రాయెల్ తమ దాడులను తీవ్రతరం చేస్తే, ఆ ప్రాంతంలో గల యుఎస్ ప్రాంతీయ ఆస్తులను ధ్వంసం చేస్తామని ఇరాన్ సైన్యం హెచ్చరించింది. కాగా, తమ దేశంలోని నీటిశుద్ధి కేంద్రం, చమురు రిఫైనరీని ఇరాన్ లక్ష్యంగా చేసుకుందని కువైట్ తెలిపింది. మినా- అల్ అహ్మదీ చమురు శుద్ధి కర్మాగారంపై మూడవసారి దాడి జరిగింది. కాగా,తాము నీటిశుద్ధి కేంద్రంపై దాడి చేయలేదని తెహ్రాన్ పేర్కొంది.

మిగతా 2లో

### బీజేపీపై కేరళంలో సీఎం అసత్య ప్రచారం

ఆరు గ్యారంటీల్లో ఎన్ని అమలు చేసిందో కాంగ్రెస్ చెప్పాలి

గతంలో కేసీఆర్, ఇప్పుడు రేవంత్ ప్రజలను మోసం చేస్తున్నారు : కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



2

గాలికి గిరిజనుల

## సంక్షేమం

గత ప్రభుత్వ పాలనలో 'మా తండాలో మా రాజ్యం'

విద్యార్థులకు కాంగ్రెస్ ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేకపోతోంది

సంత్ సేవాలాల్ కార్పొరేషన్‌కు రూ.వంద కోట్లు ప్రకటన ఉత్తదే


మాజీ మంత్రి హరీష్ రావు



2

# డిజిటల్ దిశగా తెలంగాణ

- ఇకపై ఒక్క క్లిక్‌తో సెల్‌ఫోన్‌లోనే ప్రభుత్వ సేవలు
- ఇప్పటికే వాట్సప్ లో పలు 'మీ-సేవ'లు
- ఒక్కొక్కటిగా వాట్సప్‌లో ప్రభుత్వ శాఖల సేవలు లింక్



*గతంలో వేర్వేరు డిపార్ట్‌మెంట్‌లకు వేర్వేరుగా ఉన్న పోర్టల్‌లతో తీవ్ర గందరగోళం ఏర్పడగా.. దానికి స్వస్తి పలుకుతూ ఈ ఇంటిగ్రేటెడ్ విధానాన్ని తీసుకువచ్చి అన్ని సేవలకు ఒకే వాట్సాప్ నంబర్‌ను తీసుకువచ్చారు. ప్రజల ఫిర్యాదులు మొదలుసర్టిఫికెట్ల జారీ వరకు అన్నింటినీ ఒకే దగ్గరికి చేర్చే విప్లవాత్మక మార్పులు తెస్తున్నారు. కేవలం సమాచారం కోసమే మాత్రమే కాకుండా నేరుగా సేవలు పొందే వేదికగా మార్చారు. ఇటీవల పలు ఎంట్రన్స్ ఎగ్జామ్స్‌కు సంబంధించిన హాల్ టికెట్లను కూడా వాట్సాప్‌లో అందుబాటులో ఉంచారు. కేవలం రిజిస్ట్రేషన్ నంబర్, పుట్టిన తేదీ, పేరు వంటి వివరాలు ఎంటర్ చేయగానే హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకునే అవసరం కల్పించారు.*

**హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఎంఎంస్) :** తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ సేవల వైపు వేగంగా అడుగులు వేస్తోంది. ఒక్క క్లిక్‌తో ప్రభుత్వ సేవలను.. మన అరచేతిలోకే తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతోంది. మీ-సేవ, ఇంటర్నెట్ సెంటర్ల చుట్టూ తిరిగే అవకాశం లేకుండా.. సెల్ ఫోన్‌లోనే చూసుకునేలా ఏర్పాట్లు చేస్తోంది. ప్రభుత్వ పాలనను.. ప్రజల చేతిలోకి తీసుకువచ్చేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే మీ-సేవ ద్వారా అందే సేవలు, ఇంటర్, పది పరీక్షల హాల్ టికెట్లను ఇప్పటికే వాట్సాప్‌లో అందుబాటులోకి తీసుకువచ్చిన ప్రభుత్వం.. ప్రభుత్వ సేవలను కూడా డిజిటల్‌గా అందుబాటులోకి తెస్తోంది. ఇందులో భాగంగా.. ఒక్కొక్కటిగా వివిధ శాఖల సేవలను వాట్సాప్‌తో లింక్ చేస్తోంది. దీంతో ప్రభుత్వానికి సంబంధించిన ప్రతీ సేవకు సంబంధించిన లింక్ ఒక్క వాట్సాప్ మెసేజ్‌తో అరచేతిలోకి రానుంది. అదే సమయంలో భవిష్యత్తులో

మిగతా 2లో

# అమెరికా యుద్ధోన్మాదంపై ప్రధాని మౌనమేల?

సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె. నారాయణ

ట్రంప్ యుద్ధ కాంక్షతో అనేక దేశాలు ప్రభావితం

రైతు ఉత్పత్తుల వస్తువుల ఎగుమతి నిలిచిపోయింది

అమెరికాలో ట్రంప్ కు వ్యతిరేకంగా లక్షలాది మంది నిరసనలు



**వరంగల్, ఏప్రిల్ 03 (వుదయం ప్రతినిధి) :** భారత దేశానికి నష్టం కలిగిస్తున్న అమెరికా యుద్ధోన్మాదంపై ప్రధాని నరేంద్రమోడీ మౌనం వీడాలని సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె. నారాయణ అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యుద్ధ కాంక్షతో అనేక దేశాలు ప్రభావితం అవుతున్నాయన్న ఆయన.. ఇంధన సరఫరాలో ఇక్కట్లతో పాటు దేశంలోరైతుల ఉత్పత్తులు, పండ్లు, కూరగాయలు, బియ్యం ఇతర వస్తువుల ఎగుమతి నిలిచిపోయిందని చెప్పారు. యుద్ధం ప్రభావంతో దేశంలో అన్ని రకాల ధరలు పెరిగిపోతున్నాయనీ ప్రజల ఇబ్బందులను తొలగించి భారత దేశ ఔన్నత్యాన్ని కాపాడేందుకు, ట్రంప్ దుర్మార్గాన్ని ఆపేందుకు మోడీ మౌనం వీడాలని కోరారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మోడీ యుద్ధం పేరుతో దాడి చేస్తున్న దేశాలతో మాట్లాడకుండా యుద్ధంతో నష్టపోతున్న ఇరాన్తో మాట్లాడడం దేశానికి అవమానకరమని అన్నారు. ఒకవైపు అమెరికాలోనే 50 రాష్ట్రాల్లో ట్రంప్ కు వ్యతిరేకంగా లక్షలాది మంది నిరసనలు తెలుపుతుంటే మన దగ్గర అసమర్థ ప్రధానిగా మోడీ బలహీనంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంటు సాక్షిగా అబద్ధాలు వల్లే వేశారని, కమ్యూనిస్టులు, మావోయిస్టుల పట్ల తన అక్కసును వెల్లగక్కారని అన్నారు.

మిగతా 2లో

### స్వాతంత్ర్య పోరాటంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ పాల్గొనలేదు

స్వాతంత్ర్య పోరాటంలో సీపీఐ పాల్గొని అనేక త్యాగాలు చేసిందని నారాయణ గుర్తు చేశారు. కానీ బీజేపీ, ఆర్ఎస్ఎస్ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనలేదని చెప్పారు. మావోయిస్టు ఉద్యమం నుండి విడిపోయి బయటికి వచ్చిన గద్దర్‌ను అమిత్ షా మావోయిస్టు అనడం దారుణమన్నారు. మరి గద్దర్ చనిపోతే ప్రధాని మోడీ సంతాపం ఎందుకు వ్యక్తం చేశారని నారాయణ ప్రశ్నించారు.

# డిజిటల్ తెలంగాణ




**మొదటి పేజీ తరువాయి..**

రాష్ట్ర స్థాయి ఉద్యోగ పరీక్షలకు సంబంధించిన రిక్రూట్‌మెంట్ బోర్డులు కూడా ఈ వాట్సాప్‌నే విని యోగించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. ప్రభుత్వ సేవలన్నీ ఆన్‌లైన్ అయి వాట్సాప్‌లో అందుబాటులోకి వస్తే.. ఇంటర్నెట్ సెంటర్లు, మీ–సేవ సెంటర్ల చుట్టూ తిరిగే పని లేకుండా కేవలం వాట్సాప్ ద్వారా ప్రజలకు సేవలు అందుతాయని అధికారులు పేర్కొంటు న్నారు. ఈ వాట్సాప్ సేవల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా 80969 58096 అనే నంబర్‌ను అందు బాటులోకి తీసుకువచ్చింది. గతంలో వేర్వేరు డిపార్ట్‌మెంట్‌లకు వేర్వేరుగా ఉన్న పోర్టల్‌లతో తీవ్ర గందరగోళం ఏర్పడగా.. దానికి స్వస్తి పలుకుతూ ఈ ఇంటిగ్రేటెడ్ విధానాన్ని తీసుకువచ్చి అన్ని సేవలకు ఒకే వాట్సాప్ నంబర్‌ను తీసుకువచ్చారు. ప్రజల ఫిర్యాదులు మొదలుసర్టిఫికెట్ల జారీ వరకు అన్నింటినీ ఒకే దగ్గరికి చేర్చే విప్లవాత్మక మార్పులు తెస్తున్నారు. కేవలం సమాచారం కోసమే మాత్రమే కాకుండా నేరుగా సేవలు పొందే వేదికగా మార్చారు. ఇటీవల పలు ఎంట్రన్స్ ఎగ్జామ్స్‌కు సంబంధించిన హాల్ టికెట్లను కూడా వాట్సాప్‌లో అందుబాటులో ఉంచారు. కేవలం రిజిస్ట్రేషన్ నంబర్, పుట్టిన తేదీ, పేరు వంటి వివరాలు ఎంటర్ చేయగానే హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకునే అవసరం కల్పించారు. రానున్న రోజుల్లో స్టేట్ లెవల్ రిక్రూట్‌మెంట్ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను కూడా వాట్సాప్‌లోనే అందించనున్నారు. రిజల్ట్స్ కూడా తెలుసుకునే వెసు లుబాటు కల్పించనున్నారు. ప్రభుత్వ మెసేజ్‌లు, అలర్ట్‌లు కూడా ఇదే వాట్సాప్ నంబర్ ద్వారా ప్రజలకు చేరనున్నాయి. ప్రస్తుతం మీ–సేవ పోర్టల్‌లో లభించే దాదాపు అన్ని సేవలు వాట్సాప్‌లో అందుతున్నాయి. కులం, ఆదాయం వంటి సర్టిఫికెట్లు, వాటి స్టేటస్ తెలు సుకోవడం దగ్గరి నుంచి మున్సిపల్ ట్యాక్స్‌ల చెల్లింపు వరకు వాట్సాప్‌లో అందుబాటులో ఉన్నాయి. రెవెన్యూ, విద్యుత్, పౌరసరఫరాల వంటి కీలక శాఖల సమాచారం కూడా అరచేతిలోకి తెచ్చారు. హాయ్ అని ఒక్క మెసేజ్ చేస్తే చాలు ఆప్షన్లతో కూడిన మెనూ ప్రత్యక్షం అవుతుంది. రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అన్నింటినీ ఈ వాట్సాప్ చాట్ బాట్‌కు లింక్ చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి వంటి పథకాలకు దరఖాస్తు చేసుకోవడం.. అర్హతలు చెక్ చేసుకోవడం, రేషన్ కార్డులు, పెన్షన్ల జారీ మరింత సులభం కానుంది. లబ్ధిదారుల అకౌంట్లలో ప్రభుత్వం వేసే డబ్బుల సమాచారం కూడా వాట్సాప్ మెసేజ్‌లో అందించనున్నారు. ఒకే నంబర్‌తో రాష్ట్ర ప్రజలందరికీ అన్ని ప్రభుత్వ సేవలు అందేలా వన్ స్టాప్ షాప్ విధానాన్ని తీసుకురానున్నారు.

## ఉద్యోగ నియామకాలపై
# మా చిత్తశుద్ధికి నిదర్శనమిది

### సుప్రీం తీర్పును స్వాగతించిన సీఎం రేవంత్‌రెడ్డి
### గ్రూప్ 1 నియామకాలకు లైన్ క్లియర్
### హైకోర్టు తీర్పుపై జోక్యం చేసుకోబోమన్న సుప్రీం కోర్టు



**హైదరాబాద్, ఏప్రిల్ 03 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్రంలో గ్రూప్–1 నియామకాలపై రాష్ట హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ ను కొట్టివేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సీఎం రేవంత్‌రెడ్డి స్వాగ తించారు. ఇది ఉద్యోగ నియామకాల పట్ల తమ ప్రభుత్వ పారదర్శకతకు, చిత్తశుద్ధికి గుర్తింపు గా భావిస్తున్నా న్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఎక్స్ వేదికగా స్పందించిన రేవంత్‌రెడ్డి..కొలువుల కోసం ఏళ్లకు ఏళ్లు కళ్లు కాయలు కాచేలా ఎదురు చూసి, కన్నవారి కష్టం పై ఆధారపడలేక, కొలువు వస్తుందో రాదో అన్న దిగులుతో పదేళ్లు కాలం వెళ్లదీసిన గ్రూప్ –1 ఆశావహులకు ఇది పెద్ద ఊరట అన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చీరావడంతోనే నోటిఫికేషన్ ఇచ్చి, పరీక్షలు నిర్వహించి నెలల వ్యవధిలో నియామక పత్రాలు అందజేసిందన్నారు. ఈ నియామ కాలను అడ్డుకోవాలనుకున్న దుష్ట శక్తుల కుట్రలను కుతంత్రాలను ఛేదించి, రాష్ట్ర పునర్ నిర్మాణంలో తొలి గ్రూప్ –1 అధికారులుగా యువతను భాగస్వాములను చేశామన్నారు. ఉద్యోగాలను ఎంపికైన వారికి మరో సారి నా అభినందనలు అని తెలిపారు. ప్రభుత్వం ఆలో చనలు, సంకల్పానికి అనుగుణంగా టీజీపీఎస్సీ వ్యవస్థను ప్రక్షాళన చేసి, నిరుద్యోగ యువతకు వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని పునరుద్ధరించామన్నారు. అత్యంత పారదర్శకంగా ఈ నియామకాలను పూర్తి చేసిన టీజీపీ ఎస్సీ ఛైర్మన్, ఉద్యోగులు, సిబ్బందికి ప్రత్యేక అభినంద నలు తెలిపారు.

**హైకోర్టు తీర్పు సబబే..**

తెలంగాణ గ్రూప్–1 నియామకాలపై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరిం చింది. రాష్ట్రంలో గ్రూప్–1 నియామకాలపై రాష్ట హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ ను ఈ నెల 2న సుప్రీంకోర్టు డిస్మిస్ చేస్తూ హైకోర్టు తీర్పును సమర్థించింది. ఉద్యోగాల నియామ కాల ప్రక్రియలో అవకతవకలు జరిగాయని కొందరు సుప్రీంకోర్టును ఆశ్ర యించారు. ఎంపిక ప్రక్రియ, మూల్యాం కనంలో తప్పులు న్నాయని, ఈ నోటిఫికేషన్ రద్దు చేసి తిరిగి పరీక్షలు నిర్వ హించాలని సుప్రీంకోర్టును కోరారు. నియామకాలు కొనసాగించవచ్చని హైకోర్టు తీర్పునిచ్చిందని, అభ్యర్థుల వాదనలు పరిగణనలోకి తీసుకోకుండా హైకోర్టు తీర్పు వెల్లడించిందని పిటిషన్‌లో అభ్యర్థులు పేర్కొన్నారు. జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం ఈ పిటీషన్లపై విచారణ జరిపింది. వీరి వాదోపవాదనలు విన్న సుప్రీం ధర్మాసనం... హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకునేం దుకు నిరాకరించింది. ఈ క్రమంలో దాఖలైన పిటిషన్ ను డిస్మిస్ చేసింది.

## అమెరికా యుద్ధోన్మాదంపై
# ప్రధాని మోనమేలా?

**మొదటి పేజీ తరువాయి..**

గద్దర్ చనిపోతే సంతాపం తెలిపినందుకు ప్రధాని మోడీని దమ్ముంటే అరెస్టు చేస్తారా అని, లేదా అసత్యాలు పలికిన అమిత్ షా పై కేసు పెడతారా అని ప్రశ్నించారు. హత్యానేరం మోపబడిన అమిత్ షా 12 మందిని చంపించి నిర్దోషినిగా ప్రకటించుకున్న చరిత్ర ఉందన్నారు. మావోయిస్టులను జన జీవన స్రవంతిలో కలవాలని మొదట కోరింది తామేనని, ఆపరేషన్ కగార్ నిలిపివేసి ఇరు వర్గాలు కాల్పుల విరమణ పాటించాలని తామే సూచించామని అన్నారు. కానీ కేంద్రం అమాను షంగా వ్యవహరించి బయటికి వచ్చిన హిడ్మా లాంటి మావోయిస్టులను వందల మందిని ఎన్ కౌంటర్ చేయించిందని ఆరోపించారు. లొంగిపో యిన మావోయిస్టులకు కూడా ప్రభుత్వం సరైన గౌరవం ఇవ్వడం లేదని, మావోయిస్టులు ఎవరితో మాట్లాడవద్దని నిబంధనలు పెడుతున్నారని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయానికి వస్తామని చెప్పిన మావోయిస్టు నాయకులు పోలీసుల ఒత్తిడితోనే రాలేదని అన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు సరైన స్వేచ్ఛ, గౌరవం దక్కడం లేదని నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు . మావోయిస్టులు ఇప్పటికైనా స్వేచ్ఛగా, గౌరవంగా బతుకాలన్న ఆయన సీపీఐ వారికి ప్రజాస్వామ్యబద్ధంగా అండగా ఉంటుందని హామి ఇచ్చారు 40 ఏండ్ల పాటు వారు జీవితాలను త్యాగం చేశారని, అలాంటి వారు బూర్జువా పార్టీలతో కలువవద్దని కోరారు. వామపక్ష ఉద్యమంలో భాగం కావాలని పిలుపునిచ్చారు.

**మతం మారినా కులం మారదు..**

ఇటీవల క్రిస్టియన్ మతంలో చేరితే ఎస్సీ కులం హోదా రద్దు అవుతుందని వచ్చిన తీర్పు సరికాదని, ఏ మతంలో చేరినా మనిషి కులం ఎన్నటికీ మారదని, క్రిస్టియన్ మతంలో చేరినా ఎస్సీ హోదా రద్దు కాదని అన్నారు. కేంద్రం చేపట్టిన ఎస్ఐఆర్‌ను తాము వ్యతిరేకిస్తున్నామని.. ఈ కార్యక్ర మంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, హను మకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, ఎన్ ఎ స్టాలిన్, మునిగాల బిక్షపతి, ఎదునూరి వెంకట్రాజం, నేదునూరి రాజమౌళి, యెశబోయిన శ్రీనివాస్, కొట్టేపాక రవి, బత్తిని సదానందం తదితరులు పాల్గొన్నారు.

## హోర్ముజ్ జలసంధిపై
# తీర్మానంపై ఓటింగ్ వాయిదా

**మొదటి పేజీ తరువాయి..**

ఈ దేశాల వ్యతిరేకత కారణంగా, తీర్మానం తుది ముసాయిదా సురక్షిత ప్రయాణాన్ని నిర్ధారించడానికి కేవలం రక్షణ చర్యలను మాత్రమే అనుమ తిస్తుంది. వీటోను నివారించేందుకు దౌత్యవేత్తలు ప్రయత్నిస్తుండగా, భద్రతా మండలి ఓటింగ్ శనివారం జరగనుంది. ఈ ఓటింగ్ వాస్తవానికి మండలి తాత్కాలిక షెడ్యూల్‌లో ఏప్రిల్ 3న స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 11:00 గంటలకు (15:00 జిఎంటి) నిర్ణీతమై ఉంది, కానీ శుక్రవారం నాటికి ఐక్యరాజ్యసమితి వెబ్‌సైట్‌లో అది కనిపించలేదు. ఆ ఓటింగ్‌ను వాయిదా వేయాలని మండలి సభ్యులు నిర్ణయం తీసుకున్నారని, ఐరాస అధికార ప్రతినిధి తెలిపారు. ఓటింగ్‌కు ముందు ఎలాంటి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడవద్దని ఇరాన్ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిని హెచ్చరించింది. ఓటింగ్ తమ భవిష్యత్తును నిర్ణయి స్తుందని స్పష్టం చేసింది.

**విధ్వంసమే లక్ష్యంగా దాడులు...**

అంతేకాదు, ఇజ్రాయెల్‌పై చేసిన క్షిపణి దాడులలో ఇళ్లు, కార్లు కూడా ధ్వంసమయ్యాయి. అబుదాబిలోని ఒక గ్యాస్ కేంద్రంలో, పైనుండి పడిన శిథిలాల కారణంగా మంటలు చెలరేగాయని అధికారులు తెలిపారు. శుక్రవారం నాడు ఉదయం ఇరాన్ క్షిపణుల దండు తమ దేశంపైకి వచ్చిందని ఇజ్రాయెలీ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడిఎఫ్) పేర్కొంది. ఇరాన్‌లోని కరాజ్ నగరంలో అమెరికా ఒక వంతెనను ధ్వంసం చేయడంతో, ఎనిమిది మంది మరణించి, 100 మంది గాయపడిన ఘటన అనంతరం ఈ దాడి జరిగిందని వారంటున్నారు. ఇలా ఉండగా, విజయాన్ని ప్రకటించి యుద్ధాన్ని ముగించవలసిందిగా ఇరాన్ మాజీ విదేశాంగ మంత్రి జావేద్ జరీఫ్ పిలుపిచ్చారు. ట్రంప్ పెట్టిన షరతులలో తమకు ఆమోదయోగ్యమైన వాటితో తెహ్రాన్ ఒక పరిష్కారాన్ని కోరేందుకు బ్లూప్రింట్‌ను ఆయన ఇచ్చారు. ఈ నేపథ్యంలో, అమెరికా సైన్యంలోని అత్యున్నత సైనికాధికారి, ఆర్మీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ రాండీ జార్జ్ ను రాజీనామా చేయవలసిందిగా అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ కోరారు.ఫిబ్రవరి 28న ప్రారంభమైన యుఎస్– ఇజ్రాయెల్ దాడులలో 2,067మంది మరణించగా, 26,500 మంది గాయపడ్డారు.

## దక్షిణాసియా టెక్స్‌టైల్ రాజధానిగా
# తెలంగాణ



**మొదటి పేజీ తరువాయి..**

వరంగల్‌లో కాకతీయ ప్రపంచ స్థాయి మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను ఏర్పాటు చేశామని వివరిం చారు. అందులో అనేక అప్పరెల్ పార్కులున్నాయ న్నారు. వస్త్ర పరిశ్రమకు తమ ప్రభుత్వం భూమి, విద్యుత్, నీరు వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తూ ప్రోత్సహిస్తుందని చెప్పారు. అవసరమైన అనుమతులను వేగంగా మంజూరు చేస్తుంద న్నారు. ప్రపంచ పోటీకి అనుగుణంగా విధానాలు అనుసరిస్తున్నామన్న సీఎం... అత్యుత్తమ మానవ వనరుల బలం ఉందని వివరించారు. తెలంగాణ లోని పత్తి పొలాలకు.. లండన్, న్యూయార్క్, పారిస్, మిలాన్, టోక్యో, దుబాయ్ ఫ్యాషన్ షోలకు అనుసం ధానం కావాలని సీఎం ఆకాంక్షించారు. మీకు విజన్ ఉంటే, మేము సరైన భాగస్వాములం అవుతా మని పారిశ్రామిక వేత్తలకు సీఎం కోరారు. అందరం కలిసి, ప్రపంచాన్ని మార్చగల టెక్స్‌టైల్ ఎకోసిస్టమ్‌ను నిర్మిద్దామని పిలుపునిచ్చారు.

**సినిమా హబ్‌గా హైదరాబాద్...**

హైదారాబాద్ గ్లోబల్ సినిమా హబ్ గా ఎదుగుతోం దని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇటీవల నెట్ ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోలను ఇక్కడ ప్రారంభించి నట్లు చెప్పారు. టాలీవుడ్, బాలీవుడ్ ఇప్పటికే హైద రాబాద్ కేంద్రంగా పనిచేస్తుండగా, ఇప్పుడు హాలీవుడ్ కూడా చేరిందన్నారు. సినిమా సంబంధిత ఫ్యాషన్ రంగాన్ని కూడా తెలంగాణ నుంచే అభివృద్ధి చెందేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. పరిశ్రమల అభి వృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు సీఎం తెలిపారు.

గ్రీన్ టెక్స్‌టైల్ హబ్‌లను అభివృద్ధి చేస్తామనీ అలాగే సంప్రదాయ ఆలోచనలతో పాటు



ఆధునిక పరికరాలతో కలిపి డిజైన్, కట్టింగ్, స్టిచింగ్‌లో యువతకు ముఖ్యంగా మహిళలకు శిక్ష ణనిస్తామని రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఈ సదస్సులో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర రావు, అధికారులు, జాతీయ, అంతర్జా తీయ ప్రతినిధులు పాల్గొన్నారు.

# రేవంత్ పోవాలి.. మార్పు రావాలి

**మొదటి పేజీ తరువాయి..**

కానీ పునరుద్ధరణ పై రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. కేంద్ర మంత్రి సీ.ఆర్. పాటిల్ కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై చేసిన వ్యాఖ్యలను తప్పుబ డుతూ మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బ్యారేజీలు మొత్తం ప్రాజెక్ట్‌లో చిన్న భాగమేనని తెలిపారు. ఈ మూడు బ్యారే జీలను పునరుద్ధరించడానికి సుమారు రూ.500 కోట్లలోపే ఖర్చవుతుందన్నారు. కానీ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక వచ్చినా అమలు చేయలేదని గుర్తు చేశారు. ప్రాణహిత నది జలాలను విని యోగించుకునే విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫల మైందని, కనీసం సరైన డిజైన్ కూడా రూపొందించలేదని అన్నారు. బడ్జెట్‌లో కేవలం రూ.152 కోట్లు మాత్రమే కేటాయించడం నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. కడెం, ఎస్ఆర్ఎస్‌పీ ద్వారా 100 టీఎంసీల నీటి లభ్యత ఉన్నప్పటికీ ప్రభుత్వం దానిపై దృష్టి పెట్టడం లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ తెలంగాణకు జీవనాధారమని, హైద రాబాద్ తాగునీరు, పారిశ్రామిక అవసరాలు, మూసి ప్రక్షాళన అన్నీ దీనిపైనే ఆధారపడుతున్నాయని చెప్పారు. మేడిగడ్డ పునరుద్ధరణ చేపట్టకపోతే దాదాపు 18 లక్షల ఎకరాల సాగు భూమి, హైదరాబాద్ అవసరాలు తీవ్రంగా ప్రభావితమవుతాయని హెచ్చరించారు. వాతా వరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోతే తెలంగాణ ఎడారిగా మారే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బ్యారేజీల పునరుద్ధరణను తక్షణమే చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని, లేకపోతే ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని తెలంగాణ సమాజం క్షమించదని జీవన్ రెడ్డి హెచ్చరించారు.

**అభిమానానికి కృతజ్ఞతలు...**

ప్రజా సేవ చేసే విషయంలో తప్పకుండా ఏదో ఒక పార్టీలో చేరాల్సిన ఆవశ్యకత ఉందన్న జీవన్ రెడ్డి భవిష్యత్ రాజకీయ నిర్ణయాలు అభిమానులు అనుచ రుల అభిప్రాయం మేరకు తీసుకుంటానని అన్నారు. తనపై బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు చూపుతున్న అభి మానానికి కృతజ్ఞతలు తెలిపారు. త్వరితగతిన నిర్ణయం తీసుకోవాల్సి ఉన్న మరో రెండు వారాల్లో తాను ఏ పార్టీలో చేరుతాననేది మీడియా ద్వారానే ప్రకటిస్తానని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా.. గతంలో కాళేశ్వరం ప్రాజెక్టు పై విమర్శనాత్మక ధోరణిలో మాట్లాడిన జీవన్ రెడ్డి కేంద్రమంత్రి సీ.ఆర్. పాటిల్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తూ.. రాష్ట్ర ప్రభుత్వాన్ని కడిగేయడం చూస్తే ఆయన బీఆర్ఎస్ లో చేరడం ఖాయమనే సంకేతాలు కనిపిస్తు న్నాయి.

**ఈ నెల 15న కారెక్కనున్న జీవన్ రెడ్డి..?**

బీఆర్ఎస్ లో జీవన్ రెడ్డి చేరికకు మూహూర్తం ఫిక్స్ అయినట్లు ప్రచారం జరుగుతున్నది. ఈ నెల 13న ఆయన గులాబీ కండువా కప్పుకోబోతున్నట్లు విశ్వసనీ యంగా తెలిసింది. అమెరికా పర్యటనలో ఉన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ ఈ నెల 7న జగిత్యాలకు వెళ్లి జీవన్ రెడ్డితో భేటీ అవుతారని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ సందర్భంగా కేటీఆర్... జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించనున్నట్లు తెలిసింది.

# వరంగల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఏసీబీ దాడులు

### బట్టబయలైన సబ్ రిజిస్ట్రార్ల అక్రమ లావాదేవీలు
### వెలుగుచూసిన అనధికారిక వ్యక్తులతో చీకటి ఒప్పందాలు
### 70 డాక్యుమెంట్లు స్వాధీనం
### డాక్యుమెంట్ రైటర్ల ద్వారా ఇద్దరు సబ్ రిజిస్ట్రార్ల లంచాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 03 (వుదయం ప్రతినిధి) :** వరంగల్ జిల్లాలో ఇద్దరు సబ్ రిజిస్ట్రార్ల అవినీతి బాగోతం బట్టబయ లైంది. అక్రమ లావాదేవీలు, అనధికారిక వ్యక్తులతో వారు సాగిస్తున్న చీకటి ఒప్పందాలు వెలుగులోకి వచ్చాయి. తమ కార్యాలయంలో ఇద్దరు వ్యక్తులను అనధి కారికంగా డాక్యుమెంట్ రైటర్లుగా నియ మించుకున్న సదరు సబ్ రిజిస్ట్రార్ల అవినీతి లెక్క తేల్చే పనిలో ఏసీబీ నిమగ్నమైంది. శుక్రవారం వరంగల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అవినీతి అక్రమాలపై మెరుపు దాడులు నిర్వహించిన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు.. సబ్ రిజిస్ట్రార్లు జమాలపురం రామ్ నర్సింహా రావు, దేవులూరి ఆనంద్ లు అవినీతి పాల్పడుతున్నట్లు గుర్తించింది. వీరిద్దరూ డాక్యుమెంట్ రైటర్లతో కలిసి రిజిస్ట్రేషన్ల పేరుతో భారీగా వసూళ్లకు పాల్పడుతు న్నారు. కేవలం ఈ అనధికారిక రైటర్లు పంపిన పత్రాలను మాత్రమే సబ్ రిజిస్ట్రార్లు ప్రాధాన్యత ఇచ్చి రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు ఏసీబీ అధికారుల తనిఖీల్లో తేలింది. సబ్ రిజిస్ట్రార్లు, డాక్యుమెంట్ రైటర్ల మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలు వాట్సాప్ చాట్ ద్వారా బట్టబయల య్యాయి. ఈ క్రమంలో కార్యాలయంలో రిజిస్ట్రేషన్ పూర్తి కాని సుమారు 70 డాక్యు మెంట్లను అధికారులు స్వాధీనం చేసుకు న్నారు. గత ఏడాది కాలంలోనే డాక్యుమెంట్ రైటర్ల ద్వారా ఈ ఇద్దరు అధి కారులు సుమారు రూ. 42 లక్షలను లంచంగా తీసుకున్నట్లు ఏసీబీ ఆధారాలు సేకరించింది.



**సబ్ రిజిస్ట్రార్ల నివాసాల్లోనూ..**

కార్యాలయంలో సోదాల అనంతరం ఏసీబీ బృందాలు ఇద్దరు సబ్ రిజిస్ట్రార్ల నివాసాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టాయి. వీరి ఇళ్లలో లక్షలాది రూపాయల నగదుతో పాటు భారీగా అక్రమ ఆస్తులకు సంబంధించిన పత్రాలను అధికారులు కనుగొన్నారు. ఇక్కడ ఓ షాకింగ్ అంశం వెలుగు లోకి వచ్చింది. ఓ అధికారి ఇంట్లో రిజిస్ట్రే షన్ చేయని 254 ప్రభుత్వ పత్రాలు లభించడం అధి కారులను సైతం విస్మ యానికి గురిచేసింది. ప్రభుత్వ కార్యాల యంలో ఉండాల్సిన పత్రాలు అధికారుల ఇళ్లలో ఎందుకు ఉన్నాయనే కోణంలో ఏసీబీ దర్యాప్తు చేస్తోంది. ప్రభుత్వ నిబంధ నలను తుంగలో తొక్కి, సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఈ ఇద్దరు అధి కారులపై ఏసీబీ కేసులు నమోదు చేసింది. ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న నగదు, డాక్యుమెంట్లు, డిజిటల్ ఆధారాలను పరి శీలిస్తున్నారు.

# గాలికి గిరిజనుల సంక్షేమం

## మాజీ మంత్రి హరీశ్‌రావు



**హైదరాబాద్, ఏప్రిల్ 03 (వుదయం ప్రతినిధి) :** తెలం గాణలో గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం బీఆర్ఎస్ ప్రభు త్వంతోనే సాధ్యమైందని మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. తమ పాలనలో ఎస్టీ కార్పొరేషన్ ద్వారా రూ.వేల కోట్లు ఇచ్చామన్న హరీశ్‌రావు ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థులకు కనీసం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు కూడా ఇవ్వడం లేదని ఆక్షే పించారు. నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజక వర్గంలోని తిమ్మారెడ్డి పల్లి, కొత్తపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంత్ సేవాలాల్ కార్పొరేషన్‌కు రూ.వంద కోట్లు ప్రకటించి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ఎస్టీల ఓట్లు కావాలిగానీ, వాళ్ల సంక్షేమం పట్టించుకోరా?అని ప్రశ్నించారు. కేరళలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. తెలంగాణలో ఆరు గ్యారెం టీలను అమలు చేశామని బడాయి మాటలు చెబుతు న్నారని విమర్శించారు.దశాబ్దాల కాలంగా గిరిజనులు కలలుగన్న “మా తండాలో మా రాజ్యం” నినాదాన్ని నిజం చేసింది కేసీఆర్ మాత్రమేనని హరీష్ రావు గుర్తు చేశారు. గత కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు పట్టించుకోని 3,100 గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత బీఆర్ఎస్‌దేనని ఆయన పేర్కొన్నారు. విద్య , ఉద్యోగాల్లో గిరిజనుల రిజర్వేషన్లను ఆరు శాతం నుంచి పది శాతానికి పెంచడంతో నేడు వేలాది మంది గిరిజన బిడ్డలు డాక్టర్లు, ఇంజనీర్లుగా ఉన్నత పదవుల్లో స్థిరపడుతున్నారని ఆయన వివరించారు. గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా రాష్ట్ర పండుగగా ప్రకటించి, నిధులు కేటాయించి ఊరూరా ఘనంగా నిర్వహించేలా చేశామ న్నారు. పోడు భూములకు పట్టాలు ఇస్తామని చెప్పి కేసీఆర్ 6 లక్షల ఎకరాలకు పట్టాలు పంపిణీ చేయడంతో పాటు వారికి రైతుబంధు, రైతు బీమా వంటి సౌకర్యాలను కల్పించారని హరీష్ రావు తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో లంబాడాలకు కనీసం మంత్రి పదవి కూడా లేదని, గిరిజనులను కేవలం ఓట్ల కోసమే వాడుకుంటున్నారని ఆయన విమర్శించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధిని కాంగ్రెస్ గాలికొదిలేసిం దని, ఇచ్చిన హామీలన్నీ బుట్టదాఖలు అయ్యాయని ఆయన మండిపడ్డారు. కొత్తపల్లి ప్రాంతంలో రూ. 8 కోట్లతో బ్రిడ్జిని నిర్మించడంతో పాటు, రూ. 50 లక్షలతో బంజారా భవనాన్ని, బాపోజీ మహారాజ్ దేవాలయ అభి వృద్ధికి రూ. 80 లక్షల నిధులను మంజూరు చేయించి నట్లు ఆయన గుర్తు చేశారు.

# మంత్రులు, ఎమ్మెల్యేలను రాళ్లతోని కొట్టిస్తాం

### బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య
### ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేసేంత వరకు ఉద్యమం
### అధికార పార్టీ నేతలను బయట తిరగనివ్వం
### బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను చదువుకు దూరం చేసే కుట్ర

**హైదరాబాద్, ఏప్రిల్ 03 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొం టోన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యను పరిష్కరించకపోతే.. మంత్రులు, ఎమ్మె ల్యేలను రాళ్లతోని కొట్టిస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ అధికార పార్టీ నేతలను బయట తిరగనివ్వబోమని స్పష్టం చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చదువుకోకూడదనే దురుద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించడం లేదని ఆరోపిం చారు. శుక్రవారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. పిల్లలు చదువుకుంటుంటే కూడా ఓర్వలేకపోతున్నా రని ఆరోపించారు. ప్రతి ఒక్కరూ రాష్ట్ర ఖజానాని దోచుకుంటున్నారని మండిప డ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై వందల సార్లు ధర్నాలు, పోరాటాలు చేశామ న్నారు. దివంగత సీఎం వైఎస్ఆర్ పేద విద్యార్థులకు న్యాయం జరగాలని రీయింబర్స్‌మెంట్ తీసుకొచ్చారన్న కృష్ణయ్య... నేటి సీఎం మాత్రం దాన్ని ఓర్వలే కపోతున్నారని విమర్శించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీలో ప్రతి పక్షాలు సైతం ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై వాకౌట్ చేయలేదని మండిపడ్డారు.


# బీజేపీపై సీఎం అసత్య ప్రచారం

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
### ఆరు గ్యారంటీల్లో ఎన్ని అమలు చేసిందో కాంగ్రెస్ చెప్పాలి
### గతంలో కేసీఆర్.. ఇప్పుడు రేవంత్
### తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారు



**హైదరాబాద్, ఏప్రిల్ 03 (వుదయం ప్రతినిధి) :** కేరళ ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేశారని కేంద్ర బొగ్గుగ నుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఆరు గ్యారంటీల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. వాటిలో ఎన్ని నెరవేర్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగా ణలో ఏం చేశారని, కేరళలో రేవంత్‌రెడ్డి ప్రచారం చేస్తున్నారని ప్రశ్నించారు. గతంలో కేసీఆర్ చేసిన తరహాలోనే రేవంత్‌రెడ్డి కూడా ప్రజలను మోసం చేస్తు న్నారన్నారు. శుక్రవారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ బీసీలకు అన్యాయం చేసిందని ఆరోపి స్తోన్న కాంగ్రెస్ మరి ఆ వర్గానికి ఏం చేసిందో రేవంత్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసగించింది కాంగ్రెస్ పార్టీ యేనని దుయ్యబట్టారు. ఆరు గ్యారంటీలు అమలు చేసినట్లు కేరళలో గొప్పలు పలు కుతున్న రేవంత్.. భవిష్యత్‌లో తెలంగా ణలోనూ అదే తరహా మాటలు చెప్పే ప్రమాదముందని అన్నారు. పదేళ్ల పాటు కేసీఆర్ ప్రజలను మోసం చేస్తే, ఇప్పుడు రేవంత్‌రెడ్డి కూడా అదే పని చేస్తున్నారని ఆరోపించారు.

## చమురు, ఎల్ఎన్‌జి సరఫరాలపెంపునకు
# రష్యా సిద్ధం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 (వుదయం) :** పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న యుద్ధం ప్రపంచ ఇంధన సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తున్న నేపథ్యంలో, భారతదే శానికి చమురు, ద్రవీకృత సహజ వాయువు (ఎల్ఎన్‌జి ) సరఫరాలను పెంచగలమని రష్యా శుక్రవారం హామీ ఇచ్చింది. భారతదేశంలో తన అధికారిక పర్యటన సందర్భంగా రష్యా తొలి డిప్యూటీ ఛైర్మన్ డెనిస్ మాంతురోవ్ మాట్లాడుతూ.. భారత్‌లో పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి ఇంధన ఎగుమ తులను క్రమంగా పెంచే సామర్థ్యం రష్యా కంపెనీలకు ఉందని అన్నారు. భారత్‌లో రష్యా ఎంబసీ ప్రకారం, 2025 చివరి నాటికి, భారతదేశానికి ఖనిజ ఎరువుల సరఫరాను రష్యా 40 శాతం మేర పెంచిందని కూడా మాంతురోవ్ పేర్కొన్నారు. కేవలం ఇంధన రంగానికి మాత్రమే పరిమితం కాని ఈ భాగస్వామ్య ప్రాముఖ్యతను ప్రతిబిం బిస్తూ, భారతదేశ అవసరాలను తీర్చడాన్ని కొనసాగించడానికి మాస్కో సిద్ధంగా ఉందని ఆయన వివరించారు. భారత మార్కెట్‌కు చమురు, ద్రవీకృత సహజ వాయువు సరఫరాలను క్రమంగా పెంచే సామర్థ్యం రష్యా కంపెనీలకు ఉందని డెనిస్ మాంతురోవ్ ధృవీకరిం చారు. అణుశక్తి రంగంలో రష్యా, భారత్ తమ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకుంటున్నాయి. అంగీక రించిన షెడ్యూల్ల ప్రకారం, కుదంకుళం అణు విద్యుత్ కేంద్రం కోసం విద్యుత్ యూనిట్లను నిర్మించే ప్రాజెక్టును అమలు చేస్తున్నారు, అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. యూరియా ఉత్పత్తి కోసం ఒక ఉమ్మడి ప్రాజెక్ట్ ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉందని, ఇది ఇరు దేశాల మధ్య దీర్ఘకాలిక వ్యవసాయ సహకారానికి తోడ్పడుతుందని భావిస్తున్నట్లు మాంతురోవ్ తెలిపారు. దీనితో పాటు, అణుశక్తి రంగంలో కొనసాగుతున్న సహకారానికి ఇరుపక్షాలు తమ నిబద్ధ తను పునరుద్ఘాటించాయి. కుదంకుళం అణు విద్యుత్ కేంద్రంలో కొత్త పవర్ యూనిట్ల పనులు అంగీకరిం చిన కాలపరిమితుల ప్రకారం పురోగమి స్తున్నాయి, ఇది ఈ రంగంలో స్థిరమైన సహకారాన్ని సూచిస్తోంది. రష్యా, భార తదేశం అణుశక్తి రంగంలో దీర్ఘకాలంగా భాగస్వాములుగా ఉన్నాయి. ఈ ప్రాజెక్ట్ వారి వ్యూహాత్మక సంబంధాలలో ఒక కీల కమైన స్తంభంగా నిలుస్తుంది. ఇంధనం, ఎరువులకు అతీతంగా, పరిశ్రమ, అంత రిక్షం, విద్య, ఆవిష్కరణ వంటి రంగాలలో సహకారాన్ని విస్తరించడంపై కూడా ఈ పర్యటన సందర్భంగా చర్చలు జరిగాయి. భారత్–రష్యా అంతర ప్రభుత్వ కమిష న్‌కు సహ–అధ్యక్షుడిగా ఉన్న మాంతు రోవ్, విదేశాంగ మంత్రి ఎస్ జయశం కర్‌తో వాణిజ్యం, అనుసం ధానం, సాంకేతికత, కీలక ఖనిజాలపై దృష్టి సారించి చర్చలు జరిపారు. వాణిజ్యం, పరిశ్రమ, ఇంధనం, ఎరువులు, అనుసంధానం, రవాణాతో పాటు సాంకేతికత, ఆవిష్కరణ, కీలక ఖనిజాల్లోని కొత్త అవకాశాలపై ఇరుప క్షాలు విస్తృత చర్చలు జరిపాయి. గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన 23వ భారత్–రష్యా వార్షిక శిఖరాగ్ర సమావే శంలోని వివిధ ఫలితాల అమలులో పురోగతిని కూడా ఇరుపక్షాలు సమీక్షిం చాయి. పశ్చిమాసియాలోని సంఘర్ష ణతో సహ ప్రాంతీయ, ప్రపంచ పరిణా మాలపై కూడా సహ–అధ్యక్షులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు, అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



# గ్రేటర్ హైదరాబాద్



## హరీష్ రావుకు ఘన స్వాగతం



**షాద్ నగర్, ఏప్రిల్ 3 (వుదయం) :** బిఆర్ఎస్ మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే టి హరీష్ రావు కు రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ లో ఘన స్వాగతం లభించింది. షాద్ నగర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే సీనియర్ నేత వై అంజయ్య యాదవ్ తదితర పార్టీ నేతల ఆధ్వర్యంలో హరీష్ రావుకు స్వాగతం పలికారు. కొడంగల్ నియోజకవర్గం కోస్గి మండలంలోని తిమ్మారెడ్డిపల్లి లో వెలసిన శ్రీ గురు లోకానందు సంత్ మహారాజ్ దేవస్థానం జాతర ఉత్సవాలకు బయలుదేరి వస్తున్న హరీష్ రావు షాద్ నగర్ చేరుకోగానే రోడ్డుపై అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో వందల నదిగా కార్యకర్తలు తరలివచ్చి స్వాగతం పలికారు. నియోజకవర్గం లోని ఆయా మండలాలు గ్రామాల నుండి అభిమానులు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. హరీష్ రావు జిందాబాద్ అంజన్న జిందాబాద్ అంటూ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా హరీష్ రావు పై అభిమానులు పూల వర్షం కురిపించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య తో పాటు మాజీ జెడ్పి వైస్ చైర్మన్ ఈట గణేష్,రాష్ట్ర సహకార సంఘం కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజవరప్రసాద్, మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్, లంబాడి హక్కుల పోరాట సమితి నాయకులు రాంబాబు నాయక్ మిట్టు నాయక్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నటరాజ్ మాజీ కౌన్సిలర్లు తదితరులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## ఐక్యతకు ప్రతీక జానంపేట వెంకటేశ్వర ఆలయం

### షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు



**షాద్ నగర్, ఏప్రిల్ 3 (వుదయం) :** చుట్టూ ముట్టు సవైకోట.. సుందరమైన జానంపేట.. అంటూ అప్పట్లో ఇక్కడి ఆధ్యాత్మిక చరిత్ర గురించి పాటలు పాడుకున్నారు.. వర్తమానంలో కూడా పార్టీలకు అతీతంగా నాయకులు, మతాలకు అతీతంగా మానవత్వవాదులు.. జానంపేట శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రత్యేకతను నిలబెడుతూ వస్తున్నారు.. ఒక విధంగా బ్రహ్మోత్సవాల విజయోత్సవానికి కూడా కారణం ఇదే.. అని షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు అన్నారు. ఫరూక్ నగర్ మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల విజయవంతం అనంతరం శుక్రవారం భక్తులతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా "బక్కని" మాట్లాడుతూ ఆ రోజుల్లో సవై అంటే హీరో అని అర్థం ఉండేదని, అలాంటి బిరుదు పొందిన పూర్వ రాజు సవై వెంకటరెడ్డి తన తల్లి జానమ్మ పేరిట ఈ ఆలయాన్ని నిర్మించారని గుర్తు చేశారు. షాద్ నగర్ నియోజకవర్గంలో చారిత్రాత్మక ప్రాంతాలకు కూడా పేర్లు పెట్టినట్లు తెలిపారు. సవై వెంకట్ రెడ్డి తల్లి జానమ్మ పేరిట జానంపేట, భార్య కేశమ్మ పేరిట కేశంపేట నిర్మించారని గుర్తు చేశారు. ప్రతి ఏటా ఇక్కడ ఘనంగా వేడుకలు జరుగుతున్నాయని, పార్టీలు ఏవైనా ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు వచ్చి ఈ కార్యక్రమాలలో పాల్గొని ఐక్యతను చాటుతున్నారని తెలిపారు. ఎలాంటి రాజకీయాలకు ఆస్కారం లేని ఆలయంగా ఈ ఆలయం గుర్తింపు పొందిందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, గత ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, సి.ప్రతాప్ రెడ్డి తదితరులు ఆలయ ఉత్సవాలకు సహకరిస్తున్నారని అన్నారు. అదేవిధంగా మీడియా సహకారం కూడా మరువలేనిదని ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయిశ్వర్ రెడ్డి, కుమార్ గౌడ్, ఒగ్గు కిషోర్, కానుగు అంతయ్య, నర్సింలు గుప్తా, అంజయ్య, భూపాల్, బాల్ రెడ్డి, యాదయ్య తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 3 (వుదయం ప్రతినిధి ):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 125 గాజుల రామారం డివిజన్ హెచ్ఏఎల్ కాలనీలో శ్రీ లలితా భక్త మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివెంద్రాన్ని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవిలో చలివేంద్రాల ఏర్పాటు ద్వారా దాహార్తిని తీర్చడం మాధవ సేవతో సమానమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగన్, శ్రీ లలితా భక్త మండలి సభ్యులు ప్రమీలా, లక్ష్మీ సామ్రాజ్యం, విజయలక్ష్మి, కళ్యాణి, అనిత, ధనలక్ష్మి, సంధ్య, సుమతి, అరుణ, భారతి, కాలనీవాసులు ఆంజనేయులు, వీరయ్య చౌదరి, పానకాలు, సుమన్, మహేష్, మధుసూదన్ రావు, మూర్తి, పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, తెలంగాణ సాయి, సుంకరి చందు, చెట్ల వెంకటేష్, బోయిని మహేష్, చిన్న చౌదరి, రాములు గౌడ్, చంద్రశేఖర్ గౌడ్, నవీన్ దండుగుల, మల్లేష్, సంగమేష్, ప్రసాద్, శివా నాయక్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## శివాలయంలో మండల వార్షికోత్సవం

### ప్రత్యేక పూజలు పాల్గొన్న మహిళ భక్తులు



**జిన్నారం, ఏప్రిల్ 3(వుదయం ప్రతినిధి) :** జిన్నారం మున్సిపల్ కేంద్ర శివారులోని తాబేలు గుట్టపై శ్రీ జీవన జ్యోతిర్లింగాలయం 41వ మండల వార్షికోత్సవాన్ని శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేడుకల్లో భాగంగా తెల్లవారుజాము నుంచే ఆలయంలో పంచామృతాభిషేకం, యజ్ఞం, లక్ష బిల్వార్చన, పుష్పాభిషేకం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలకు సదాశివపేట తంగేడుపల్లి మండలం జంగమయ్య గుట్ట గురు గంగాధర స్వామి మఠం శివయోగి శివాచార్య స్వామి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కుంకుమార్చన పూజలు నిర్వహించిన మహిళా భక్తులకు ప్రవచనాలను బోధించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు మహిళా భక్తులు భారీగా తరలిరావడంతో జిన్నారంలో సందడి నెలకొంది. ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మారుమోగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విలీన గ్రామాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

### ఐదు నూతన డివిజన్ల ఏర్పాటుకు ప్రయత్నాలు





**అమిన్ పూర్,ఏప్రిల్ 3 (వుదయం):** విలీన గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ మౌలిక వసతుల కల్పనకు కట్టుబడి ఉన్నామని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. అమీన్‌పూర్ డివిజన్ పరిధిలోని వడకపల్లి, కిష్టారెడ్డిపేట, ఐలాపూర్, సుల్తాన్పూర్, దయార, పటేల్‌గూడ, ఐలాపూర్ తండా, జానకంపేట గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. శుక్రవారం అమీన్‌పూర్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, ఇంజినీరింగ్ ఈఈ సురేష్ తదితర అధికారులతో కలిసి ఎమ్మెల్యే గ్రామాల్లో పర్యటించి అభివృద్ధి పనులను సమీక్షించారు. పెండింగ్ పనుల పురోగతి, కొత్తగా చేపట్టే ప్రాజెక్టులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ అధికారులను ఆదేశించారు.

కిష్టారెడ్డిపేట జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవన నిర్మాణం ఆలస్యంగా సాగుతుండటంపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, రాబోయే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. వడకపల్లి గ్రామంలోని పురాతన కోట అభివృద్ధికి హెచ్ఎండిఏ నిధులతో రాక్ పార్క్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. సుల్తాన్పూర్‌లో మోల్డ్‌టెక్ సంస్థ సహకారంతో రూ.1 కోటి వ్యయంతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనానికి త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. అమీన్‌పూర్, పటాన్‌చెరు సర్కిళ్లలో పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని మరో ఐదు కొత్త డివిజన్లు ఏర్పాటు చేయాలని ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. దీనిపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం దయార గ్రామంలో యూత్ బిల్డింగ్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## యేసుక్రీస్తు ప్రపంచ మానవాళికి ఆదర్శం

### గుడ్ ఫ్రైడే సందర్భంగా శాంతి ర్యాలీ



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 3 (వుదయం ప్రతినిధి ):** నిజాంపేట్ సర్కిల్, బాచుపల్లి పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ నగర్, బాచుపల్లి లో గుడ్ ఫ్రైడే సందర్భంగా శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ శాంతి ర్యాలీలో యేసు క్రీస్తు మరణము ఆయన పునరుద్దానము గురించి తెలియజేస్తూ ఆయన బోధల గురించి వివరించారు.

బాచుపల్లి పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ అధ్యక్షులు యెహోషువా పుచ్చకాయల (జాషువా) మాట్లాడుతూ యేసుక్రీస్తు ప్రపంచ మానవాళి పాపముల నిమిత్తము, శాపముల నిమిత్తము సిలువలో మరణము పొంది మూడవ దినమున మరణమును జయించి సమాధిని నుండి తిరిగి లేవడం జరిగిందని తెలిపారు. అనంతరం చర్చిలో ప్రార్థనలు చేసారు. ఈ శాంతి ర్యాలీలో 200 మంది క్రైస్తవులు, బాచుపల్లి పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ వర్కింగ్ ప్రెసిడెంట్ పాస్టర్ ఎన్ స్టీఫెన్ పాల్, వైస్ ప్రెసిడెంట్ జే. ప్రభుదాస్, జనరల్ సెక్రెటరీ సీజీమ్ పాస్టర్ సీమోన్, ట్రెజరర్ పాస్టర్ పి సేతు, అడ్వైజర్స్ పాస్టర్ ఆర్ యెహోషువ, రెవరెండ్ డా .పుల్లారావు, కె.అబ్రాహాము, పాస్టర్ బి జేమ్స్, పాస్టర్ దేవరాజు, పాస్టర్ సైమన్, పాస్టర్ విజయకుమార్, పాస్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## కౌన్సిలర్ చొరవతో తాగు నీటి ఎద్దడి చర్యలు



**జిన్నారం ఏప్రిల్ 3(వుదయం ప్రతినిధి) :** గడ్డపోతారు మున్సిపాలిటీ పరిధిలోని దాచారం గ్రామంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా వార్డు కౌన్సిలర్ ఇంద్రసేన చర్యలు తీసుకున్నారు. గ్రామంలో గత కొంతకాలంగా తీవ్ర నీటి ఎద్దడి తలెత్తడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుసుకొని శుక్రవారం బోరు మోటార్ను ఏర్పాటుచేసి ప్రారంభించారు. దీంతో గ్రామ ప్రజల దాహార్తిని తీర్చడంతో వార్డు ప్రజలు కౌన్సిలర్ కు ధన్యవాదాలు తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## 50 వేల విరాళం



**జిన్నారం ఏప్రిల్ 3(వుదయం ప్రతినిధి):** గడ్డపోతారం మున్సిపాలిటీ మాదారం గ్రామంలో 42 అడుగుల శ్రీ పంచముఖ హనుమాన్ విగ్రహం సందర్శించి నీలం మధు ముదిరాజ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... హనుమంతుడు బలానికి సాటిలేని శక్తికి నిస్వార్థ సేవకు నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా నిర్మాణ కమిటీకి రూ.50,000 విరాళం అందజేశారు. భారీ విగ్రహం ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు కమిటీ సభ్యులు యువకులు పాల్గొన్నారు.

## 79 వాణిజ్య దుకాణాల బహిరంగ వేలం

### ఏప్రిల్ 10న చేవెళ్ల ఆర్డిఓ కార్యాలయంలో వేలం పాటలు

### ఈఎండి రూ.36 వేలు తప్పనిసరి

**శంకర్‌పల్లి, ఏప్రిల్ 03 (వుదయం) :** శంకర్‌పల్లి పట్టణ సమీపంలో నిర్మించిన 2బిహెచ్ కే హౌసింగ్ కాలనీలో ఖాళీగా ఉన్న వాణిజ్య దుకాణాలను "ఉన్నది ఉన్నట్లుగా" విక్రయించేందుకు జిల్లా కలెక్టర్/ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (హౌసింగ్) ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు శంకర్‌పల్లి డిప్యూటీ తహసిల్దార్ బాలకృష్ణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ రంగారెడ్డి జిల్లా ఆదేశాల మేరకు ఈ వేలం పాటలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

ఈ బహిరంగ వేలం పాటలు ఈ నెల 10వ తేదీన చేవెళ్ల ఆర్డిఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9:30 గంటల నుండి 11:00 గంటల వరకు వేలం ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వ్యాపారులు, పెట్టుబడిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

2బిహెచ్ కే హౌసింగ్ కాలనీలో మొత్తం 79 వాణిజ్య దుకాణాలు ఉన్నాయని, వీటి విస్తీర్ణం 60 చదరపు అడుగుల నుంచి 180 చదరపు అడుగుల వరకు ఉంటుందని వివరించారు. ఈ షాపుల విక్రయానికి సంబంధించి ప్రభుత్వం కనీస ధరను చదరపు అడుగుకు రూ.2200/గా నిర్ణయించినట్లు తెలిపారు. వేలం పాటల ద్వారా షాపులను విక్రయించనున్నందున పోటీ ధరలకు అవకాశం ఉంటుందని అన్నారు.


వేలంలో పాల్గొనదలచిన వారు ముందుగా ఈఎండి (ఈఎండీ)గా రూ.36,000/ చెల్లించి మాత్రమే వేలం పాటలో పాల్గొనాలని స్పష్టం చేశారు. చెల్లింపు విధానం జాతీయ/షెడ్యూల్డ్ బ్యాంకు ద్వారా "జిల్లా కలెక్టర్ రంగారెడ్డి జిల్లా" పేరిట డిమాండ్ డ్రాఫ్ట్ (డీడీ) తీసుకుని సమర్పించాల్సి ఉంటుందని వెల్లడించారు.

ఇందుకు సంబంధించి మరిన్ని వివరాలు లేదా సందేహాల నివృత్తి కోసం పీడీ హౌసింగ్ కార్యాలయం మేనేజర్ ఫోన్ నంబర్ 9063191168, పీడీ హౌసింగ్ 8712032727, అలాగే ఆర్డిఓ చేవెళ్ల కార్యాలయం డిప్యూటీ తహసిల్దార్ నంబర్ 8008013151ను సంప్రదించాలని డిప్యూటీ తహసిల్దార్ బాలకృష్ణారెడ్డి సూచించారు. ఈ వేలం పాటల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.



## ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు

### ఎమ్మెల్యే కాలే యాదయ్య నివాళులు



**చేవెళ్ల, ఏప్రిల్ 3 (వుదయం)** తెలంగాణ తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య 99వ జయంతి సందర్భంగా చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ...దొడ్డి కొమురయ్య తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తొలి అమరవీరుడిగా చరిత్రలో నిలిచారని గుర్తు చేశారు.1946లో జరిగిన పోరాటంలో రైతుల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసి, అన్యాయానికి వ్యతిరేకంగా పోరాటానికి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు.అన్యాయం ఎదురైనప్పుడు మౌనంగా ఉండకుండా ధైర్యంగా ఎదిరించాలి అనే గొప్ప సందేశాన్ని ఆయన జీవితం మనకు అందిస్తుందని తెలిపారు. సమాజంలో సమానత్వం, న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.యువత ఆయన చూపిన మార్గంలో నడిచి, సమాజానికి ఉపయోగపడేలా విద్యతో పాటు మంచి విలువలను అలవరచుకోవాలని సూచించారు. దొడ్డి కొమురయ్య త్యాగం వృథా కాకుండా ఆయన ఆశయాలను కొనసాగించడం ద్వారానే నిజమైన నివాళి అర్పించినట్టవుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దేవరి సమత వెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ రాము గౌడ్, కౌన్సిలర్లు బండారి శైలజ నాగిరెడ్డి, మద్దెల శ్రీనివాస్, మంగలి కళ్యాణి, కృష్ణా నాయక్, తాళ్లపల్లి నర్సింలు, పెద్దోళ్ల దయాకర్, కరికే మీనాక్షి, దూత మల్లేష్,తదితరులు, కురుమ సంఘం నాయకులు, కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా సేవకే 'సీకేజీ' కార్యాలయం

### మున్సిపల్ కేంద్రంలో భూమి పూజ



**గుమ్మడిదల, ఏప్రిల్ 3 (వుదయం):** ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు మున్సిపల్ కేంద్రంలో 'సీకేజీ' కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కార్యాలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యలకు వెంటనే పరిష్కారం చూపడమే ఈ కార్యాలయం లక్ష్యమని పేర్కొన్నారు.మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ ప్రజా సేవలో ముందుండి పనిచేస్తున్నారని ప్రశంసించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు విజయ్ భాస్కర్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సీకేజీ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

## జాగృతి రైతు విభాగానికి అధ్యక్షుడిగా మంచిరెడ్డి



**చేవెళ్ల, ఏప్రిల్ 3 (వుదయం) :** తెలంగాణ జాగృతి సంస్థలో కీలక నియామకం చోటు చేసుకుంది. తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత,శుక్రవారం రంగారెడ్డి జిల్లా రైతు విభాగం అధ్యక్షుడిగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన మంచిరెడ్డి విజయకిరణ్ రెడ్డిని నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి ప్రకటించారు.వ్యవసాయ రంగంపై పట్టు, పాడిపరిశ్రమపై అవగాహన కలిగిన నాయకుడిగా విజయకిరణ్ రెడ్డి జిల్లాలో గుర్తింపు పొందారు.తెలంగాణ జాగృతిలో సీనియర్ నాయకుడిగా పనిచేసిన అనుభవం ఆయనకు ఈ బాధ్యతలు దక్కడానికి కారణమైంది.ఈ సందర్భంగా కప్పాటి పాండురంగారెడ్డి మాట్లాడుతూ, రైతుల అభ్యున్నతే లక్ష్యంగా తెలంగాణ జాగృతి కృషి చేస్తోందని తెలిపారు.తెలంగాణ ఉద్యమం నుంచి ఇప్పటివరకు రైతుల సంక్షేమం కోసం సంస్థ నిరంతరం పనిచేస్తోందని పేర్కొన్నారు. కవితమ్మ నాయకత్వంలో రైతు విభాగం మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.జిల్లా వ్యాప్తంగా రైతుల సమస్యలను గుర్తించి, వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించడంలో కొత్త అధ్యక్షుడు కీలక పాత్ర పోషించాలని సూచించారు. అవసరమైతే రైతుల పక్షాన పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.ఇక తన నియామకంపై మంచిరెడ్డి విజయకిరణ్ రెడ్డి, మాట్లాడుతూ... తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రైతుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. సంస్థ బలోపేతం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు. జిల్లా అధ్యక్షుడు పాండురంగారెడ్డికి, సహకరించిన జాగృతి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## 3 నెలల రేషన్ పంపిణీ ప్రారంభం




**జిన్నారం ఏప్రిల్ 3 (వుదయం ప్రతినిధి) :** జిన్నారం మున్సిపల్ కేంద్రంలో అర్హులైన లబ్ధిదారులకు 3 నెలల రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ షాపుల ద్వారా ప్రతినెల పంపిణీ చేసే బియ్యం ఈ నెల ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మున్సిపల్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీలర్లు సూచించారు. దీంతో మూడు నెలలకు రేషన్ ఒకేసారి ఇవ్వడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.పంపిణీ కేంద్రం వద్ద లబ్ధిదారులు బారులు తీరారు. కార్యక్రమంలో రేషన్ షాపు నిర్వాహకులు, సిబ్బంది లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన



**జిన్నారం ఏప్రిల్ 3(వుదయం ప్రతినిధి) :** గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని చౌదరిగూడెంలో బొడ్రాయి ప్రతిష్ఠా మహోత్సవం భక్తిశ్రద్ధలతో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, రాష్ట్ర యువత నాయకులు వెంకటేష్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిమ్ముల గోవర్ధన్ రెడ్డి గ్రామాభివృద్ధికి రూ.50,000 విరాళం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. ఉత్సవాల నేపథ్యంలో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు గ్రామస్థులు భక్తులు పాల్గొన్నారు.

## మాజీ కౌన్సిలర్‌కు జన్మదిన శుభాకాంక్షలు



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 3 (వుదయం ప్రతినిధి) :** బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, దుండిగల్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ జక్కుల కృష్ణ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా దుండిగల్ మున్సిపల్ భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి కృష్ణ యాదవ్ ను వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.




"ఒక పార్టీ వైఖరి, నిజమైన ఓటర్ల ఓటు హక్కును హరించడం, నకిలీ ఓటర్లను సృష్టించడం, కులమతాల ఆధారంగా పంజాబ్‌లో ఘర్షణలను రేకెత్తించే ప్రయత్నాలు వంటి కీలక అంశాలకు సంబంధించినదై ఉన్నప్పుడు, వాటి గురించి మాట్లాడకుండా, ఎవరైనా సరే విమానాశ్రయంలో ఆహార ధరల గురించో లేదా డెలివరీ సమయాల గురించో మాట్లాడటం మొదలుపెడితే, ఆ వ్యక్తి వేరొకరి పక్షాన నిలబడి మాట్లాడుతున్నాడేమోనని మీకు సందేహం కలగదా? పార్లమెంటులో ఎవరైనా పార్టీ విప్‌ను పాటించకపోతే, వారు చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. రాఘవ చద్దా రాజీ పడ్డారా అని అడిగితే, అవును అనే అంటాను."

* భగవంత్ సింగ్ మాన్, పంజాబ్ ముఖ్యమంత్రి

## వే'మన'పద్యం

కానివానిచేత గాసు వీసంబిచ్చి
వెంట దిరుగువాడె వెర్రివాడు
పిల్లి తిన్నకోడి పిలిచిన పలుకునా
విశ్వదాభిరామ! వినురవేమ



## సంపాదకీయం

# రూపాయి విలువ భారీ పతనం!

డాలర్ తో రూపాయి విలువ ఇంతగా పడిపోవడం దేశ ఆర్ధిక వ్యవస్థకు అత్యంత అపాయకరం, కారణం జనజీవన యంత్రానికి మూల ఇంధనమైన ఆయిల్ ను 80 శాతం వరకు బయటి నుంచి తెచ్చుకోవడమే. దానికయ్యే ఖర్చును విధిగా డాలర్లలో చెల్లించవలసి రావడమే. డాలర్ తో రూపాయి విలువ తరిగిపోయి అది వెలవెలపోయినప్పుడెల్లా దేశంలో ధరలు ఊహించని స్థాయిలో పెరిగిపోయి బతుకులు మరింత దుర్భరమయిపోతాయి.చెంపదెబ్బ, గోడదెబ్బ అన్నట్టు భీషణమైన యుద్ధ సమయంలో మనకు వస్తున్న ఆయిల్, గ్యాస్ నౌకలు జలదిగ్బంధనం లో చిక్కుకున్న వేళ అంతర్జాతీయ మార్కెట్లో ఆయిల్ ధరలు అదనపు శిఖరాలెక్కి నిప్పులు చెరుగుతున్న తరుణంలో డాలరు విలువ 93 నుంచి 95 రూపాయలు దాటి పెరిగిపోవడం నిజంగా పిడుగుపాటే. గత ఏడాది అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మన దేశం మీద 50 శాతం మేరకు అదనపు సుంకాలు విధించిన నేపథ్యంలో గత డిసెంబర్ లో డాలర్ విలువ రూ 90 దాటిందిi ఇంకా నాలుగు మాసాలైనా కాకుండా రూ 95 దాటిందంటే మన కరెన్సీ ఎంత బలహీనంగా ఉందో అర్ధమవుతున్నది. సెంచరీ కొట్టడం ఇంకెంత దూరమూ లేదనిపించడం సహజం. దిగుమతుల ఖర్చు పెరిగి వాణిజ్య లోటు ఎక్కువ కావడం వల్లనే కకాకుండా దేశీయ స్టాక్ మార్కెట్లో గల తమ మదుపు డబ్బును విదేశీ మదుపరులు భారీ స్థాయిలో వెనక్కు తీసుకున్నప్పుడు సైతం డాలర్ తో రూపాయి విలువ దిగజారిపోతుంది.దాదాపు అన్ని దేశాలు ఎగుమతి దిగుమతులను అంటే విదేశీ వాణిజ్యాన్ని డాలర్లలోనే చేస్తున్నందున దానితో తమ నగదు విలువను కాపాడుకోడానికి చర్యలు తీసుకుంటాయి.

ఇందులో ప్రధానమైనది ఎగుమతులను పెంచుకోవడం ద్వారా విదేశీమారక ద్రవ్య (డాలర్ )నిల్వలను పెంచుకోవడం. రఘురామ్ రాజన్ రిజర్వు బ్యాంకు గవర్నర్ గా ఉన్నప్పుడు 2013 లో అమెరికా ఫెడరల్ బ్యాంకు డాలర్ల ముద్రణను పరిమితం చేసినప్పుడు దానితో రూపాయి విలువ పడిపోయింది. అప్పుడు ఆయన డాలర్లలో ప్రభుత్వ రుణాలు తీసుకోడాన్ని నిలిపివేయించాడు. అంటే ప్రభుత్వం తన అవసరాలకు డాలర్ బాండ్లను విడుదల చేసి విదేశీ రుణాలు తీసుకోవడానికి బదులు దేశీయ రుణాల మీద ఆధారపడేలా చేశాడు. రూపాయి పై జూదాన్ని బంద్ చేయించాడు.విదేశీ మదుపరులను ఆకట్టుకునే చర్యలను తీసుకున్నాడు. ప్రస్తుతం కూడా అటువంటి చర్యల అవసరం ఎంతైనా ఉంది. లేకపోతే డాలర్ తో రూపాయి విలువ వందకు చేరడానికి ఎంతో కాలం పట్టదు.

### రచనలు పంపండి



వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad – 500020

## మార్పు దిశగా అడుగా?..


*ఉపాధ్యాయ శిక్షణ, సాంకేతిక విద్య, ఉద్యోగ అవకాశాల అనుసంధానం వంటి అంశాలపై ప్రత్యేక అధ్యాయాలు ఉన్నాయి. అయితే, ప్రతి సంస్కరణకు మాదిరిగానే ఈ విధానంపై కూడా ప్రశ్నలు తలెత్తు తున్నాయి. తెలంగాణ ఎడ్యుకేషన్ స్టాండర్స్ అథారటీ వంటి నియంత్రణ వ్యవస్థలు ఉపాధ్యాయులపై అదనపు ఒత్తిడిని పెంచుతాయా? గ్రామీణ చిన్న పాఠశాలల భవిష్యత్తు ఏమవుతుంది? ఫీజు నియంత్రణ ప్రతిపాదనలు వాస్తవంగా అమలు అవుతాయా? అనే సందేహాలు సహజమే.*

# మరో ప్రయోగమా?

' మాకు గత 7 నెలలుగా జీతాలు లేవు. మా సమస్యలు చెప్పుకోవాలని జిల్లా కలెక్టర్‌ని కలవాలంటే గుట్ట దిగి 8 కిలోమీటర్లు కాలినడకన నడవాలి. ఉదయం 6 గంటలకు బయలు దేరితే కలెక్టర్ ఆఫీసుకు చేరుకునే సరికి మధ్యాహ్నం 3 అవుతుంది. కొన్ని సార్లు అధికారులు అప్పాయింట్ ఇవ్వక వెనక్కు తిరిగి పోవాల్సిన పరిస్థితులు. కలెక్టరమ్మతో మాట్లాడే అవకాశం దొరికినా ' పై అధికారులకు చెబుతాం అంటారు.'

**మౌలిక వసతుల కల్పన పై దృష్టి పెట్టక పోవడం ఈ నివేదికలో పెద్దలోపం. ఈ ఆర్టికల్ ప్రారంభంలో ప్రస్థావించిన అత్యంత వెనుక బడిన గుండాల వంటి గ్రామాల్లో విద్యార్థులు తాగడానికి కనీసం తాగునీరు కూడా అందుబాటులో లేదు. కూర్చోడానికి డెస్కులు లేవు. పాఠశాలలు శిథిలావస్తలో ఉన్నాయి. కొన్ని పత్రికా కథనాల ప్రకారం తెలంగాణలో 2,017 ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు, 4,000 బడుల్లో బాలురకు మరుగుదొడ్లు లేవు. 11,124 పాఠశాలలకు సరైన ట్యాప్‌వాటర్ సదుపాయం లేదు. 500 స్కూల్స్‌కి విద్యుత్ సౌకర్యం లేదు. ఈ సమస్యల పై ఆకునూరి మురళి టీమ్ అధ్యయనం చేసినట్టు లేదు. 'తెలంగాణ విద్యా విధానం 2026'లో విద్యాప్రమాణాలు , టీచర్ల అధిక వేతనాలను తగ్గించడం పై దృష్టి పెట్టారు కానీ, సర్వసాధారణ మౌలిక వసతుల స్థితి గతులపై చర్చించ లేదు. నెలల తరబడి జీతాలు అందక ఆందోళన పడుతున్న టీచర్ల గోడును పట్టించుకునే ఆలోచన లేదు.**

అంతే. ఇంత వరకు మా సమస్య పరిష్కారం కాలేదు, ఇలా అధికారుల చుట్టు మేం తిరుగుతుంటే విద్యార్థులకు పాఠాలు ఎవరు చెబుతారు?' అని ప్రశ్నించాడు మర్సుకోల అశోక్ . కొమురం భీమ్ అసిఫాబాద్ జిల్లా, తిర్యాణి మండలం, గుండాల గ్రామం గిరిజన పాఠశాలలో కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్‌గా పనిచేస్తున్నాడు. ఆయనతో పాటు అదే జిల్లాలో 34 మంది టీచర్ల పరిస్థితి కూడా అంతే. వారంతా జీతాలు అందక పోయినా , రహదారులు,కనీస వసతులు లేని చోట ఆదివాసీ బిడ్డలకు పాఠాలు బోధిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులిలా ఉండగా వీటిపై కనీస అధ్కయనం లేకుండా తెలంగాణ విద్యా విదానం (2026) నివేదికను రూపొందించారు,




తెలంగాణ విద్యా విధానం 2026

తెలంగాణ విద్యాకమిషన్ అధ్యక్షతన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి బృందం. ప్రీ–ప్రైమరీ నుంచి విశ్వవిద్యాలయాల వరకు సమగ్ర మార్పులను ప్రతిపాదించారు. రాష్ట్ర విద్యా వ్యవస్థను పునర్నిర్మించాలనే సంకల్పంతో ఒకే సమయంలో అభివృద్ధి, సమానత్వం, నాణ్యత అనే మూడు లక్ష్యాలను చేరుకోవాలని ప్రయత్నం ఈ నివేదికలో ఉంది కానీ, అన్ని విద్యా సంస్కరణల్లాగే ఇది కూడా ప్రశంసలతో పాటు అనేక ప్రశ్నలను సందేహాలను రేకెత్తిస్తోంది.

ఈ విధానం ప్రధానంగా 'నాణ్యమైన, సమగ్ర, సమాన విద్య' లక్ష్యంగా ప్రకటించుకుంది. అంగన్‌వాడీలను పాఠశాల వ్యవస్థలోకి తీసుకురావడం, ప్రాథమిక స్థాయిలోనే చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం చేసే ప్రాథమిక సామర్థ్యం, సంఖ్యలను అర్థం చేసుకోవడం, లెక్కలు చేయడం, గణితపు ప్రాథమిక నైపుణ్యం విద్యా విధానాల్లో ఇది సాధారణంగా 3వ తరగతి వరకు పిల్లలు తప్పనిసరిగా సాధించాల్సిన ప్రాథమిక విద్య. ప్రభుత్వ పాఠశాలలను తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌గా అభివృద్ధి చేయడం వంటి ప్రతిపాదనలు ఆశాజనకంగా కనిపిస్తున్నాయి. ఉపాధ్యాయ శిక్షణ, సాంకేతిక విద్య, ఉద్యోగ అవకాశాల అనుసంధానం వంటి అంశాలపై ప్రత్యేక అధ్యాయాలు ఉన్నాయి. అయితే, ప్రతి సంస్కరణకు మాదిరిగానే ఈ విధానంపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తెలంగాణ ఎడ్యుకేషన్ స్టాండర్స్ అధారటీ వంటి నియంత్రణ వ్యవస్థలు ఉపాధ్యాయులపై అదనపు ఒత్తిడిని పెంచుతాయా? గ్రామీణ చిన్న పాఠశాలల భవిష్యత్తు ఏమవుతుంది? ఫీజు నియంత్రణ ప్రతిపాదనలు వాస్తవంగా అమలు అవుతాయా? అనే సందేహాలు సహజమే. ఈ విధానం సిద్ధాంతంగా సమగ్ర దృష్టిని ప్రతిబింబించినా, దాని అసలైన పరీక్ష అమలులోనే ఉంటుంది. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు భాగస్వాములైతేనే ఇది ఫలిస్తుంది. లేకపోతే, మంచి సంకల్పం అధ్యయన పత్రాలకే పరిమితం కావచ్చు.

**మేలైన అంశాలు..** ప్రీ–ప్రైమరీ నుంచి ఉన్నత విద్య వరకు సమగ్ర దృష్టి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రత్యేక మోడల్ , ఉపాధ్యాయ శిక్షణకు ప్రాధాన్యం, ఫీజు నియంత్రణకు ప్రతిపాదనలు.

**ఆందోళన కలిగించే అంశాలు ...**

అధిక నియంత్రణ వల్ల ఉపాధ్యాయుల స్వతంత్రతను తగ్గించే ప్రమాదం ఉంది. ఉపాధ్యాయులపై పనితీరు ఆధారిత ఒత్తిడి పెరుగుతుంది. పబ్లిక్ స్కూల్స్ మోడల్ ప్రస్తుత ప్రభుత్వ పాఠశాలలకు ప్రత్యామ్నాయమా? చిన్న గ్రామీణ స్కూల్స్ భవిష్యత్తు ఏమవుతుంది? ఈ మోడల్ అమలుకు ఖర్చు ఎంత? అది ఆర్థికంగా సాధ్య మేనా? కార్పొరేట్ ఇంటర్ కాలేజీలపై నియంత్రణ సాధ్యమేనా? ఫీజు రెగ్యులారిటీ కమిషన్ నిజంగా ఫీజులు తగ్గించ గలదా?

మౌలిక వసతుల కల్పన పై దృష్టి పెట్టక పోవడం ఈ నివేదికలో పెద్దలోపం. ఈ ఆర్టికల్ ప్రారంభంలో ప్రస్థావించిన అత్యంత వెనుక బడిన గుండాల వంటి గ్రామాల్లో విద్యార్థులు తాగడానికి కనీసం తాగునీరు కూడా అందుబాటులో లేదు. కూర్చోడానికి డెస్కులు లేవు. పాఠశాలలు శిథిలావస్తలో ఉన్నాయి. కొన్ని పత్రికా కథనాల ప్రకారం తెలంగాణలో 2,017 ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు, 4,000 బడుల్లో బాలురకు మరుగుదొడ్లు లేవు. 11,124 పాఠశాలలకు సరైన ట్యాప్‌వాటర్ సదుపాయం లేదు. 500 స్కూల్స్‌కి విద్యుత్ సౌకర్యం లేదు. ఈ సమస్యల పై ఆకునూరి మురళి గారి టీమ్ అధ్యయనం చేసినట్టు లేదు. 'తెలంగాణ విద్యా విధానం 2026'లో విద్యాప్రమాణాలు , టీచర్ల అధిక వేతనాలను తగ్గించడం పై దృష్టిపెట్టారు కానీ, సర్వసాధారణ మౌలిక వసతుల స్థితి గతులపై చర్చించ లేదు. నెలల తరబడి జీతాలు అందక ఆందోళన పడుతున్న టీచర్ల గోడును పట్టించుకునే ఆలోచన లేదు.

**ఈ విధానం రెండు మార్గాల మధ్య నిలబడి ఉంది**

విద్యను హక్కుగా చూడాలా? లేదా విద్యను నాణ్యత–పోటీ దిశగా నడిపించాలా? ఈ అధ్యయనం రెండింటినీ సమతుల్యం చేయాలని ప్రయత్నిస్తోంది. తెలంగాణ విద్యా విధానం ఒక మలుపు కావచ్చు. కానీ అది సరైన దిశలో తిరగాలంటే అమలు పారదర్శకంగా, టీచర్లు , ప్రజా భాగస్వామ్యంతో సాగాలి. అప్పుడే ఈ విధానం విద్యా రంగంలో ప్రతి విద్యార్థికి నాణ్యమైన బోధన అందించడానికి తోడ్పడుతుంది. పాఠశాల మౌలిక వసతులు, ఉపాధ్యాయ శిక్షణ, భిన్న సామర్థ్యాలున్న పిల్లలకు ప్రత్యేక సహాయం ముఖ్యం. ఉద్యోగ నియామకాలలో వైవిధ్యానికి ప్రాధాన్యం ఇచ్చి, ప్రతిభను కేవలం మార్కులు లేదా నేపథ్యంతో కాకుండా సామర్థ్యంతో అంచనా వేయాలి. సమగ్రత లేకుండా ఉత్తమత అసంపూర్ణం, ఉత్తమత లేకుండా సమగ్రత అసాధ్యం. ఈ రెండింటి సమన్వయమే తెలంగాణ సమాజ ప్రగతికి నిజమైన వెలుగు బాట.


శ్యాంమోహన్ (ఆదివాసీ విద్య, సేద్యం పై గ్రామీణ ప్రాంతాల్లో అధ్యయనం చేస్తున్న జర్నలిస్టు )

## దేవుడు ఎక్కడ? గర్భగుడిలో నా...

# గుండె గూటిలో నా?

మనిషి పుట్టిన క్షణం నుండి మట్టిలో కలిసే వరకు సాగించే ప్రయాణంలో నిరంతరం ఏదో ఒక అన్వేషణలో ఉంటాడు. అది ధనం కావచ్చు, అధికారం కావచ్చు, లేదా ఆత్మీయత కావచ్చు. కానీ వీటన్నింటికీ అతీతంగా, మానవ మేధస్సును కొన్ని వేల ఏళ్లుగా వేధిస్తున్న, అదే సమయంలో ఊరడిస్తున్న ఒకే ఒక్క నిరంతర ప్రశ్న దేవుడు నిజంగా ఉన్నాడా? ఉంటే మన కళ్లకు కనిపిస్తాడా? ఈ మౌలిక ప్రశ్న చుట్టూనే నేడు ప్రపంచవ్యాప్తంగా ఆధ్యాత్మిక సామ్రాజ్యాలు నిర్మించబడ్డాయి. గుళ్ళు, గోపురాలు, చర్చిలు, మసీదులు ఇవన్నీ ఆ అదృశ్య శక్తిని పట్టుకోవడానికి మనిషి వేసిన అడుగులే.నేటి ఆధునిక కాలంలో ఆధ్యాత్మికత అనేది ఒక విలాసవంతమైన ప్యాకేజీగా మారిపోయింది. ప్రతి వీధిలోనూ ఒక పూజారి, ప్రతి నగరంలోనూ ఒక అడంబరమైన పీఠాధిపతి, సోషల్ మీడియాలో నిమిషానికో రీల్ వదిలే స్వామీజీలు దర్శనమిస్తున్నారు. నేను దేవుడిని నేరుగా చూశాను, ఆయనతో కాసేపు ముచ్చటించాను అని మైకుల ముందు ఖండితంగా చెప్పే వారు కోకొల్లలు. అసలు ఈ వాదనలు నమ్మశక్యమైనవేనా? సామాన్య మనిషి దైవాన్ని దర్శించాలంటే నిజంగా గిరి గీసుకుని కూర్చోవాలా? లేక హంగులు, ఆర్భాటాలు లేని అంతరంగ అన్వేషణే సరిపోతుందా? ఈ లోతైన ఆధ్యాత్మిక మర్మాన్ని ఛేదించడమే ఈ వ్యాసం ప్రధాన లక్ష్యం.భారతీయ సనాతన ధర్మంలో పూజలు, వ్రతాలు, తీర్థయాత్రలకు అత్యంత ప్రాధాన్యత ఉంది. వేల ఏళ్లుగా వస్తున్న ఈ ఆచారాల వెనుక ఒక గొప్ప మానసిక శాస్త్రం దాగి ఉంది. మనిషిని ఒక క్రమశిక్షణలో ఉంచడానికి, చెల్లాచెదురయ్యే మనసును ఒక బిందువు వద్ద కేంద్రీకరించడానికి మన పెద్దలు వీటిని రూపొందించారు. వాటికి తమదైన సామాజిక, మానసిక విలువ ఉంది. అయితే, కేవలం బాహ్య ఆచారాలు పాటిస్తేనే దేవుడు ప్రత్యక్షమవుతాడని నమ్మడం ఆధ్యాత్మిక అజ్ఞానానికి పరాకాష్ట. ఆదిశంకరాచార్యులు తన ప్రబోధాలలో ఒక అద్భుతమైన సత్యాన్ని చెప్పారు ఒక సాధకుడు రోజుకు లక్ష పుష్పాలతో అర్చించినా, అతని అంతరంగం శుద్ధపడకపోతే, ఆ దైవం దాన్ని స్వీకరించదు. అంటే, పూజ అనేది లక్ష్యానికి వెళ్లే దారిలో ఒక మెట్టు మాత్రమే, అది గమ్యం కాదు. నేడు మనం చూస్తున్న భక్తి చాలా వరకు యాంత్రికం అయిపోయింది. వేలకు వేలు ఖర్చు చేసి వ్రతాలు చేస్తారు, కానీ ఆ పూజ ముగియగానే ఇరుగుపొరుగు వారిపై అసూయ ప్రదర్శిస్తారు. గుడి చుట్టూ వంద ప్రదక్షిణలు చేసి, బయటకు రాగానే అబద్ధాలు చెప్తారు. మరి ఈ ప్రదక్షిణల వల్ల మార్పు రాని జీవితంలో దేవుడు ఎలా కనిపిస్తాడు? నిజమైన భక్తి బాహ్య ప్రదర్శనలో లేదు, అది మనిషి అంతరంగిక పరివర్తనలో ఉంది. హృదయంలో కనికరం లేని పూజలు కేవలం శ్రమ మాత్రమే.ప్రస్తుత సమాజంలో కొంతమంది పీఠాధిపతులు, ఆధ్యాత్మిక గురువులు తాము దైవంతో డైరెక్ట్ కనెక్షన్‌లో ఉన్నామని, దేవుడు తమకు మాత్రమే కనిపిస్తాడని ప్రచారం చేసుకుంటున్నారు. ఇది వినే సామాన్య భక్తులలో రెండు రకాల స్పందనలు ఉంటాయి. కొందరు గుడ్డిగా నమ్మేసి తమ సర్వస్వాన్ని వారి పాదాల వద్ద పోస్తారు, మరికొందరు ఇవన్నీ మోసాలని పూర్తిగా ఆధ్యాత్మికతనే నిరాకరిస్తారు. నిజానికి ఈ రెండూ అతివాదాలే.మన ఆధ్యాత్మిక చరిత్రను పరిశీలిస్తే రామకృష్ణ పరమహంస, రమణ మహర్షి, అన్నమయ్య, మీరాబాయి వంటి మహానుభావులు నిజంగానే దైవ సాక్షాత్కారం పొందారని చరిత్ర చెబుతోంది. కానీ వారి జీవితాలను లోతుగా గమనించండి వారెవరూ ఏనాడూ టీవీ కెమెరాల ముందు కూర్చొని నేను నిన్న దేవుడిని కలిశాను అని మార్కెటింగ్ చేసుకోలేదు. వారి జీవితమంతా అహంకారాన్ని చంపుకోవడంలో, నిరంతర ఆత్మశోధనలో గడిచింది. దైవానుభవం అనేది అత్యంత వ్యక్తిగతమైనది. అది అనుభవించేదే తప్ప, ప్రదర్శించేది కాదు.

నేటి దేవుడిని చూశాం అని చెప్పుకునే వారిని అంచనా వేయడానికి ఒక చిన్న గీటురాయి ఉంది. వారి జీవనశైలి ఎలా ఉంది? వారు విలాసవంతమైన సంపదను కూడబెడుతున్నారా? అధికారం కోసం రాజకీయ చదరంగం ఆడుతున్నారా? అమాయక భక్తుల భయాన్ని ఆసరాగా చేసుకుని వ్యాపారం చేస్తున్నా రా? అయితే ఆ వాదనలు ఖచ్చితంగా అనుమానాస్పదమే. ఎందుకంటే, నిజమైన దైవానుభవం కలిగిన వ్యక్తిలో అహంకారం మటుమాయమవుతుంది. వారు నిరాడంబరంగా, సేవాతత్పరులుగా మారుతారు. గొప్పలు చెప్పుకోవడం కంటే, లోక కళ్యాణం కోసం నిశ్శబ్దంగా శ్రమిస్తారు. చరిత్రలో మనిషిని నిరంతరం వెంటాడుతున్న ప్రశ్న ఇది. ఈ ప్రశ్నకు ప్రపంచంలోని అన్ని మత గ్రంథాలు ఏకగ్రీవంగా ఒకే సమాధానాన్ని ఇస్తున్నాయి. బైబిల్ చెబుతోంది హృదయ శుద్ధత కలవారు దేవుని చూస్తారు.భగవద్గీత ప్రబోధిస్తోంది నన్ను సర్వభూతాలలో (అన్ని ప్రాణుల్లో) చూడగలిగినవాడే నిజమైన జ్ఞాని. ఖురాన్ చెబుతోంది దేవుడు మీ కంఠనరము కంటే మీకు దగ్గరగా ఉన్నాడు. ఈ సూత్రాలన్నీ చెప్పే అసలు రహస్యం ఏమిటంటే,దేవుడు ఆకాశంలోనో, సుదూర తీర్థయాత్రల్లోనో వెతకాల్సిన వ్యక్తి కాదు. ఆయన మన అంతరంగంలో అనుభవించాల్సిన ఒక పరమ చైతన్యం. సామాన్య మనిషి ఆ చైతన్యాన్ని అందుకోవాలంటే ఈ మూడు సూత్రాలు పాటించడం అవసరం.మొదటిది మనసును నిశ్చలం చేసుకోవడం అలజడి ఉన్న నీటిలో ప్రతిబింబం కనిపించదు. అలాగే, ఆలోచనలతో నిండిన మనసులో దేవుడు కనిపించడు. ధ్యానం లేదా ఏకాగ్రత ద్వారా మనసును శాంతింపజేసినప్పుడు, ఆ నిశ్శబ్దంలో దైవ స్పర్శ అనుభవమవుతుంది. రెండవది అహంకారాన్ని త్యజించడం నేను అనే అహం ఉన్నచోట ఆయన ఉండడు. నేను అనే భావం ఎంత తగ్గితే, సర్వవ్యాపి అయిన ఆ పరమాత్మ అంతగా అనుభవంలోకి వస్తాడు. మూడవది సేవలో దైవాన్ని చూడడం స్వామి వివేకానంద చెప్పినట్టు దరిద్ర నారాయణ సేవే దైవ సేవ. ఒక ఆకలిగొన్న వాడికి అన్నం పెట్టినప్పుడు ఆ తృప్తిలో, ఒక అనాథకు అండగా నిలిచినప్పుడు ఆ కళ్లలో ఉండే మెరుపులో దేవుడు స్పష్టంగా కనిపిస్తాడు. మనం నేడు బాహ్య ఆర్భాటాలకు ఇస్తున్న ప్రాముఖ్యత అంతరంగిక మార్పుకు ఇవ్వడం లేదు. కోట్లు ఖర్చు చేసి బంగారు విగ్రహాలు తయారు చేస్తున్నాం కానీ, పక్కింటి వాడు ఆకలితో అలమటిస్తుంటే చూడటం లేదు. వేల లీటర్ల పాలతో అభిషేకాలు చేస్తున్నాం, అదే పాలను అనాథ పిల్లలకు ఇస్తే ఆ దేవుడు మరింత స ంతోషిస్తాడ ని ఆలోచించే విజ్ఞతను కోల్పోతున్నాం. నిజమైన ఆధ్యాత్మిక గురువు ఎప్పుడూ తనను పూజించమని చెప్పడు. భక్తులను తనపై ఆధారపడేలా చేసుకోడు. బదులుగా, వారిలో స్వతంత్ర ఆలోచనను, స్వీయ అన్వేషణను రగిలిస్తాడు. నా ద్వారానే మీకు దేవుడు కనిపిస్తాడు అని చెప్పే వారందరూ ఆధ్యాత్మిక వ్యాపారులే. ఎందుకంటే దైవం అనేది ఎవరికీ సొంతం కాదు. అది ప్రతి మానవుడి జన్మహక్కు.దేవుడు కేవలం గర్భగుడిలో బంధించబడిన విగ్రహం కాదు. ఆయన ఒక అనంతమైన ప్రేమ స్వరూపం. ఆ వెలుగును చూడాలంటే విశేషమైన మంత్రాలు, ప్రత్యేకమైన పీఠాధిపతుల సిఫార్సులు అవసరం లేదు. చరిత్రలో గొప్ప భక్తులుగా నిలిచిన వారందరూ సామాన్యులే. అన్నమయ్య ఒక సాధారణ కవి, కబీర్ ఒక నేతగాడు, రైదాస్ చెప్పులు కుట్టే వ్యక్తి. వారికి ఏ పీఠాధిపతి అనుమతి అక్కరలేదు. వారికి ఉన్నదల్లా స్వచ్ఛమైన మనసు, నిష్కల్మషమైన ప్రేమ. మనం అర్థం చేసుకోవలసిన పరమ సత్యం ఏమిటంటే దేవుడు మందిరంలో మాత్రమే లేడు. ఆయన ప్రతి మనిషి హృదయంలో, ప్రతి సాయం చేసే చేతిలో, ప్రతి నిజమైన ప్రేమలో నిత్యం వెలుగుతున్నాడు. ఆ వెలుగును చూడకుండా అడ్డుపడుతున్న అహంకారమనే తెరను తొలగించుకోవడమే మనం చేయాల్సిన అసలైన పని.ఎవరైనా స్వామీజీ చెప్పే మాటలను బట్టి కాకుండా, వారి చర్యలను బట్టి వారిని అంచనా వేయండి. మీ ఆత్మసాక్షి కంటే గొప్ప గురువు మరొకరు లేరు. మిమ్మల్ని మీరు శుద్ధి చేసుకున్నప్పుడు, మీలోని దైవత్వం దానంతట అదే బహిర్గతమవుతుంది. అదే నిజమైన భక్తి, అదే మోక్షమార్గం. దేవుడు మీలోనే ఉన్నాడు ఆ శాశ్వత సత్యాన్ని గుర్తించి, తోటి ప్రాణుల పట్ల కరుణతో జీవించడమే అసలైన ఆధ్యాత్మిక ప్రయాణం.



*నిశ్శబ్దంలో దైవ స్పర్శ అనుభవమవుతుంది. రెండవది అహంకారాన్ని త్యజించడం నేను అనే అహం ఉన్నచోట ఆయన ఉండడు. నేను అనే భావం ఎంత తగ్గితే, సర్వవ్యాపి అయిన ఆ పరమాత్మ అంతగా అనుభవంలోకి వస్తాడు. మూడవది సేవలో దైవాన్ని చూడడం స్వామి వివేకానంద చెప్పినట్టు దరిద్ర నారాయణ సేవే దైవ సేవ. ఒక ఆకలిగొన్న వాడికి అన్నం పెట్టినప్పుడు ఆ తృప్తిలో, ఒక అనాథకు అండగా నిలిచినప్పుడు ఆ కళ్లలో ఉండే మెరుపులో దేవుడు స్పష్టంగా కనిపిస్తాడు. మనం నేడు బాహ్య ఆర్భాటాలకు ఇస్తున్న ప్రాముఖ్యత అంతరంగిక మార్పుకు ఇవ్వడం లేదు.*



డా .సూర్యదేవర రామకృష్ణ
9490754169

# సంక్షోభంలో పౌల్ట్రీ రంగం?



తెలంగాణలో పౌల్ట్రీ రంగం ప్రస్తుతం ఒక తీవ్రమైన సంక్షోభ దశను ఎదుర్కొంటోంది. చికెన్ వ్యాపారులు తక్కువ లాభాల మార్జిన్‌పై నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా బంద్‌కు దిగడం, ఈ రంగంలో దాగి ఉన్న లోపలి సమస్యలను బహిర్గతం చేసింది. బయటకు చూస్తే ఇది వ్యాపారుల సమస్యలా అనిపించవచ్చు. కానీ లోతుగా పరిశీలిస్తే, ఈ వ్యవస్థలో అసలు నష్టాన్ని భరించేది పౌల్ట్రీ రైతే అన్న విషయం స్పష్టమవుతోంది. చికెన్ షాపులు మూసివేయడం యాదృచ్ఛిక నిర్ణయం కాదు. పౌల్ట్రీ కంపెనీలు, పెద్ద ట్రేడర్లు ధరలను ఏకపక్షంగా నిర్ణయించడం, లాభాల మార్జిన్‌ను గణనీయంగా తగ్గించడం, మార్కెట్‌లో పారదర్శకత లోపించడం — ఇవన్నీ వ్యాపారులను ఆందోళనకు గురిచేశాయి. గతంలో కిలోపై సుమారు 26 రూపాయల వరకు మార్జిన్ లభించగా, ప్రస్తుతం అది కేవలం 16 రూపాయలకు పడిపోవడం పరిస్థితి ఎంత తీవ్రంగా మారిందో చూపిస్తోంది. ఈ నేపథ్యంలో కనీసం 30 రూపాయల మార్జిన్ ఇవ్వాలనే డిమాండ్‌తో వ్యాపారులు బంద్‌కు దిగాల్సిన పరిస్థితి ఏర్పడింది. హైదరాబాద్ వంటి నగరాల్లో నిరసనల వాతావరణం కాస్త ఎక్కువగానే కనిపిస్తోంది. 'తక్కువ మార్జిన్‌తో వ్యాపారం అసాధ్యం' అనే నినాదంతో పోస్టర్లు వేయడం వెనుక గంభీరమైన వాస్తవం దాగి ఉంది. అయితే ఈ వ్యవస్థలో అత్యంత బలహీన వర్గం రైతే. పౌల్ట్రీ రైతు జీవితం బయటకు కనిపించేదానికంటే చాలా కష్టంగా ఉంటుంది. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి షెడ్లు నిర్మించడం, అప్పులు తీసుకోవడం, రాత్రింబవళ్లు కోళ్ల సంరక్షణ — ఇవన్నీ అతని దైనందిన జీవితంలో భాగం. కానీ చివరికి అతనికి దక్కేది చాలా తక్కువ కమీషన్ మాత్రమే. ఇది ఒక వ్యాపారం కంటే ఎక్కువగా, నిరంతర పోరాటంగా మారిపోయింది. పౌల్ట్రీ రంగం ప్రస్తుతం కాంట్రాక్ట్ పద్ధతిపై నడుస్తోంది. సూత్రప్రాయంగా చూస్తే, కంపెనీలు చిక్స్, ఫీడ్, మందులు అందిస్తాయి; రైతు పెంపకం బాధ్యత తీసుకుంటాడు. కానీ ఆచరణలో రిస్క్ మొత్తం రైతుపైనే పడుతోంది.

ప్రస్తుతం పౌల్ట్రీ రంగంలో ఎఫ్‌సీఆర్ (ఫీడ్ కన్వర్షన్ రేషియో) పేరుతో అమలవుతున్న విధానం రైతులకు అనుకూలంగా లేదన్న అభిప్రాయం విస్తృతంగా ఉంది. ఈ లెక్కలు ఎలా నిర్ణయించబడుతున్నాయి, ఎలా అమలు అవుతున్నాయి అన్న విషయంలో స్పష్టత లేకపోవడం వల్ల రైతు తరచుగా నష్టపోతున్నాడు. రైతు ఎంత కష్టపడి పెంచినా, తుది లెక్కలు అతని చేతిలో ఉండకపోవడం ఒక పెద్ద సమస్యగా మారింది. మరో కీలక సమస్య ఏమిటంటే, కంపెనీలు సరఫరా చేసే చిక్స్ నాణ్యత, ఫీడ్ నాణ్యత వంటి అంశాలు సరైన స్థాయిలో లేకపోయినా, దాని ప్రభావం మాత్రం పూర్తిగా రైతుపైనే పడుతోంది. మోర్టాలిటీ రేటు పెరిగినా, ఉత్పత్తి తగ్గినా, నష్టాన్ని మాత్రం రైతే భరిస్తున్నాడు, కానీ లాభాల్లో అతనికి తగిన వాటా అందడం లేదు. ఈ పరిస్థితుల్లో ఎఫ్‌సీఆర్ విధానాన్ని పునఃపరిశీలించడం అత్యవసరం. రైతుకు కనీస రక్షణ కల్పించేలా, చిక్స్ నాణ్యత, ఫీడ్ నాణ్యత, వాతావరణ పరిస్థితులు వంటి అంశాలను కూడా లెక్కల్లో భాగం చేసే పారదర్శక విధానం అవసరం. అలా చేస్తేనే రైతుకు కొంతవరకైనా న్యాయం జరిగే అవకాశం ఉంటుంది.

ఇక మరో ముఖ్యమైన అంశం — రైతు ఆదాయం పూర్తిగా ఎఫ్‌సీఆర్‌పై ఆధారపడి ఉండకూడదు. ఎందుకంటే అది రైతు నియంత్రణలో పూర్తిగా ఉండే అంశం కాదు. కాబట్టి ఎఫ్‌సీఆర్‌కు అతీతంగా, ప్రతిబ్యాచ్ కు కనీస హామీ కమీషన్ (Guaranteed Base Income) ను నిర్ధారించడం అత్యవసరం. వ్యవసాయంలో 'కనీస మద్దతు ధర' ఉన్నట్లే, పౌల్ట్రీ రైతులకు 'కనీస హామీ కమీషన్' వ్యవస్థను అమలు చేయాల్సిన అవసరం ఉంది. అలాగే, పనితీరు ఆధారంగా ప్రోత్సాహకాలు ప్రకటించాలి. ఈ విధానం అమలైతేనే రైతు ఆర్థిక భద్రతకు కొంతవరకు స్థిరత్వం లభిస్తుంది.

మరోవైపు, మార్కెట్ ధరలలో తీవ్ర అస్థిరత కూడా రైతులు, చిన్న వ్యాపారులపై అదనపు ఒత్తిడిని పెంచుతోంది. ధరలు ఎప్పుడు పెరుగుతాయో, ఎప్పుడు పడిపోతాయో అర్థంకాని పరిస్థితి ఉంది. ఈ మార్పులపై రైతుకు ఎలాంటి నియంత్రణ లేదు. ఫలితంగా, సరఫరా వ్యవస్థపై ఆధిపత్యం కలిగిన పెద్ద కంపెనీలే ఎక్కువ లాభాలను పొందుతుండగా, రైతు, వ్యాపారి మాత్రం నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. ఇది కేవలం ఆర్థిక సమస్య మాత్రమే కాదు, ఇదొక సామాజిక సమస్యగా మారుతోంది. పౌల్ట్రీ రైతుల కుటుంబాలు అప్పుల భారంతో జీవిస్తున్నాయి. పిల్లల చదువు, ఆరోగ్యం, రోజువారీ ఖర్చులు — ఇవన్నీ ఒత్తిడిగా మారుతున్నాయి. బయటకు చూస్తే కోళ్ల ఫారాలు ఆడంబరంగా కనిపిస్తాయి, కానీ లోపల ఒక కుటుంబం ఆర్థికంగా, మానసికంగా మౌన పోరాటం చేస్తూ అనుభవించే వేదన దాగి ఉంటుంది. ఈ పరిస్థితి కొనసాగితే దాని ప్రభావం వినియోగదారులపైనా పడటం ఖాయం. సరఫరా తగ్గితే ధరలు పెరుగుతాయి. రైతులకు కనీస ఆదాయ భరోసా (Minimum Support Mechanism) చట్టబద్ధ హామీగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. దాని అమలుపై కఠిన పర్యవేక్షణ ఉండాలి. ఈ నేపథ్యంలో రైతు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే స్థితిలో లేకుండా, కేవలం అమలు చేసే వ్యక్తిగా మారిపోయాడు. ఈ అసమాన వ్యవస్థను సరిచేయకపోతే, రైతు స్థితి మరింత బలహీనపడే ప్రమాదం ఉంది.



యండి. ఉస్మాన్ ఖాన్
సీనియర్ జర్నలిస్టు



# జాతీయం- అంతర్జాతీయం



## మాల్డాలో న్యాయాధికారుల ఘెరావ్ సూత్రధారి అరెస్టు




**కోల్‌కత, ఏప్రిల్ 3 (వుదయం) :**

పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా కాలియాచక్ బీడీఓ 2 కార్యాలయంలో ఏడుగురు న్యాయాధికారులను ముట్టడించిన రెండు రోజుల తర్వాత, ఈ ఘటన వెనుక సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న న్యాయవాది మోఫక్కరుల్ ఇస్లాంను రాష్ట్ర పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం ఉత్తర బెంగాల్‌లోని బాగ్‌డోగ్రా విమానాశ్రయంలో పోలీసులు ఇస్లాంను, అతని సహచరుడిని పట్టుకున్నారు. ఇస్లాం బెంగళూరుకు పారిపోవడానికి ప్రయత్నిస్తున్నాడు. బుధవారం నాడు మూడు వేర్వేరు ప్రదేశాల్లో ప్రసంగాల ద్వారా స్థానికులను రెచ్చగొట్టారన్న ఆరోపణలపై, కాలియాచక్ పోలీస్ స్టేషన్‌లో అతనిపై మూడు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ రెచ్చగొట్టే ప్రసంగాల పర్యవసానంగానే అక్కడ ముట్టడి (ఘెరావ్) జరిగింది.

ఉత్తర దినాజ్‌పూర్ జిల్లాలోని ఇతాహార్‌కు చెందిన మొఫక్కరుల్ ఇస్లాం ప్రస్తుతం కోల్‌కతాలో నివసిస్తున్నారని శుక్రవారం ఉత్తర బెంగాల్ అదనపు డైరెక్టర్ జనరల్ (ఎడిజి) ఆఫ్ పోలీస్ కె. జయరామన్ విలేకరులకు తెలిపారు.

ఆ ఘటన జరిగిన తర్వాత తాము మొఫక్కరుల్ ఇస్లాం కదలికలను గమనించడం ప్రారంభించామని, పశ్చిమ బెంగాల్ నేర పరిశోధన విభాగం (సిఐబ), సిలిగురి పోలీసుల సహకారంతో, అతన్ని, అతని సహచరుడిని బాగ్‌డోగ్రా విమానాశ్రయం వద్ద అదుపులోకి తీసుకున్నాం. మూడు వేర్వేరు ప్రాంతాల్లో స్థానికులను రెచ్చగొట్టినందుకు గాను అతనిపై మూడు కేసులు నమోదు చేశామని ఆయన తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి మొత్తం 19 కేసులు నమోదు చేసినట్టు ఆయన వివరించారు. కలకత్తా హైకోర్టుకు మారకముందు, మొఫక్కరుల్ ఇస్లాం రాయ్‌గంజ్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు.

2021 అసెంబ్లీ ఎన్నికలలో, మొఫక్కరుల్ ఇతాహార్ నియోజకవర్గం నుండి అసదుద్దీన్ ఒవైసీకి చెందిన ఎఐఎంఐఎం అభ్యర్థిగా ఎన్నికలలో పోటీ చేశారు, అక్కడ అతను 831 ఓట్లను మాత్రమే సాధించాడు. తాజా అరెస్టులతో, ఈ ఘటనకు సంబంధించి అదుపులోకి తీసుకున్న వారి సంఖ్య 35కు చేరింది; వీరిలో ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్ (ఐఎస్ ఎఫ్) అభ్యర్థి ఒకరు ఉన్నారు.

మాల్దా జిల్లాలోని మోథాబారి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న ఐఎస్ ఎఫ్ అభ్యర్థి మౌలానా షాజహాన్ అలీతో పాటు మరో 17 మందిని, ఆ ముట్టడితో సంబంధం ఉందన్న ఆరోపణలపై గురువారం అరెస్టు చేశారు. కాలియాచక్ ఘటనతో తనకు ఎటువంటి ప్రమేయం లేదని అలీ పేర్కొన్నారు.

గొడవ జరిగినప్పుడు తాను అక్కడ లేనని, తమ ప్రాంతంలో ఒక సంగీత ప్రదర్శన చూసి తిరిగి వస్తుండగా పోలీసులు తనను అరెస్టు చేశారని, తాను ఐఎస్ఎఫ్ అభ్యర్థి కావడం వల్ల కుట్రకు బాధితుడిగా మారానని గురువారం మాల్దాలోని కోర్టులో హాజరుపరిచినప్పుడు ఆయన విలేకరులతో అన్నారు. ఓటర్ల జాబితా అనుబంధ జాబితాల నుండి ఓటర్లను మినహాయించడాన్ని నిరసిస్తూ జరిగిన ఆందోళనలలో ఈ సంఘటన చోటుచేసుకుంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు, పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) 'పరిశీలనలో ఉన్నవి'గా గుర్తించిన 60 లక్షల మంది ఓటర్ల పత్రాలను ధృవీకరించడానికి న్యాయాధికారులను నియమించారు.

మాల్దా, జల్పైగుడి, కూచ్ బెహార్‌లోని కాలియాచక్‌తో పాటు మరికొన్ని ప్రాంతాలలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ గురువారం అసెంబ్లీ ఎన్నికల ముందు పరిస్థితిని సమీక్షించేందుకు పశ్చిమ బెంగాల్ ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) మనోజ్ అగర్వాల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుష్యంత్ నారియాలా, హోం కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, కోల్‌కతా పోలీస్ కమిషనర్, జిల్లా మేజిస్ట్రేట్లు, జిల్లాల పోలీస్ సూపరింటెండెంట్లతో వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా అత్యవసర సమావేశం నిర్వహించారు.

## అంతర్జాతీయ జలమార్గాల్లో నౌకాయాన స్వేచ్ఛ అవసరం

### హోర్ముజ్ ను తిరిగి తెరవాలని యుకె సమావేశంలో భారత్ పిలుపు

**వుదయం డెస్క్, ఏప్రిల్ 3 :**

పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘర్షణల నేపథ్యంలో, గల్ఫ్‌లో వాణిజ్య నౌకలపై జరిగిన దాడులలో నావికులను కోల్పోయిన ఏకైక దేశం తమదేనని పేర్కొంటూ, హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవాలని భారతదేశం పిలుపునిచ్చింది. యుకె ఏర్పాటు చేసిన, 60కి పైగా దేశాలు హాజరైన వర్చువల్ సమావేశంలో భారత్‌కి ప్రాతినిధ్యం వహించిన విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ, అంతర్జాతీయ జలమార్గాల ద్వారా నౌకాయాన స్వేచ్ఛ, నిరాటంకమైన రాకపోకల ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ప్రపంచ ఇంధన సరఫరాలకు అంతరాయాలు కలుగుతాయన్న ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో, జలసంధిని తిరిగి తెరిచే మార్గాలను అన్వేషించడంపై ఈ సమావేశం ప్రధానంగా దృష్టి సారించింది. ఈ చర్చల్లో అమెరికా పాల్గొనలేదు.

భారతదేశ ఇంధన భద్రతపై ఈ సంఘర్షణ చూపే ప్రభావాన్ని మిస్రి ప్రముఖంగా ప్రస్తావించారు. గల్ఫ్ ప్రాంతంలో వాణిజ్య నౌకలపై జరిగిన దాడుల్లో మరణించిన వారిలో భారతీయ నావికులు కూడా ఉన్నారని ఆయన పేర్కొన్నారు.



అధికారిక సమాచారం ప్రకారం, హోర్ముజ్ జలసంధిలో జరిగిన దాడుల్లో విదేశీ జెండాలున్న వాణిజ్య నౌకల్లో పనిచేస్తున్న కనీసం ముగ్గురు భారతీయ నావికులు మరణించారు. విస్తృత పశ్చిమ ఆసియా సంఘర్షణ తొలి దశలో ప్రాణాలు కోల్పోయిన ఎనిమిది మంది భారతీయులలో ఈ నావికులు కూడా ఉన్నారు. ఉద్రిక్తతలను తగ్గించడం, సంబంధిత పక్షాలన్నింటి మధ్య దౌత్యం, చర్చలకు తిరిగి రావడం ద్వారానే ఈ సంక్షోభం నుండి బయటపడగలమని ఆయన నొక్కిచెప్పారు. సంఘర్షణను పరిష్కరించడానికి చర్చలే అత్యంత ఆచరణీయమైన మార్గమనే భారతదేశపు స్థిరమైన వైఖరిని ఆయన పునరుద్ఘాటించారని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో, హోర్ముజ్ జలసంధి గుండా సురక్షితమైన, స్వేచ్ఛాయుతమైన నౌకాయానాన్ని నిర్ధారించాలన్న భారతదేశ వైఖరిని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అంతకుముందు పునరుద్ఘాటించారు.

ఒక మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ విషయంపై చర్చల కోసం యునైటెడ్ కింగ్‌డమ్ భారతదేశాన్ని, పలు ఇతర దేశాలను ఆహ్వానించిందని, ఈ సమావేశానికి విదేశాంగ కార్యదర్శి హాజరవుతారని ధృవీకరించిన విషయం తెలిసిందే. ఎల్పీజీ, ఎల్ఎన్జీ, ఇతర ఉత్పత్తులను తీసుకువెళ్లే భారతీయ నౌకలకు నిరాటంకమైన, సురక్షితమైన రవాణాను కల్పించేందుకు ఇరాన్, ఇతర దేశాలతో భారత్ సంప్రదింపులు జరుపుతోందని ఆయన తెలిపారు. కొనసాగుతున్న దౌత్యపరమైన సంప్రదింపుల ద్వారా, ఇటీవలి రోజుల్లో ఆరు భారతీయ నౌకలు హోర్ముజ్ జలసంధిని సురక్షితంగా దాటగలిగాయని, తన సముద్ర రవాణా భద్రతను నిర్ధారించుకోవడానికి భారత్ సంబంధిత భాగస్వాములతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని జైస్వాల్ వెల్లడించారు.

## హోర్ముజ్‌పై యుద్ధ ప్రభావం

### మార్చి లో కేవలం 220 నౌకల రాకపోకలు

**ద్రవ ట్యాంకర్ల రద్దీ అగ్రస్థానంలో ; రాకపోకలు నమోదు కాని ఎల్ ఎన్‌జి**



**వుదయం డెస్క్, ఏప్రిల్ 3 :**

పశ్చిమాసియా సంక్షోభం ప్రారంభమైన తర్వాత హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణించిన నౌకల డేటాను మెరైన్ ట్రాకర్, కెప్లర్ విడుదల చేసింది. మార్చి మాసంలో జలసంధి గుండా మొత్తం 220 నౌకలు ప్రయాణించాయి. వీటిలో లిక్విడ్ ట్యాంకర్ల వాటా అధికంగా ఉంది.

ఆ మార్గంలో ప్రయాణించిన మొత్తం నౌకలలో 51శాతం వాటాతో 111 లిక్విడ్ ట్యాంకర్లు ఉండగా, 82 పొడి సరుకు తీసుకువెడుతున్న నౌకలు (37శాతం), 27 ఎల్‌పిజి కారియర్లు (12 శాతం) ప్రయాణించాయి. ఆ సంస్థ ప్రకారం, ఆ మాసంలో ఎటువంటి ఎల్ ఎన్‌జి రవాణా నమోదు కాలేదు.

గల్ఫ్ నుంచి పడమర నుంచి తూర్పు దిశగా సాగిన రాకపోకల వైపే ట్రాఫిక్ భారీగా మొగ్గు చూపినట్లు నావిగేషన్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇవి మొత్తం రాకపోకలలో 149 సార్లు, అంటే 68 శాతంగా నమోదయ్యాయి. మిగిలిన 32 శాతం తూర్పు నుంచి పడమరకు కదలికలు గల్ఫ్‌లోకి వెళ్లాయి. ఇది ప్రపంచంలోనే అత్యంత కీలకమైన సముద్ర కీలక మార్గాలలో ఒకటైన దానిలో అస్థిర ప్రవాహాన్ని పట్టి చూపుతోంది. నౌకలలో అత్యధికం ఇరాన్ నుంచి వస్తున్నవి లేదా అటువెళ్తున్నవి కాగా, మరికొన్ని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, భారత్, చైనా లేదా సౌదీ అరేబియాకి సంబంధించినవి.

సాధారణ సమయంలో, ప్రపంచ ముడిచమురు, ఎల్ ఎన్‌జి రవాణాలో సుమారు 20శాతం ఈ జలసంధి గుండా రవాణా అవుతుంది. దీనితో, ఇది ప్రపంచ ఇంధన సరఫరాలకు కీలకమైనదిగా అవతరించింది.

అయితే, ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలను పెంచింది. ఇరాన్ చేసిన ప్రతీకార దాడులు గల్ఫ్ వ్యాప్తంగా గల లక్ష్యాలను నష్టపరచడంతో, జలసంధిలో షిప్పింగ్ స్తంభించడమే కాదు, నౌకల రాకపోకలను నామమాత్రం చేసింది.

తాజా పరిణామంలో, ఫ్రెంచి యాజమాన్యంలోని ఒక కంటైనర్ నౌక్ హోర్ముజ్ జలసంధి గుండా విజయవంతంగా ప్రయాణించింది. ఫ్రెంచి మారిటైమ్ గ్రూపు సిఎంఎ సిజిఎం యాజమాన్యంలోని మల్టా జెండాతో ప్రయాణిస్తున్న క్రిబి నౌక గురువారం నాడు జలసంధిని దాటింది. మార్చి ఆరంభం తర్వాత ఒక ప్రధాన యూరోపియన్ షిప్పింగ్ కంపెనీ జరిపిన మొట్టమొదటి రవాణాగా ఇది నమోదైంది.

ఆ నౌక, ఇరాన్ తీరానికి దగ్గరలో ఉన్న లారాక్ ద్వీపం సమీపంలో, ఇరాన్ ఆమోదించిన ఒక కొత్త మార్గాన్ని ఉపయోగించింది. లాయిడ్స్ లిస్ట్ దీనికి టెహ్రాన్ టోల్ బూత్ అని ముద్దు పేరు పెట్టింది. సముద్ర నిఘా వర్గాల సమాచారం ప్రకారం, కనీసం రెండు నౌకలు ఈ మార్గాన్ని ఉపయోగించుకోవడానికి డబ్బు చెల్లించాయి.

## విజయ్‌కు ఆదిలోనే ఆటంకం

**చెన్నై, ఏప్రిల్ 3 (వుదయం :**

నటుడు, టీవీకే వ్యవస్థాపకుడు అయిన విజయ్ సమర్పించిన రెండు వేర్వేరు ఎన్నికల అఫిడవిట్లలో వ్యత్యాసాలు బయటపడటంతో, అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇవి న్యాయపరమైన, రాజకీయ పరిశీలనకు దారితీసే అవకాశం ఉంది. విజయ్ పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ స్థానాల్లో నామినేషన్లు వేసిన విషయం తెలిసిందే. కాగా, నామినేషన్ సమయంలో ఆయన సమర్పించిన అఫిడవిట్లలో తేడాలు ఉన్నట్లు తేలింది.

పెరంబూర్, తిరుచిరాపల్లి తూర్పు నియోజకవర్గాల కోసం సిద్ధం చేసిన ఈ విరుద్ధమైన పత్రాలు, అతనిపై పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులు, కేటాయించిన ఎన్నికల బ్యాంకు ఖాతాలకు సంబంధించి పరస్పర విరుద్ధమైన ప్రకటనలను వెల్లడిస్తున్నాయి. పెరంబూరు అసెంబ్లీ నియోజకవర్గం కోసం రూపొందించి, మార్చి 30న చెన్నైలో నోటరీ చేసిన అఫిడవిట్, సదరు రాజకీయ నాయకుడిపై ఎటువంటి పెండింగ్ క్రిమినల్ కేసులు లేవని స్పష్టంగా పేర్కొంటోంది.



దీనికి భిన్నంగా, తిరుచిరాపల్లి తూర్పు నియోజకవర్గం కోసం రూపొందించి, మూడు రోజుల తర్వాత తిరుచిరాపల్లిలో నోటరీ చేసిన తదుపరి అఫిడవిట్, రెండు ప్రథమ సమాచార నివేదికలను (ఎఫ్ ఐఆర్‌లు) పెండింగ్ లో ఉన్నట్టు వెల్లడిస్తోంది. తిరుచిరాపల్లి పత్రం ప్రకారం, వెల్లడైన కేసులలో మదురై జిల్లాలోని కూడకోవిల్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఒక ఎఫ్ ఐఆర్, చెన్నైలోని పెరవల్లూరు పోలీస్ స్టేషన్‌లో నమోదైన మరొకటి ఉన్నాయి. రెండవ కేసులో, ఇటీవల జరిగిన ఒక ప్రచార కార్యక్రమంలో బౌన్సర్ల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగడం, గాయాలు ఏర్పడటం వంటి ఆరోపణలు ఉన్నాయి.

నేర రికార్డులోని వ్యత్యాసంతో పాటు, ఎన్నికల ఖర్చులకు సంబంధించిన ఆర్థిక ప్రకటనలు కూడా భిన్నంగా ఉన్నాయి. పెరంబూర్ పత్రం ప్రకారం, సాలిగ్రామం బ్రాంచ్‌లోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లో ఎన్నికల ఖర్చుల కోసం తెరిచిన ఒకే ఒక బ్యాంకు ఖాతాలో రూ. 1 లక్ష డిపాజిట్ ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే, ట్రిచీ అఫిడవిట్ రెండు వేర్వేరు ఖాతాలను పేర్కొంది. పెరంబూరు కోసం సాలిగ్రామం ఖాతాను కొనసాగిస్తూనే, తిరుచిరాపల్లి ప్రధాన శాఖలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో రూ. 90,000 నిల్వతో మరొక ఖాతాను జతచేసింది.

ప్రమాణపూర్వక ఎన్నికల అఫిడవిట్‌లో వాస్తవాలను దాచడం లేదా తప్పుగా చిత్రీకరించడం, 'ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1951' ప్రకారం ఒక తీవ్రమైన ఉల్లంఘన అని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. చట్టంలోని సెక్షన్ 125ఎ ప్రకారం, సమాచారాన్ని సమర్పించడంలో విఫలమవడం, వివరాలను దాచిపెట్టడం లేదా తప్పుడు సమాచారాన్ని అందించడం వంటి చర్యలకు గరిష్టంగా ఆరు నెలల జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించవచ్చు. ఈ సందర్భంలో, పెరంబూర్ పత్రంలో ఎఫ్ఐఆర్‌లను దాచిపెట్టడాన్ని ఆధారంగా చేసుకుని ప్రత్యర్థి అభ్యర్థులు తక్షణమే అభ్యంతరాలు లేవనెత్తవచ్చని నిపుణులు అంటున్నారు. ఈ విషయంపై టీవీకే నుంచి తక్షణ స్పందన రాలేదు.

## బీజేపీలోకి రాఘవ్ చద్దా ?

**వుదయం డెస్క్, ఏప్రిల్ 3 :**


ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)లో అంతర్గత కలహాలు తారాస్థాయికి చేరుకున్నట్లు కనిపిస్తోంది. తాజాగా, రాఘవ్ చద్దా ఎపిసోడ్ ఇందుకు సాక్ష్యంగా నిలుస్తోంది. రాజ్యసభలో ఆప్ ఉపనాయకుడి పదవి నుంచి రాఘవ్ చద్దాను తొలగించారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఇప్పుడు చద్దా స్థానంలో పంజాబ్ రాజ్యసభ ఎంపీ అయిన అశోక్ మిట్టల్‌ను నియమించింది. దీంతో ఆయనను కావాలనే ఆప్ పక్కన పెడుతుందనే వాదన వినిపిస్తోంది. మోడీకి వ్యతిరేకంగా మాట్లాడేందుకు చద్దా బయపడుతున్నారని మండిపడ్డారు. బీజేపీకి లొంగిపోయారని అన్నారు.

ఇదిలా ఉంటే, ఢిల్లీ మాజీ సీఎం, ఆప్ కీలక నేత ఆతిశీ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాఘవ్ చద్దా త్వరలోనే బీజేపీలో చేరుతారేమో..? అంటూ కామెంట్ చేయడం సంచలనంగా మారింది. దేశంలో రాజ్యాంగం, వ్యవస్థలపై దాడి జరుగుతోందని, బెంగాల్లో ఓట్ చోరీ జరుగుతోందని, ఎలక్షన్ కమిషన్‌ను బీజేపీ దుర్వినియోగం చేస్తోందని, ఎల్పీజీ సంక్షోభం సహా ఎన్నో సమస్యలపై రాఘవ్ మాట్లాడలేదని, బీజేపీ మోడీలను ప్రశ్నించాలంటే ఆయనకు భయం అంటూ విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి చద్దా భయపడుతున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ మీడియా చీఫ్ అనురాగ్ ధండా ఆరోపించారు. ఆప్‌లో స్వాతిమలివాల్ లాగే, రాఘవ్ కూడా తనను తాను ఆప్ నాయకుడిగా చెప్పుకుంటూ తిరుగుబాటు ధోరణిని అవలంభిస్తున్నారు. ఢిల్లీ ఎన్నికలకు ముందు ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్‌పై ఎంపీ స్వాతి మలివాల్ సంచలన ఆరోపణలు చేశారు. కేజ్రీవాల్ ముందే అతడి పీఏ తనను కొట్టారంటూ ఆరోపించారు.

## నిత్యావసరాలపై యుద్ధం మంటల ప్రభావం

**వుదయం డెస్క్, ఏప్రిల్ 3 :**

ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా మధ్య ప్రారంభమైన యుద్ధం రెండవ నెలలోకి అడుగుపెట్టి ప్రపంచాన్ని వణికిస్తోంది. ఈ యుద్ధంతో ఏ సంబంధం లేని ప్రజలు కూడా దీని ప్రభావం పడి విలవిలలాడుతున్నారు. ఇంధన, గ్యాస్ ధరలు పెరిగిన పర్యావసానంగా నిత్యావసర వస్తువుల ధరలు భారీగా ప్రమాదం ఉందని ఐక్యరాజ్య సమితి, యూరోపియన్ యూనియన్ హెచ్చరించాయి. యుద్ధం కొనసాగినకొద్దీ ధరలు పెరిగి అలాగే స్థిరపడతాయని వారు అప్రమత్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఐరోపాలో ఇంధన రేషనింగ్ విధించే పరిస్థితి కూడా రావచ్చని అధికారులు పేర్కొన్నారు. మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న సంఘర్షణలు ప్రపంచ చమురు, గ్యాస్ మార్కెట్లను తీవ్రంగా దెబ్బతీశాయి.



యూరోపియన్ యూనియన్ ఇంధన కమిషనర్ డాన్ జోర్గెన్సన్ మాట్లాడుతూ, ఇది దీర్ఘకాలిక సంక్షోభంగా మారే అవకాశం ఉంది. ఇంధన ధరలు చాలా కాలం పాటు అధికంగానే ఉంటాయని హెచ్చరించారు. భవిష్యత్తులో జెట్ ఇంధనం, డీజిల్ వంటి కీలక ఉత్పత్తులపై రేషనింగ్ అవసరం రావచ్చని కూడా సూచించారు. హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో ఏర్పడిన ఉద్రిక్తతలు, గల్ఫ్ ప్రాంతంలోని ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులు ప్రపంచ సరఫరా గొలుసును దెబ్బతీశాయి. దీనివల్ల చమురు, గ్యాస్ ధరలు ఆకాశాన్నంటాయి. విమానయాన రంగం కూడా జెట్ ఇంధన కొరతపై ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఐక్యరాజ్యసమితి ప్రధాన ఆర్థికవేత్త మాక్సిమో టొరెరో మాట్లాడుతూ.. ఈ యుద్ధం 40 రోజులకుపైగా కొనసాగితే వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. రైతులు అధిక ఖర్చుల కారణంగా విత్తనాలు, ఎరువుల వినియోగాన్ని తగ్గించే అవకాశం ఉందని, దీని వల్ల భవిష్యత్ దిగుబడులు తగ్గి ఆహార ధరలు మరింత పెరిగే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచం సరఫరా భద్రతా సంక్షోభంలో లేకపోయినా, పరిస్థితులు మరింత దిగజారే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని దేశాలు ముందస్తు చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. మొత్తం మీద యుద్ధం కొనసాగుతున్నంతకాలం ఇంధన, గ్యాస్, ఆహార ధరల పెరుగుదల ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై భారంగా మారే అవకాశముంది.

## రెండో ఎఫ్35ని కూల్చేశాం: ఇరాన్

**వుదయం డెస్క్, ఏప్రిల్ 3 :**



అమెరికా వాయుసేనకు చెందిన అధునాతన ఎఫ్35 ఫైటర్ జెట్‌ను తమ గగనతలంలో కూల్చేశామని ఇరాన్ వెల్లడించింది. తాజా ప్రకటన పరంగా చూసుకుంటే.. ఇరాన్ సైన్యం చేతిలో కూలిన ఎఫ్35 (ఎఫ్35)ల సంఖ్య రెండుకు చేరింది. ఈ ఘటనలో పైలట్ గాయపడ్డాడని, బతికి ఉండే అవకాశాలు తక్కువని పేర్కొంది. ఇరాన్ ప్రకటనపై యూఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) నుంచి ఎలాంటి ధ్రువీకరణ రాలేదు. ఎఫ్35పై ఇరాన్ ప్రకటన నిజమేనని తేలితే.. అది అమెరికాకు భారీ నష్టమే అవుతుంది. అమెరికా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే విమానాల్లో ఎఫ్35 యుద్ధవిమానం ఒకటి. ఈ యుద్ధంలోనే తొలిసారి శత్రువుల చేతిలో దాడికి గురవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఎఫ్35 లైటనింగ్2.. అమెరికా, దాని మిత్రపక్షాల వాయుసేనలకు వెన్నెముక లాంటిది. ఈ అధునాతన స్టెల్త్ జెట్ ఖరీదు 10కోట్ల డాలర్లు పైనే. 19 దేశాలు దీన్ని కలిగిఉన్నాయి. విస్తృతస్థాయిలో వినియోగంలో ఉన్న ఐదోతరం యుద్ధ విమానం ఇదొక్కటే. దీనికి స్టెల్త్, సెన్సర్ సంధానత, నెట్‌వర్కింగ్ కీలకం.

## ఇరాన్ నుంచి భారత్‌కు రావలసిన నౌక చైనాకు?

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 (వుదయం) :**

అమెరికా ఆంక్షలకు గురైన, ఇరాన్ ముడి చమురును భారత్‌కు తీసుకువెళ్తున్న ఒక ట్యాంకర్ మధ్యలో ప్రయాణ మార్గాన్ని మార్చుకుంది. ఈ సరుకు రవాణా జరిగి ఉంటే, దాదాపు ఏడేళ్లలో భారత్‌కు వెళ్లే మొదటి రవాణా ఇదే అయ్యేది.

2002లో నిర్మించిన, 2025లో అమెరికా ఆంక్షలకు గురైన అఫ్రామాక్స్ ట్యాంకర్ 'పింగ్ షున్', ఈ వారం ప్రారంభంలో సూచించినట్టుగా గుజరాత్‌లోని వడినార్‌కు బదులుగా, ఇప్పుడు చైనాలోని డోంగింగ్‌ను తన గమ్యస్థానంగా సూచిస్తోందని షిప్‌ట్రాకింగ్ సంస్థ కెప్లర్ తెలిపింది.

చాలా వాణిజ్య నౌకలకు తప్పనిసరైన ట్రాకింగ్ వ్యవస్థ అయిన, షిప్ ఆటోమేటిక్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ (ఎఐఎస్) ట్రాన్స్‌పాండర్ సూచించిన గమ్యస్థానం అంతిమమైనదని ఎటువంటి నిర్ధారణ లేదు, ఎందుకంటే ప్రయాణ సమయంలో అది ఎప్పుడైనా మారవచ్చు.

గత మూడు రోజులుగా భారతదేశంలోని వడినార్‌కు ప్రయాణిస్తున్న ఇరాన్ ముడి చమురు నౌక పింగ్ షున్, గమ్యస్థానానికి చేరువలో ఉన్నప్పుడు తన ప్రకటించిన గమ్యస్థానంగా భారతదేశాన్ని తొలగించి, ఇప్పుడు చైనా దిశగా వెడుతున్నట్టు సంకేతాలు ఇస్తోంది, అని కమోడిటీ మార్కెట్ అనలిటిక్స్ సంస్థ క్లెప్లర్‌కు చెందిన లీడ్ రీసెర్చ్ అనలిస్ట్ (రిఫైనింగ్ అండ్ మోడలింగ్) సుమిత్ రిటోలియా అన్నారు.

అది మన దిశగా వస్తే, భారతదేశం 2019 తర్వాత కొనుగోలు చేసిన మొట్టమొదటి ఇరాన్ ముడి చమురు పింగ్ షున్‌లోని చమురు అయి ఉండేది.

వాషింగ్టన్ ఇటీవల ఆంక్షలను ఎత్తివేసిన నేపథ్యంలో, భారత రిఫైనరీలు సముద్ర మార్గంలో కొన్ని ఇరాన్ చమురు కార్గోలను కొనుగోలు చేసే అవకాశాలను అన్వేషిస్తున్నాయి.

రిటోలియా ప్రకారం, పింగ్ షున్ గమ్యస్థానంలో మార్పు, చెల్లింపులకు సంబంధించినదిగా కనిపిస్తోంది. అమ్మకందారులు నిబంధనలను కఠినతరం చేస్తూ, గతంలో ఉన్న 3060 రోజుల క్రెడిట్ గడువు నుంచి వైదొలిగి, ముందస్తు లేదా స్వల్పకాలిక చెల్లింపుల వైపు మొగ్గు చూపుతున్నారు.

ముడి చమురు అసలు అమ్మకందారు, కొనుగోలుదారు ఎవరో స్పష్టంగా తెలియడం లేదు.




వడినార్‌లో, రోస్‌నెఫ్ట్ మద్దతు ఉన్న నయారా ఎనర్జీ నిర్వహిస్తున్న, సంవత్సరానికి 20 మిలియన్ టన్నుల సామర్థ్యం గల చమురు శుద్ధి కర్మాగారం ఉంది.

ఇరాన్ ముడి చమురు విషయంలో ప్రయాణ మధ్యలో గమ్యస్థానాలు మారడం ఇదే మొదటిసారి కానప్పటికీ, ఆర్థిక నిబంధనలు, కౌంటర్ పార్టీ రిస్క్ పట్ల వాణిజ్య ప్రవాహాల సున్నితత్వం పెరుగుతోందని ఇవి స్పష్టం చేస్తున్నాయి, అని ఆయన అన్నారు.

చెల్లింపు సమస్యలు పరిష్కారమైతే, ఆ సరుకు భారతీయ రిఫైనరీకి చేరవచ్చు. అయితే, చైనానే కాకుండా ఇతర దేశాలకు ఇరాన్ ముడి చమురు సరఫరాలను నిర్ణయించడంలో లాజిస్టిక్స్‌తో పాటు వాణిజ్య నిబంధనలు కూడా ఎంత కీలకమవుతున్నాయో ఈ సంఘటన స్పష్టం చేస్తోంది.

ఇరాన్ ముడి చమురు దిగుమతులను పునఃప్రారంభించే ఏ నిర్ణయాన్నైనా సాంకేతికవాణిజ్య సాధ్యాసాధ్యాలే నిర్దేశిస్తాయని భారత చమురు మంత్రిత్వ శాఖ ఇప్పటివరకు చెబుతూ వస్తోంది.

చారిత్రాత్మకంగా, భారతదేశం ఇరాన్ చమురుకు ఒక ప్రధాన కొనుగోలుదారుగా ఉండేది. బలమైన రిఫైనరీ అనుకూలత, అనుకూలమైన వాణిజ్య నిబంధనల కారణంగా, ఇరాన్ నుండి తేలికపాటి, భారీ గ్రేడ్ చమురును గణనీయమైన పరిమాణంలో దిగుమతి చేసుకునేది.

2018లో కఠినమైన ఆంక్షల తరువాత, మే 2019 నుండి దిగుమతులు నిలిచిపోయాయి. వాటి స్థానంలో మధ్యప్రాచ్య, అమెరికా, ఇతర గ్రేడ్ చమురును దిగుమతి చేసుకోవడం జరిగింది.

గరిష్ట స్థాయిలో, భారతదేశం యొక్క మొత్తం దిగుమతులలో ఇరాన్ ముడి చమురు వాటా 11.5 శాతంగా ఉండేది. 2018లో భారతదేశం రోజుకు 5,18,000 బ్యారెళ్ల (బిపిడి) చమురును దిగుమతి చేసుకోగా, అమెరికా కొందరు కొనుగోలుదారులకు మినహాయింపులు ఇవ్వడంతో 2019 జనవరి, మే నెలల మధ్య ఇది 2,68,000 బిపిడికి తగ్గింది. అప్పటి నుండి దిగుమతులు జరగలేదు. భారతీయ రిఫైనరీలు గతంలో కొనుగోలు చేసిన కీలక గ్రేడ్‌లు ఇరాన్ లైట్ ,ఇరాన్ హెవీ క్రూడ్.

ఇరాన్‌తో ముడిపడి ఉన్న అమెరికాఇజ్రాయెల్ యుద్ధం కారణంగా పెరిగిన చమురు ధరలను తగ్గించే ప్రయత్నంలో భాగంగా, గత నెలలో అమెరికా సముద్ర మార్గంలో ఇరాన్ చమురు కొనుగోళ్లపై విధించిన ఆంక్షలను 30 రోజుల పాటు సడలించింది. ఈ గడువు ఏప్రిల్ 19న ముగుస్తుంది.



# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు



**హనుమకొండ, ఏప్రిల్ 03 (వుదయం ప్రతినిధి) :**
తెలంగాణ ఆయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య 99వ జయంతి వేడుకలను శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె. రవి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దొడ్డి కొమురయ్య ఉద్యమ స్ఫూర్తి భావితరాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తితో సమానత్వం, సామాజిక న్యాయం సాధనలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి లక్ష్మణ్, 49వ డివిజన్ కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్, దొడ్డి కొమురయ్య ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆసనాల శ్రీనివాస్, బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బట్టి శ్యాంప్రసాద్ యాదవ్, బీసీ-ఎస్సీ ఉమ్మడి జిల్లా చైర్మన్ ప్రొఫెసర్ చిన్న మల్లయ్య, జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ సన్యాసి శ్రీనివాస్, గొర్ల కాపరుల సంఘం అధ్యక్షుడు వేల్పుల రమేష్, కురుమ కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కంచు ప్రభాకర్, దొడ్డి కొమురయ్య కుటుంబ సభ్యులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సాయుధ పోరాటాలకు స్ఫూర్తి దొడ్డి కొమ్మురయ్య




**– జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**
**జనగాం, ఏప్రిల్ 03 (వుదయం ప్రతినిధి) :**
దొడ్డి కొమురయ్య తెలంగాణ తొలి విప్లవ వీరుడుఅని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు.శుక్రవారం రోజున సమీకృత కలెక్టరేట్ కార్యాలయం లో బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దొడ్డి కొమరయ్య జయంతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...

భూమి, భుక్తి, విముక్తి కోసం ప్రజల్లో స్ఫూర్తి నింపారని అన్నారు.సాయుధ పోరాటంలో కొమురయ్య వీర మరణం పొందడంతో గ్రామల్లోని ప్రజల్లో చైతన్యం కలిగి, తెలంగాణ ఉద్యమాలకు నిజాం పాలనపై పోరాటాలు కొనసాగించడానికి స్ఫూర్తిగా దొడ్డి కొమురయ్య నిలిచారన్నారు .
అనంతరం జిల్లా లోని వివిధ బిసి సంఘాల నాయకులు దొడ్డి కొమురమ్య చిత్రపటానికి పూలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో యం. లక్ష్మీనర్సింహ రావు, రవిందర్, జిల్లా లోని వివిధ కుల సంఘాల నాయకులు డి. మల్లికాంబ, జె. మల్లేష్, కె. రమేష్, యస్. అంజనేయులు, వి. చక్రపాణి, యం. సాంబయ్య, పి. హరీష్, బి. వెంకయ్య మల్లయ్య, యన్. కుమారస్వామి, సిహెచ్. వీరస్వామి, గోప ఫండర్ జిల్లా అధ్యక్షులు కె. పరుశరాములు, మేకల సమ్మయ్య, ఎం కృష్ణమూర్తి ,డి సిద్దయ్య గౌడ్ , యం.శ్రీనివాస్, కె. మధుసుధన్, ఎన్. సోమయ్య, బి. సిద్దలు, వివిధ బీసీ కుల సంఘాల నాయకులు, పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్య స్ఫూర్తి యువతకు ఆదర్శం




**– అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో**
**మహబూబాబాద్, ఏప్రిల్ 03 (వుదయం ప్రతినిధి) :**
తెలంగాణ ప్రభుత్వం మరియు కమిషనర్ బి.సి వెల్ఫేర్ ఇచ్చిన సూచనలు మెరకు తెలంగాణ సాయుధ పోరాటలో తొలి అమరుడు అయన దొడ్డి కొమరయ్య జయంతి గురువారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో అదనపు కలెక్టర్ దొడ్డి కొమరయ్య చిత్రపటంకు పూలమాల వేసి నివాళులర్పించారు.
ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో దొడ్డి కొమురయ్య చేసిన త్యాగాలు చిరస్మరణీయమని, ఆయన స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమము నిర్వహించిన జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి బి. శ్రీనివాసరావు, వసతి గృహ సంక్షేమ అధికారులు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది, జిల్లాలోని వివిధ యాదవ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను కలిసిన రాష్ట్ర కాంగ్రెస్ నేత యెల్లంల సంజీవరెడ్డి



**యాదాద్రి భువనగిరి / ఏప్రిల్ వుదయం జిల్లా ప్రతినిధి :**
హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య ని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు యెల్లంల సంజీవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో నియోజకవర్గ పరిధిలోని పలు రాజకీయ అంశాలు మరియు అభివృద్ధి పనులపై వారు చర్చించారు.

## పబ్లిక్ క్లబ్, బార్ అసోసియేషన్ నేతలకు ఘన సన్మానం

**కోదాడ ఏప్రిల్ 3(వుదయం)**
కోదాడ పట్టణంలోని పబ్లిక్ క్లబ్‌లో మిత్రమండలి ఆధ్వర్యంలో పబ్లిక్ క్లబ్ మరియు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులకు ఘన సన్మానం నిర్వహించారు. పబ్లిక్ క్లబ్ అధ్యక్షుడు కత్రం సీతారాంరెడ్డి, కార్యదర్శి పోటు రంగారావు, అలాగే కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, కార్యదర్శి రామిశెట్టి రామకృష్ణలను మిత్రమండలి సభ్యులు శాలువాలతో సత్కరించారు.
ఈ సందర్భంగా మిత్రమండలి అధ్యక్షులు మేకల వెంకట్రావు మాట్లాడుతూఈ కార్యక్రమంలో పైడిమర్రి సత్యబాబు, కౌన్సిలర్ యలగందల నర్సయ్య, పులగండ్ల శ్రీనివాసరావు, తీగల కరుణాకర్, కందిబండ సత్యం, పందిరి సత్యనారాయణ, భాగం వెంకటనారాయణ, మందడి రంగారెడ్డి, పసుపులేటి నాగేశ్వరరావు, నెల్లూరి వెంకటేశ్వరరావు, ఓరుగంటి రవి, మిక్కిలినేని రామారావు, ముత్తినేని సైదయ్య, తాళ్లూరి నరసింహారావు, వీరారెడ్డి లింగారెడ్డి, పాశం నాగిరెడ్డి, సూరగాని యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# నగర చెరువులకు మహర్దశ!

రూ. 6 కోట్లతో పునర్జీవన పనులు ప్రారంభం : మంత్రి సురేఖ



**వరంగల్, ఏప్రిల్ 03 (వుదయం జిల్లా ప్రతినిధి) :**
నగరంలోని చారిత్రక చెరువుల సుందరీకరణ, పునర్జీవనమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా అమృత్ 2.0 పథకం కింద పబ్లిక్ హెల్త్ విభాగం ఆధ్వర్యంలో సుమారు రూ. 6 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పనులకు రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శుక్రవారం రోజున శంకుస్థాపన చేశారు.దేశాయిపేటలోని చిన్నవడ్డేపల్లి చెరువు, ఉర్సుగుట్టలోని రంగ సముద్రం చెరువుల పునరుద్ధరణ పనులను మంత్రి కొండా సురేఖ స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించారు.పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతతో పాటు నగరం నడిబొడ్డున ఉన్న ఈ చెరువులను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దడంతో పాటు, భూగర్భ జలాల పెరుగుదలకు ఈ పునర్జీవన పనులు దోహదపడతాయని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ప్రజా సౌకర్యాలు కోసం చెరువు కట్టల బలోపేతం, పూడికతీత, పరిసరాల సుందరీకరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్ డాక్టర్ సత్య శారద, హన్మకొండ జిల్లా కలెక్టర్, బల్దియా ఇంచార్జి కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ పాల్గొన్నారు. వారితో పాటు కార్పొరేటర్లు సురేష్ జోషి, మరుపల్ల రవి.పబ్లిక్ హెల్త్ విభాగం ఉన్నతాధికారులు.స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్య జీవిత ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి
## స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ



**ఖమ్మం, వుదయం బ్యూరో ఏప్రిల్ -03:**
దొడ్డి కొమురయ్య జీవిత ఆశయాలను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తెలిపారు.శుక్రవారం లకారం ట్యాంక్ బండ్ వద్ద జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ దొడ్డి కొమురయ్య జయంతి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొని, దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి వీరమరణం పొందిన యోధుడిగా దొడ్డి కొమురయ్య చరిత్రలో చిర స్థాయిగా నిలిచారని, వారి ధైర్యం, త్యాగం, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం మనకు స్ఫూర్తిదాయకం అని అన్నారు. రాజకీయ, సామాజిక రంగాలలో ఎదురైన అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడారని, రైతుల హక్కులు, పేదల సంక్షేమం కోసం చేసిన త్యాగం ఎప్పటికీ మరువలేనిదని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, తెలంగాణ జిల్లా గౌడ సంఘ అధ్యక్షులు కత్తి నెహ్రూ గౌడ్, బిసి సంఘ నాయకులు కూరాకుల నాగభూషణం, కురుమ సంఘ జిల్లా అధ్యక్షులు మాయర గంగయ్య, గౌరవ సలహాదారు చావళ్ల నాగేశ్వరరావు, కోడి లింగయ్య, చిత్తారు ఇందుమతి, గూడె మల్లయ్య, భూక్యా శోభా నాయక్, కొరిపల్లి శ్రీనివాస్, పెల్లూరి విజయ్ కుమార్, సాదిక్ అలీ, మేకల సుగుణారావు, చావల నాగరాజు, మూడుముంతల గంగరాజు, తమ్మారపు బ్రహ్మయ్య, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్‌ను విధుల నుంచి తప్పించాలి!

**అక్రమ పట్టాలపై విచారణ జరపాలి**
**సీపీఎం జిల్లా నాయకత్వం డిమాండ్**
**చనిపోయిన వ్యక్తి భూమిని ఇతరుల పేరిట మార్చడంపై ఆగ్రహం**
**గోరికొత్తపల్లి, ఏప్రిల్ 03 (వుదయం ప్రతినిధి) :**
గోరికొత్తపల్లి మండలంలోని చిన్నకోడెపాక గ్రామంలో చనిపోయిన వ్యక్తి భూమిని అక్రమంగా పట్టా చేసిన తహసీల్దార్‌పై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొట్ల చక్రపాణి, గుర్రం దేవేందర్‌లు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు.చిన్నకోడెపాక గ్రామంలోని కుమ్మరి కుంట వెనకాల ఉన్న సర్వే నంబర్లు 257 నుండి 266 వరకు గల 11 ఎకరాల 34 కుంటల భూమిని 1983లోనే ఐతరాజు రంగనాయకమ్మ ప్రభుత్వానికి విక్రయించారు. అయితే, ప్రభుత్వం భూమిని స్వాధీనం చేసుకోకపోవడం, హద్దులు నిర్ణయించకపోవడాన్ని ఆసరాగా చేసుకుని గతంలో కొందరు అక్రమంగా పట్టా చేసుకున్నారని వారు ఆరోపించారు. వారిపై క్రిమినల్ కేసులు పెట్టి, ఆ పట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

**అక్రమాలకు పరాకాష్ట..**
తహసీల్దార్ వ్యవహారశైలిపై నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సర్వే నంబర్లు 268 నుండి 271 వరకు ఉన్న 5 ఎకరాల 20 కుంటల భూమికి సంబంధించి అక్రమాలు జరిగాయని వారు పేర్కొన్నారు. చనిపోయిన ఐతరాజు రంగనాయకమ్మ పేరును 'పోతరాజు రంగనాయకమ్మ'గా మార్చారు.కనీసం క్షేత్రస్థాయి పరిశీలన చేయకుండానే రేగుల సాంబయ్య పేరు మీదకు పట్టా చేసేశారు. ధరణి లేదా భూభారతి దరఖాస్తులు లేకుండా, వారసులకు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఇవ్వకుండా నేరుగా పట్టా మార్చడం వెనుక అంతర్యమేమిటని ప్రశ్నించారు. అక్రమంగా పట్టా పొందిన రేగుల సాంబయ్య భూమి ఎక్కడుందో, దాని హద్దులు ఏంటో తహసీల్దార్ నిరూపించాలి.నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన తహసీల్దార్‌పై ఉన్నతాధికారులు విచారణ జరిపి, ఆయనను వెంటనే విధుల నుంచి తొలగించాలి. ఇళ్ల నిర్మాణానికి కేటాయించిన ఈ భూమిని కాపాడి, ప్రభుత్వ పరమైన చర్యలు చేపట్టాలి. తహసీల్దార్ తన చిత్తశుద్ధిని నిరూపించుకోలేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

# దొడ్డి కొమురయ్య కు ఘన నివాళులు



**నల్గొండ ,ఏప్రిల్ 03 (వుదయం ప్రతినిధి) :**
తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు కామ్రేడ్ దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా నల్గొండ జిల్లా ఆర్జాల బావి గ్రామ సర్కిల్‌లో ఉన్న వారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడి అమరుడైన కామ్రేడ్ దొడ్డి కొమురయ్య చిరస్మరణీయుడని కొనియాడారు. వరంగల్ జిల్లా దేవరుప్పల మండలం కడవెండి గ్రామంలో దొరల అరాచకాలకు వ్యతిరేకంగా ధైర్యంగా ఎదిరించి, దేశముఖ్ రామచంద్రారెడ్డి కుటుంబ అకృత్యాలకు వ్యతిరేకంగా పోరాడి తుపాకీ గుళ్లకు బలైన వీరుడని గుర్తు చేశారు.కామ్రేడ్ దొడ్డి కొమురయ్య జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని నల్గొండ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చీర పంకజ్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మిర్యాల యాదగిరి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు .ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి శబరయ్య, వంగూరు నారాయణ యాదవ్, గుండు వెంకటేశ్వర్లు, కర్నాటి విజయకుమార్, సుక్కర్బోయిన పరమేష్ యాదవ్, కోటేష్ యాదవ్, కుంటి గొర్ల లింగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



**జయశంకర్ భూపాలపల్లి ఏప్రిల్ 03(వుదయం జిల్లా ప్రతినిధి):**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమేల మండలం సర్వాయిపేట గ్రామానికి చెందిన తిప్పనపల్లి రమేష్ ఇటీవలే కాటారం దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించగా వారి కుటుంబాన్ని పలిమేల మండల బిఆర్ఎస్ అధ్యక్షులు ఆలం సత్యనారాయణ, మండలం యూత్ అధ్యక్షులు లంగారి రవీందర్ నాయకులు, కార్యకర్తలతో కలిసి శుక్రవారం మృతుని భార్య సమ్మక్కకు 50 కేజీలా బియ్యంతో తో పాటు నిత్యావసర సరుకులు అందించి మృతుని కుటుంబానికి భరోసాగా నిలిచారు. రమేష్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని కోరారు. ఆ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్వాయి పేట గ్రామశాఖ అధ్యక్షుడు సప్పిడి మాంతయ్య, కల్లురి వెంకట్, లంగారి లక్ష్మయ్య, దుర్గం నల్లగొండ,

కుమ్మరి మహేష్, తిప్పనపల్లి రవీందర్, సప్పిడి యేసయ్య, జనగాం రామ్మూర్తి, కల్లురి సాగర్, జనగాం సమ్మయ్య, తిప్పనపల్లి రాజు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లాలో జనగణన పనులు సమగ్రంగా చేపట్టాలి
## కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏప్రిల్ 03 (వుదయం ప్రతినిధి):**
జిల్లాలో జాతీయ జనగణన కార్యక్రమాన్ని సమగ్రంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులకు సూచించారు. జనగణన ప్రక్రియలో ప్రతి ఇంటిని కవర్ చేస్తూ, ఎలాంటి లోపాలు లేకుండా ఖచ్చితమైన డేటా సేకరణ జరగాలని ఆయన అన్నారు .
జాతీయ జనగణన కార్యక్రమం భాగంగా ఏప్రిల్ 1 నుండి 3 వరకు జిల్లా ఐడీఓసీ కార్యాలయంలో ఫీల్డ్ ట్రైనర్స్‌కు మూడు రోజులపాటు శిక్షణా తరగతులు నిర్వహించబడినట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించబడగా, ఫీల్డ్ స్థాయిలో పని చేసే సిబ్బందికి అవసరమైన అన్ని అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు.ఈ శిక్షణలో మాస్టర్ ట్రైనర్స్‌గా ఎన్. శివరామకృష్ణ, డాక్టర్ పి. సుస్మిత రజిని పాల్గొని, మొత్తం 34 మంది ఫీల్డ్ ట్రైనీస్‌కు జనగణన నిర్వహణ విధానం, హౌస్ సెన్సెస్, డేటా సేకరణలో పాటించాల్సిన జాగ్రత్తలు, డిజిటల్ పద్ధతుల వినియోగం తదితర అంశాలపై విపులంగా శిక్షణ అందించారు.
శిక్షణలో భాగంగా మూడవ రోజు పాలకోయ తండా ప్రాంతంలో ప్రాక్టికల్ డెమో నిర్వహించారు. ఫీల్డ్ ట్రైనీస్‌ను అవుట్ ఫీల్డ్‌కు తీసుకెళ్లి, ఇంటింటికి వెళ్లి సమాచారం సేకరించే విధానాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా మొదటి ఇంటిలో హౌస్ సెన్సెస్ కార్యక్రమాన్ని కలెక్టర్ అంకిత్ సమక్షంలో నిర్వహించారు. ఈ డెమో ద్వారా ఫీల్డ్ ట్రైనీస్‌కు ప్రత్యక్ష అనుభవం లభించింది.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జనగణనలో సేకరించే సమాచారం ప్రభుత్వ విధానాల రూపకల్పనకు ఎంతో కీలకమని అన్నారు . అందువల్ల ప్రతి వివరాన్ని శ్రద్ధగా నమోదు చేయాలని, ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా బాధ్యతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారికి అవసరమైన సమాచారం అందిస్తూ డేటా సేకరణ చేపట్టాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సెన్సెస్ జిల్లా అధికార సిబ్బంది, సి.పి.ఓ. సంజీవ రావు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు. అనంతరం శిక్షణా

## ముగ్గురు కొడుకులున్నా బుక్కెడు బువ్వకే నోచని తల్లి



**ఆస్తి తీసుకుని తల్లిని వదిలేసిన కుమారులు –**
**అధికారులను వేడుకుంటున్న 95 ఏళ్ల వృద్ధురాలు**
**సూర్యాపేట ఏప్రిల్ 3(వుదయం):**
సూర్యాపేట జిల్లా మోతె మండలం నామవరం గ్రామంలో ఓ వృద్ధ తల్లి దుస్థితి స్థానికులను కంటతడి పెట్టిస్తోంది. కన్నకొడుకులు ఉన్నా కడుపునిండా అన్నం దొరకక బుక్కెడు బువ్వ కోసం ఎదురుచూస్తున్న శతాధిక వృద్ధురాలి పరిస్థితి గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.నామవరం గ్రామానికి చెందిన నల్లగంతుల వెంకమ్మ (95) భర్త మూడు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మరణించాడు. ఆమెకు ముగ్గురుకుమారులు పాపయ్య, వెంకన్న, ఎల్లయ్య ఉన్నారు. తండ్రి మరణించిన తరువాత తల్లిని చూసుకుంటామని చెప్పిన కుమారులు, తల్లి పేరుమీద ఉన్న మూడు ఎకరాల తొమ్మిది గుంటల భూమిని తలా ఒక ఎకరం మూడు గుంటల చొప్పున రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఆస్తి తమ పేర్లకు మారిన తరువాత తల్లిని ఒంటరిగా వదిలేసి వెళ్లిపోయారు.
దీంతో నిస్సహాయ స్థితిలో ఉన్న వెంకమ్మ స్థానికుల సహాయంతో సూర్యాపేట ఆర్డీఓను ఆశ్రయించింది. స్పందించిన ఆర్డీఓ ముగ్గురు కుమారులను పిలిపించి ఒక్కొక్కరు నెలకు రూ.1500 చొప్పున తల్లికి ఇవ్వాలని ఆదేశించారు. అయితే ఆర్డీఓ ఆదేశాలను కూడా పట్టించుకోకుండా కుమారులు వెళ్లిపోయినట్లు తెలుస్తోంది.ఇటీవల ప్రమాదవశాత్తు కిందపడి నడుము విరిగిపోవడంతో వెంకమ్మ కూతురు వద్ద ఉంటోంది. ఆమె కూడా పోషించడానికి ఇబ్బంది పడుతున్నట్లు సమాచారం. తనకు బుక్కెడు అన్నం పెట్టేలా కుమారులకు బుద్ధి చెప్పాలని వెంకమ్మ స్థానికులతో కలిసి జిల్లా కలెక్టర్, అధికారులను వేడుకుంటోంది.

## ఖమ్మం ప్రెస్ క్లబ్ వార్షిక శ్వేత పత్రం విడుదల




**హర్షం వ్యక్తం చేసిన జర్నలిస్టులు**
**ఖమ్మం వుదయం బ్యూరోఏప్రిల్ 3:**
ఖమ్మం ప్రెస్ క్లబ్ పాలకమండలి వార్షిక ఆదాయ, వ్యయాల శ్వేత పత్రాన్ని విడుదల చేశారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వార్షిక ఆదాయ వ్యయాలను టి యు డబ్ల్యూ జే (ఐజేయు), టి యు డబ్ల్యూ జే (టి జే ఎఫ్) ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నామ పురుషోత్తం, గుద్దేటి రమేష్ బాబు లు వెల్లడించారు. ఏప్రిల్ 2025 నుంచి మార్చి 2026 వరకు ఈ 12 నెలల కాలంలో 74 ప్రెస్ మీట్ల కు గాను 1,06,500 ఆదాయం లభించిందని, వీటిలో వర్కర్ జీతం, కరెంటు బిల్లు, వాటర్ బిల్లు, మైక్ సెట్ ల కొనుగోలు, విద్యుత్ పరికరాల కొనుగోలు, ప్రెస్ క్లబ్ కు అవసరమైన స్టేషనరీ తదితర కొనుగోళ్లకు రూ.75,756 రూపాయలు ఖర్చు అయినట్లు తెలిపారు. వీటిల్లో ఈ ఏడాది రూ.30,744 రూపాయలు మిగులు బడ్జెట్ గా లభించిందని ప్రకటించారు. ప్రెస్ క్లబ్ అభివృద్ధికి ప్రతి జర్నలిస్ట్ తమ సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ కమిటీలు వార్షిక ఆదాయ, వ్యయాల శ్వేత పత్రాన్ని విడుదల చేయటం పట్ల జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో టి యు డబ్ల్యూ జే (ఐ జే యు) ప్రెస్ క్లబ్ కార్యదర్శి శీలం శ్రీనివాస్, టి యు డబ్ల్యూ జే (టిజేఎఫ్) ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు పి. పానకాలరావు, రేపాక యాదగిరి, పులి శ్రీను, ప్రచార కార్యదర్శి కూరపాటి నరేష్, కమిటీ సభ్యులు మురళి, ఉల్లోజు రమేష్, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, శంకర్, ఐజేయు రామారావు, పాల్గొన్నారు.

## సాయి నైసా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం



**నల్గొండవుదయం బ్యూరోఏప్రిల్ 3:**
నల్గొండ బస్టాండ్ సమీపంలో అత్యాధునిక సదుపాయాలతో ఏర్పాటు చేసిన సాయి నైసా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ను రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్యఅతిథిగాపాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నల్గొండ పట్టణం వైద్యరంగంలో ముందంజలో నిలవాలని ఆకాంక్షించారు. వైద్యం లాభాపేక్షతో కాకుండా మానవతా దృక్పథంతో అందించాలన్నారు. పేదలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్యం అందించడం వైద్యుల బాధ్యత అని తెలిపారు.డబ్బు కోసం కాకుండా మనశ్శాంతి కోసం వైద్యం చేయాలని డాక్టర్లకు సూచించారు. అత్యాధునిక సదుపాయాలతో ఆస్పత్రి ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.అత్యవసర వైద్యం 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కూడా సేవలు విస్తరించాలని సూచించారు.
వైద్య రంగ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని మంత్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్ అబ్బగోని కవిత రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్ | మెదక్ ఉమ్మడి జిల్లాల వార్తలు

## బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు

◆ జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

నారాయణపేట, ఏప్రిల్ 3 (వుదయం ప్రతినిధి):



ప్రస్తుతం ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ జరుగుతున్న నేపథ్యంలో, కొంతమంది యువత తక్కువ సమయంలో, సులువుగా డబ్బులు సంపాదించాలని ఆశించి క్రికెట్ బెట్టింగులకు పాల్పడు తున్నారని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు.ఇలాంటి బెట్టింగ్స్ వల్ల యువత ఆర్థికంగా నష్టపోయి, జీవితాలు నాశనం చేసుకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని సందర్భాల్లో తీవ్ర నిరాశకు గురై ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదం కూడా ఉందని, దీంతో కుటుంబాలు తీవ్రంగా దెబ్బతింటాయ ని హెచ్చరించారు.క్రికెట్ బెట్టింగ్స్ చట్ట రీత్యా నేరమని, ఇందులో పాల్గొనే వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తా మని స్పష్టం చేశారు. అలాగే బెట్టింగ్ నిర్వహించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.యువత ఈ మాయలో పడకుండా జాగ్రత్తపడాలని, తమ భవిష్యత్తును నాశనం చేసుకోకూడ దని ఎస్పీ గారు సూచించారు. తల్లిదండ్రు లు కూడా తమ పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచి, వారి రోజువారీ కార్యకలాపాలను గమనించాలని సూచించారు. మ్యాచ్‌ల సమయంలో పిల్లల్లో ఏవైనా అనుమా నాస్పద మార్పులు గమనిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు.క్రికెట్ వంటి ఆటలను వినోదంగా మాత్రమే చూడాలని, వాటిని బెట్టింగ్‌ల కోసం ఉపయోగించకూడదని అన్నారు.క్రికెట్ బెట్టింగ్, ప్లేయింగ్ కార్డ్స్, బెట్టింగ్ యాప్స్ వంటి అసాంఘిక కార్యకలా పాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.క్రికెట్ బెట్టింగ్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వారు వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారదాతల వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## రైతాంగ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత దొడ్డి కొమరయ్య

### మంత్రి దామోదర రాజనర్సింహ

**ప్రతి ఒక్కరూ ఆయన మార్గాన్ని అనుసరించాలి**

**విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళి**

సంగారెడ్డి, ఏప్రిల్ 3 (వుదయం జిల్లా ప్రతినిధి) :



తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో అమరవీరుడు దొడ్డి కొ మరయ్య పాత్ర అత్యంత కీలకమని, తెలంగాణ రైతాంగ ఉద్యమానికి నాంది పలికిన గొప్ప నాయకుడు దొడ్డి కొమరయ్య అని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. రైతుల హక్కుల కోసం, అన్యాయాలకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమని అన్నారు. దొడ్డి కొమరయ్య జయంతి సందర్భంగా శుక్రవారం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిం చిన కార్యక్రమంలో మంత్రి దామోదర రాజనర్సింహ, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోతి రెడ్డిపల్లిలోని దొడ్డి కొమరయ్య విగ్ర హానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మంత్రి మాట్లాడుతూ.. సామాజిక న్యాయం, సమానత్వం కోసం దొడ్డి కొమరయ్య చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అను సరించాలని పిలుపునిచ్చారు. ఆయన ఆశయాలను సాకారం చేయడం ద్వారానే సమాజంలో నిజమైన అభివృ ద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ప్రజా సేవలో ఆయన స్ఫూర్తిని ఆచరణలో పె ట్టాలని సూచించారు.అనంతరం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మా ట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ ఉద్యమ నాయకుడు దొడ్డి కొమరయ్యను యువత ఆదర్శంగా తీసుకుని ఆయన మార్గాన్ని అనుస రించి సమాజానికి సేవ చేయాలని సూచించారు. సమానత్వం, న్యాయం, సౌభ్రాతృత్వం అనే విలువలను పాటిస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో శాసనసభ్యుడు చింతా ప్రభాకర్, సం గారెడ్డి, ఇస్నాపూర్ మున్సిపల్ చైర్‌ప ర్సన్లు కూన వనిత, సుమలత శ్రీకాంత్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జగదీశ్, కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డం మల్లయ్య, జనరల్ సెక్రటరీ తాటిపల్లి పాండు, బీసీ సంఘం యూత్ ప్రెసిడెంట్ రమేష్ కుమార్, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## పార్కింగ్ పేరిట దోపిడి

◆ గద్వాల రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల ఆవేదన

గద్వాల, మార్చి 03 (వుదయం ప్రతినిధి):

జోగులాంబ గద్వాల రైల్వే స్టేషన్‌లో బైక్ పార్కింగ్ ఫీజుల పేరుతో ప్రయాణి కుల నుండి ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేస్తున్న ఘటనలు వెలుగులో కి వచ్చాయి. నిబంధనలకు విరుద్ధంగా ఒకే రోజులో వేర్వేరు సమయాలకు వేర్వేరు రేట్లు అమలు చేస్తూ వాహన దారులను ఇబ్బందులకు గురిచేస్తున్నా రు ప్రయాణి కుల వివరాల ప్రకారం ఉదయం 6:30 గంటల నుండి రాత్రి 7:00 గంటల వరకు ₹70, అలాగే ఉదయం 8:00 గంటల నుండి రాత్రి 8:00 గంటల వరకు ₹60 వసూలు చే స్తున్నారు ఈ రేట్లలో స్పష్టత లేకపోవడం వల్ల వాహనదారులు అయోమయానికి గురవుతున్నారు.ఇంకా ఫీజులపై ప్రశ్ని స్తే పార్కింగ్ నిర్వాహకులు 90 లక్షలకు వేలం పాట తీసుకున్నాము... ఎలా వసూలు చేయాలో మాకు తెలుసు అంటూ బెదిరిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విధమైన ప్రవర్తనతో ప్రయాణికులు అవమానాలు భరిస్తూ మానసిక ఒత్తిడికి గురవుతు న్నారు ప్రభుత్వం నిర్ణయించిన నిబంధ నలు పాటించకుండా ప్రయాణికు లపై అదనపు భారాన్ని మోపడం అన్యా యం అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు ఈ అంశంపై సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి పార్కింగ్ ఫీజులపై స్పష్టమైన మార్గద ర్శకాలు అమలు చేయాలని అక్రమ వసూళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## దొడ్డి కొమురయ్య జీవితం యువతకు స్ఫూర్తి దాయకం

### అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్





వికారాబాద్ , ఏప్రిల్ 3 (వుదయం జిల్లా ప్రతినిధి) :

తెలంగాణ సాయుధ పోరాటం లో తొలి వీరమరణం పొందిన యోధుడు దొడ్డి కొ మురయ్య జీవితం యువతకు స్ఫూర్తి దా యకమని జిల్లా అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ తెలిపారు.ఆ మహనీయు డి జయంతి సందర్భంగా శుక్రవారం కలె క్టరేట్ కార్యాలయ సమావేశం మందిరం లో బి సి వెల్ఫేర్ అధికారి మాధవ్ రెడ్డి ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడు తూ తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి వీరమరణం పొందిన యోధుడిగా దొడ్డి కొమురయ్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని అదనపు కలెక్టర్ కొనియాడా రు.ఆ మహనీయుడి ధైర్యం, త్యాగం, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకమని అదనపు కలెక్టర్ అన్నారు.రాజకీయ, సామాజిక రంగాలలో అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడిన దొడ్డి కొముర య్య ఆశయాలు నేటికీ ప్రసంగించు కుంటున్నామని, రైతుల హక్కులు, పేదల సంక్షేమం కోసం ఆయన చేసిన త్యాగం ఎప్పటికీ మరువలేనిదని అదనపు కలె క్టర్ ప్రశంసించారు.ఈ సందర్భంలో యువత ఆయన జీవితం నుంచి స్ఫూర్తి పొందుతూ సమాజంలో న్యాయం, సమా నత్వం కోసం కృషి చేయాలని,ఆయన చూపిన మార్గంలో నడుస్తూ ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాలని అదనపు కలెక్టర్ పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమం లో బి సి వెల్ఫేర్ అధికారి మాధవ రెడ్డి, సంబంధిత అధికారులు, తదితరులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు

వనపర్తి ఏప్రిల్ 3 (వుదయం ప్రతినిధి):

నిరంకుశ పాలన నుంచి తెలంగాణ ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకు నేందుకు ప్రాణాలను పణంగా పెట్టిన యోధుడు దొడ్డి కొమురయ్య అని బీసీ సంక్షేమ శాఖ అధికారి ముజాహిద్ కొనియాడారు. శుక్రవారం ఐ డి ఓ సి ఆవరణలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వ ర్యంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ అధికారి మాట్లాడుతూ నిరంకుశ పాలన నుంచి తెలంగాణ ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకు నేందుకు ప్రాణాలను పణంగా పెట్టిన యోధుడు దొడ్డి కొమురయ్య అని కొ నియాడారు. ఈ సందర్భంగా ఆయన త్యాగాన్ని, ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేసుకున్నారు.తెలంగాణ సాయుధ పోరులో తొలి అమరుడైన కొముర య్య ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్ర మంలో బీసీ సంక్షేమ శాఖ సిబ్బంది, ప్రజా సంఘాల నాయకులు, తదితరు లు పాల్గొన్నారు.



## దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే

మహబూబ్ నగర్, ఏప్రిల్ 3 (వుదయం ప్రతినిధి):



దొడ్డి కొమురయ్య ఆశయాలను సాధిం చేందుకు అందరూ కృషి చేయాలని మహబూబ్‌నగర్ స్థానిక శాసన సభ్యులు ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, దొడ్డి కొమురయ్య జయంతిని పురస్క రించుకొని శుక్రవారం మహబూబ్‌న గర్‌లోని పద్మావతి కాలనీలో ఆయన వి గ్రహాన్ని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి జిల్లా కుర్వ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిజాం కాలంలో దొరల అరాచకాలకు, సమాజంలోని అసమా నతలకు వ్యతిరేకంగా దొడ్డి కొముర య్య చేసిన పోరాటాన్ని కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాట తొలి అమ రవీరుడిగా ఆయన చరిత్రలో చిరస్థాయి గా నిలిచారని పేర్కొన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని సమాజంలో సమాన త్వం, న్యాయం స్థాపన కోసం అందరూ కృషి చేయాలని సూచించారు.ఇంచార్జి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధు సూదన్ నాయక్ మాట్లాడుతూ దొడ్డి కొ మురయ్య సామాజిక న్యాయం, సమాన త్వం కోసం చేసిన సేవలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని చెప్పారు. యువత ఆయన జీవితం నుండి స్ఫూర్తి పొంది సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మూడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్, జిల్లా కుర్వ సంఘం అధ్యక్షుడు సుధ నర సింహులు, ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, బి.సి సంక్షేమ శాఖ అధికారి ఇందిర, ఇతర నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## త్యాగానికి, శాంతికి చిహ్నం గుడ్ ఫ్రైడే

వెల్దండ, ఏప్రిల్ 3 (వు దయం) :

వెల్దండ మండల పరిధిలోని గుండాల గ్రామంలోని ఎంబి బెత్లెహెమ్ చర్చిలో పాస్టర్ జోసప్ ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా జరుపుకున్నారు ఈ సందర్భంగా పోస్టర్ మాట్లాడు తూ ఏసు ప్రభువు తన ప్రజల కొరకు వారి యొక్క పాపములనుండి వారిని రక్షించడానికి తాను శిలువలో శ్రమ నోంది తన ప్రజలకు శిలువపై ఏసు ప్రభువు పలికిన ఏడు మాటలను యేసు నామంతో ఆలపించారు.ఈ కార్యక్రమంలో సంఘస్తులు దావీదు, మున్నా ,లాబాను, పీటర్,లక్ష్మణ్ ,సంతోష్, రవి కుమార్, ప్రసాద్, యాదగిరి, శ్రీనివాసులు,వెంకటమ్మ, బాల కిష్టమ్మ, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి మనందరికీ ఆదర్శం





◆ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్ , ఏప్రిల్ 3 (వుదయం జిల్లా ప్రతినిధి) :

దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన దొడ్డి కొము రయ్య 99వ జయంతి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, వెనుకబడిన తరగతుల సహాయ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, సంఘ నాయకులు యాదగి రితో కలిసి ఆయన చిత్రపటానికి పూ లమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దొడ్డి కొమురయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన మహానుభావు డని తెలిపారు. అణచివేతలకు వ్యతిరే కంగా ప్రజల హక్కుల కోసం ప్రాణత్యా గం చేసిన తొలి అమరుడిగా ఆయన చరిత్రలో నిలిచారని పేర్కొన్నారు. కొమురయ్య చూపిన ధైర్యం, త్యాగం, పోరాట స్ఫూర్తి నేటి యువతకు మార్గ దర్శకమని అన్నారు.ప్రజల హక్కులు, సమానత్వం కోసం ఆయన చేసిన త్యాగాలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారానే నిజమైన నివాళి అర్పించినవా రమవుతామని తెలిపారు. సమాజంలో న్యాయం, సమానత్వం నెలకొల్పేందు కు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలు పునిచ్చారు.మహనీయులను కులం, వర్గం అనే పరిమితుల్లో చూడకుండా వారి ఆశయాలను అందరూ ఆద ర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ఆమె సూచించారు .ఈ కార్యక్రమంలో బీ.సీ సంఘాల ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## వైభవంగా శోభయాత్రలు

సిద్దిపేట/గజ్వేల్, ఏప్రిల్ 03 (వుదయం ప్రతినిధి)

సిద్దిపేట జిల్లావ్యాప్తంగా హనుమాన్ జయంతి వేడుకలు ఆధ్యాత్మిక ఉత్సా హంతో, అత్యంత వైభవంగా నిర్వ హించబడ్డాయి. భక్తుల జయజయ ధ్వానాలు, మారుతి నామస్మరణతో జిల్లాలోని ఆలయాలు మార్మోగాయి. ముఖ్యంగా సిద్దిపేట, గజ్వేల్ పట్టణాల్లో భారీ ఎత్తున నిర్వహించిన శోభాయా త్రలు కన్నులపండువగా సాగాయి. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తుగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. సున్నిత ప్రాంతాల్లో నిఘా పెంచడంతో పాటు, భారీగా పోలీస్ బలగాలను మోహరించారు. ఫలితంగా శోభాయాత్రలు అత్యంత ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. ర్యాలీలు సాగే మార్గాల్లో సాధారణ ప్ర జలకు ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ పోలీసులు వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లించారు. విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు పరిస్థి తిని పర్యవేక్షిస్తూ శాంతి భద్రతలను కాపాడటంలో కీలక పాత్ర పోషించారు. సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞ తలు: సిపి రష్మీ పెరుమాళ్ వేడుకలు ప్రశాంతంగా ముగియడంపై సిద్దిపేట కమిషనర్ ఆఫ్ పోలీస్ రష్మీ పెరుమాళ్, ఐపిఎస్ హర్షం వ్యక్తం చేశారు. శాంతి భద్రతలను కాపాడటంలో సహక రించిన ఉత్సవ కమిటీ సభ్యులకు, క్రమశిక్షణతో వ్యవహరించిన ప్రజలకు మరియు అంకితభావంతో పనిచేసిన పోలీస్ సిబ్బందికి ఆమె ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. అందరి సహకారంతోనే జిల్లాలో పండుగ వాతా వరణం ప్రశాంతంగా కొనసాగిందని ఆమె పేర్కొన్నారు.

## ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం

◆ 7న గజ్వేల్ జిల్లా ఆసుపత్రిలో నిర్వహణ - సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ వెల్లడి

గజ్వేల్, ఏప్రిల్ 03 (వుదయం ప్రతినిధి) :




"రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి" అంటూ గజ్వేల్ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ పిలుపునిచ్చారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని (వరల్డ్ హెల్త్ డే) పురస్క రించుకొని ఈనెల 7వ తేదీ (మంగళ వారం) ఉదయం 10:30 గంటలకు గజ్వేల్ జిల్లా ఆసుపత్రిలో భారీ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు, ఆరో గ్యవంతులు ఎవరైనా స్వచ్ఛందంగా రక్త దానం చేయవచ్చని పేర్కొన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం వల్ల శరీరంలో కొత్త ఎర్ర రక్త కణాలు ఉత్పత్తి అవుతాయని, దీనివల్ల వ్యాధి నిరోధక శక్తి పెరిగి శరీరం ఉత్సా హంగా, ఉల్లాసంగా ఉంటుందని వివ రించారు.రక్తదానం కేవలం ఇతరుల ప్రాణాలు కాపాడటమే కాకుండా, దాతలకు కూడా అనేక ఆరోగ్య ప్రయోజ నాలను కలిగిస్తుందని ఆమె తెలిపారూ. రక్తదానం చేసే సమయంలో రక్తపో టు (BP), పల్స్ రేటు, హిమోగ్లోబిన్ స్థాయిలు మరియు బ్లడ్ గ్రూప్ వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించబడ తాయి. తరచూ రక్తదానం చేయడం వల్ల శరీరంలో ఇనుము స్థాయిలు సమతుల్యంగా ఉండి, గుండెపోటు వచ్చే ప్రమాదం 88 శాతం వరకు తగ్గుతుంది. రక్తదానం చేయడం వల్ల శరీర బరువును సమతుల్యం చేసుకోవ చ్చు. ఇతరులకు సహాయం చేశామనే భావన ఒత్తిడిని తగ్గించి, మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది. శరీరంలో భవిష్యత్తులో వచ్చే అనారోగ్య సమస్య లను ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుంది.గజ్వేల్ మరియు పరిసర ప్రాంత యువత ఈ సదవకాశాన్ని విని యోగించుకుని పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని ఆమె కోరారు. రక్తదానం చేయదలచిన వారు మరిన్ని వివరాల కోసం 99084 72511 లేదా 95505 34471 నంబర్లను సంప్రదిం చవచ్చని సూచించారు.



## రైతులు పండించిన ప్రతి గింజకు ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తుంది

◆ ఎమ్మెల్యే డాక్టర్ పి. సంజీవరెడ్డి

నారాయణఖేడ్, మార్చి 03(వుదయం):

శనగల కొనుగోలు కేంద్రా ప్రారంభ ఉత్సవంలో రైతులు పండించిన ప్రతి గింజకు ప్రభుత్వం మద్దతు ధర కల్పి స్తుందని ఎమ్మెల్యే డాక్టర్ పి సంజీవరెడ్డి అన్నారు.నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలోని నిజాంపేట్ మండల్ బాచే పల్లి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పిఎసిఎస్నా పేడ్ మా ర్క్ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రభు త్వ శనగల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మె ల్యే ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మద్దతు ధర క్వింటాలకు 5,875 రూపాయలు చొప్పున రైతుల వద్ద నుండి శనగలను కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల ద్వారానే తమ పంటను విక్ర యించి లబ్ధి పొందాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

**21 కోటతో నూతన రోడ్డు పనులకు శంకుస్థాపన.**

నారాయణఖేడ్ మండలంలోని మూడు గుంటలు వయా సంజీవరావుపేట ,కద్పల్, సిర్గాపూర్ నుండి గౌడ్ గౌవ్ వరకు ఆర్ బి రహదారుల, భవనాలు శాఖ ఆధ్వర్యంలో మంజూరైన ఇరవై ఒక్క కోట్ల రూపాయల నూతన రోడ్డు పనులను ఎమ్మెల్యే డాక్టర్ పి సంజీవ రెడ్డి,చంద్రశేఖర్ రెడ్డి రాష్ట్ర నాయకులు ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన రావణ సౌకర్యాలు కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయి తే ఈ ప్రాంత ప్రజలకు దశాబ్దాల రావణ కష్టాలు తీరని ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు అనాధికా రులు తదితరులు పాల్గొన్నారు.

## యువతీ యువకులకు సువర్ణావకాశం

◆ గిరిజన సంక్షేమాధికారి నీలిమ

వుదయం, మెదక్ బ్యూరో (ఏప్రిల్ 03):



గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కేంద్ర ప్ర భుత్వ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్ర మం అమలు చేయబడుతున్నట్లు గిరిజన సంక్షేమాధికారి నీలిమ తెలిపారు.ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లా డుతూ గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, న్యూఢిల్లీ ఆధ్వ ర్యంలో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిం చబడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన గిరిజన యువతకు 25 సీట్లు కేటాయించ బడ్డాయని మెదక్ జిల్లాకు చెందిన అర్హత గల నిరుద్యోగ అభ్యర్థులు తమ దరఖా స్తులను పూర్తి చేసి ఏప్రిల్ 10, 2026 లోపు సమర్పించాలని సూచించారు.ఈ శిక్షణ కార్యక్రమం భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ సమన్వయంతో, కోచిలోని స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టి ట్యూట్‌లో మే 2026లో ప్రారంభమయ్యే తదుపరి బ్యాచ్ కోసం నిర్వహించబడు తోందన్నారు. ఇండస్ట్రియల్ ఎలక్ట్రిషియన్ (ఆయిల్ & గ్యాస్), ఇండస్ట్రియల్ వెల్డర్ (ఆయిల్ & గ్యాస్), ప్రాసెస్ ఇన్‌స్ట్రుమెం టేషన్ టెక్నీషియన్, ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్, టెక్నీషియన్ - ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చ రింగ్ లాంటి రంగాల్లో 6 నెలలు (రెసిడె న్షియల్ శిక్షణ) ఉంటుందని ఇందుకు టెక్నికల్ డిప్లొమా పూర్తి చేసినవారు లేదా ఫైనల్ ఇయర్ విద్యార్థులు,ITI ఉత్తీర్ణులై 25 సంవత్సరాలు వయస్సు కలిగి ఉండాలన్నారు.ఎస్టీ అభ్యర్థులకు 2 సంవత్సరాల సడలింపు ఉందని సూచించారు.ట్రైనింగ్ సమయంలో ఉచిత వసతి మరియు భోజనం,లెర్నింగ్ మెటీరియల్స్,యూనిఫామ్ మరియు సేఫ్టీ షూస్ సదుపాయాలు కల్పిస్తున్న ట్లు తెలిపారు.శిక్షణ అనంతరం నేషనల్ కౌన్సిల్ ఫర్ వొకేషనల్ మరియు టెక్నిక ల్ ఎడ్యుకేషన్ ద్వారా సర్టిఫికేట్ ప్రదానం చేసి ఉపాధి (ప్లేస్‌మెంట్) అవకాశాలు కల్పించబడతాయని గిరిజన యువత (స్త్రీ, పురుషులు) ఈ సువర్ణావకాశాన్ని వినియోగించుకొని తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని గిరిజన సంక్షేమాధి కారి నీలిమ కోరారు. దరఖాస్తుల సమర్ప ణకు చివరి తేదీ ఏప్రిల్ 10, 2026 ఆన్‌లైన్ దరఖాస్తు లింక్ http://dsapponline.com/sds/form/register.php సంప్రదించాలన్నారు.



## మెదక్ జిల్లాకు గద్దర్ పేరు పెట్టాలి

◆ డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ డిమాండ్

దౌల్తాబాద్ , ఏప్రిల్ 3 (వుదయం జిల్లా ప్రతినిధి) :

మెదక్ జిల్లాకు ప్రముఖ ప్రజాగాయకుడు గద్దర్ పేరు పెట్టాలని దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్) జాతీయ కార్యదర్శి పి. శంకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల ఏప్రిల్ 6న హైదరాబాద్లో ని ర్వహించనున్న "ప్రశ్నించే గొంతులు సాధించిన విజయాలు గద్దర్ పునర్జ న్మ" రాష్ట్ర స్థాయి సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం రాయపోల్ మండల కేం ద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సభకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లా డుతూ, ప్రజా యుద్ధ నౌకగా పేరుగాం చిన గద్దర్‌పై కాల్పులు జరిగిన ఏప్రిల్ 6 తేదీని ప్రతి సంవత్సరం "గద్దర్ పునర్జన్మ దినంగా" నిర్వహిస్తామని తెలిపారు. గద్దర్‌కు జన్మనిచ్చిన మెదక్ జిల్లాకు ఆయన పేరును నామకరణం చేయడం ద్వారా ప్రజా గాయకుడికి తగిన గౌరవం దక్కుతుందని పేర్కొన్నారు. అలాగే హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం 5 గంటల నుంచి జరిగే రాష్ట్ర స్థాయి సభకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు .ఈ కార్యక్రమంలో రాయపోల్ గ్రామ సర్పంచ్ మాసంపల్లి రాజు, రాయపోల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పుట్ట రాజు, ప్రజా సంఘాల నాయకులు సతీష్, విష్ణు, మన్నె గణేష్, నవీన్, రాజు, మహేష్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేటలో పరిస్థితి పూర్తిగా ప్రశాంతం



- వదంతులను నమ్మవద్దు
- అవాస్తవాలు ప్రచారం చేస్తే కఠిన చర్యలు – వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు హెచ్చరిక

**సిద్దిపేట, ఏప్రిల్ 03 (వుదయం ప్రతినిధి):**

సిద్దిపేట పట్టణంలో ప్రస్తుత పరిస్థితి పూర్తిగా ప్రశాంతంగా ఉందని, శాంతి భద్రతలు పోలీసుల నియంత్రణలోనే ఉన్నాయని వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, పోలీస్ శాఖ అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకుందని ఆయన తెలిపారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్ (ట్విట్టర్) వంటి వేదికలపై వచ్చే తప్పుడు వార్తలను, వదంతులను ప్రజలు నమ్మవద్దు. అవాస్తవాలను ప్రచారం చేస్తూ సమాజంలో అలజడి సృష్టించే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటాం. సోషల్ మీడియా గ్రూపుల అడ్మిన్లు అప్రమత్తంగా ఉండాలి. రెచ్చగొట్టే పోస్టులు పెడితే అడ్మిన్లనే బాధ్యులను చేస్తాం. పట్టణ ప్రజలు బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించి శాంతి స్థాపనకు పోలీసులకు సహకరించాలని ఇన్‌స్పెక్టర్ కోరారు. ఏదైనా అనుమానాస్పద సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డైల్ 100కు సమాచారం అందించాలని సూచించారు. అప్రమత్తంగా ఉంటూ శాంతిభద్రతలను కాపాడటంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



- సాయిధ పోరాట అమరుడు దొడ్డి కొమురయ్య
- పట్టణ కురుమ సంఘం అధ్యక్షులు మల్లేశం

**జోగిపేట, వు దయం**

శుక్రవారం జోగిపేట్ మధ్య రంగం వద్ద తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు, దొరల దురా గతాలను ఎదిరించి ఎదిరించి న గొప్ప వీరుడు దొడ్డి కొమురయ్య అని జోగిపేట మున్సిపల్ పట్టణ కురుమ సంఘం అధ్యక్షులు గొర్లకాడి మల్లేశం అన్నారు. దొడ్డి కొమురయ్య 99వ జయంతి సందర్భంగా పట్టణంలోని క్లాక్ టవర్ వద్ద కురుమ సంఘం సభ్యులు దొడ్డు కొమురయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దొడ్డు కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం పోరాడిన యోధుడు అని కొనియాడారు.కురుమ సంఘం యూత్ అధ్యక్షులు బిర్ల అనిల్ కుమార్ మాట్లాడుతూ నేటి యువతకు ఆదర్శ ప్రియుడు దొడ్డి కొమురయ్య అని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో యూత్ ప్రధాన కార్యదర్శి కే. కృష్ణ, కురుమ సంఘం సభ్యులు ఆంజనేయులు, జోగినాథ్, నాగరాజు, సదాశివుడు, లక్ష్మణ్,శ్రీనివాస్ ,మల్లేశం, కే మల్లేశం, నాగేష్, వెంకటేశం, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

## పంటలు ఎండిపోయి రైతులు కష్టాల్లో ఉంటే

# ప్రభుత్వం ఏం చేస్తోంది?



**ఎండిన పంట పొలాల పరిశీలన**

**రైతులను వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేసిన వంటేరు ప్రతాప్ రెడ్డి**

**కొండపాక, ఏప్రిల్ 3 (వుదయం జిల్లా ప్రతినిధి) :**

ఆరుగాలం కష్టపడి, ఎన్నో వ్యయప్రయాసలను ఎదుర్కొని వేసిన పంటలు ఎండిపోవడంతో రైతులు పడుతున్న బాధలను రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలియజేసి, పంటలు ఎండిపోయిన రైతుల పక్షణా నిలిచి వారికీ ధైర్యాన్ని నింపాలనే ఉద్దేశంతో శుక్రవారం రోజు బీఆరెస్ మండల అధ్యక్షులు నూనె కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఎఫ్డీసి మాజీ చైర్మెన్, బీఆరెస్ పార్టీ గజ్వేల్ నియోజక ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి దుద్దెడ గ్రామానికి చెందిన పలువురు రైతుల పంటపొలాలను పరిశీలించారు. ఇందులో భాగంగా దుద్దెడ గ్రామ రైతు పుట్ట మల్లేశం రెండేకరాల ఎండిపోయిన వరిపోలం చూసి ఆవేదన వ్యక్తం చేసారు. ఈ సందర్బంగా అయన వారు మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వల్లనే కరెంట్ కష్టాలు వచ్చాయి అని, వచ్చి రాని కరెంట్ తోనే పొలాలు ఎండడమే కాకుండా, బోర్ మోటార్లు కాలిపోతున్నాయాన్నారు.



గతంలో కెసిఆర్ బీఆరెస్ ప్రభుత్వం లో నిమిషం పాటు కూడా కరెంటు పోకుండా 24 గంటల నాణ్యమైన కరెంట్ అందించమన్నారు. కానీ ఇపుడు కనీసం 12గంటల విద్యుత్తు కూడా సరిగ్గా సప్లై చేయడం లేదు ఈ ప్రభుత్వం అని అసహనం వ్యక్తం చేసారు. గతమా ప్రభుత్వ హయం లో ఎరువులు విత్తనాలు ఇంటి వద్దకే వచ్చేవని, నాట్లు వేసే సమయంలోనే రైతుబంధు అందించి రైతులకు మేలు జరిగేలా చూసామన్నారు.ముందు చూపులేని రేవంత్ రెడ్డి పాలనా రైతులకు శాపంగా మారిందన్నారు.ఉమ్మడి రాష్ట్రం లో మన ప్రాంత రైతుల ఆత్మహత్యలు, నీటి కరువులను చూసి చావుకు తెగించి ఉద్యమాలు చేసి మన తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి కాలేశ్వరం, మల్లన్న సాగర్ కొండపోచమ్మ సాగర్ రంగనాయక సాగర్, లాంటి ప్రాజెక్టుల నిర్మాణాలతో రైతుల తలరాత మార్చే దిశగా నాడు కెసిఆర్ ప్రభుత్వం ముందుకెలితే నేడు రేవంత్ రెడ్డి రైతులను కష్టాలు, నష్టాల ఉభిలోకి నేడుతున్నాడన్నాడు.ఎన్నికల సమయంలో ఇచ్చిన 420హామీలు, 6గ్యారెంటీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేసారు.కాలేశ్వరం ప్రాజెక్టు లో భాగంగా నిర్మించిన మల్లన్న సాగర్ నుండి తిమ్మాయిపల్లి వరకు టన్నెల్ ను, కాల్వపనులను వెంటనే పూర్తి చేస్తే కొండపాక మండలం తో పాటు పక్క మండలాలకు నీరందిస్తే పచ్చని పంట పొలాలు సాధ్యం అవుతాయి అన్నారు.కాలేశ్వరంపై తప్పుడు ప్రచారాలు చేస్తూ, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల రైతులపై రేవంత్ రెడ్డి కక్ష కట్టి పెండింగ్ లో ఉన్న కాలువలకు నిధులు మంజూరుచేయడం లేదని, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నియోజక వర్గంలో 18గంటల కరెంట్ సరఫరా చేస్తూ సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాలకు కేవలం 12గంటల కరెంట్ ఇస్తున్నారని, ప్రాంతాల వారిగా రైతులను వివక్షకు గురి చేస్తుంది రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి అనంతుల అశ్విని ప్రశాంత్, మాజీ ఎంపీపీ ర్యాగల సుగుణ దుర్గయ్య, మండల ఫోరం అధ్యక్షుడు కాసపురం సంజీవరెడ్డి, దుద్దెడ గ్రామ సర్పంచ్ మిద్దె శివకుమార్,సర్పంచులు గాలి బాలయ్య, ముత్యాల ఎల్లం, తేలు అశోక్, బొమ్మ మల్లయ్య, కోడెల రవి, బాలస్వామి, సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు వెలికట్ట మాజీ సర్పంచ్ అమ్ముల రమేష్, దోమల ఎల్లం, పెద్దంకుల శ్రీనివాస్, పిల్లి నాగరాజు, గోనె శ్రీనివాస్, రాజిరెడ్డి, జీర్ర రాజు, సురేందర్ రెడ్డి, నరసింహారెడ్డి, గొట్టే ఐలయ్య, చిలుముల రామ్మోహన్, వెంకటేష్, కోడెల మల్లేశం, సున్నం భాస్కర్, దొమ్మాట మహిపాల్ రెడ్డి, బోద్దుల తిరుపతి, సింగాటం రాములు, సుధాకర్, యాదగిరి,బీరయ్య, కనకయ్య, మైలారం శ్రీను, విష్ణు, రవి, బాల నరసయ్య, రమేష్, దున్న సాయిలు, యాదగిరి, కిష్టయ్య, పుట్ట చంద్రం, సురేందర్, దొడ్ల సురేష్, ఎర్రబోయిన కనకయ్య, జైపాల్, ప్రసాద్, భాను, బాబు, శ్యామ్, సంతోష్, రాజు యాదవ్, నర్సింలు, తిరుపతి, నరేష్, కర్ణాకర్, చంద్రశేఖర్, కొమ్ము స్వామి, చంద్రం, మల్లేశం, కురాటి రమేష్, సుధాకర్, రాసుల రంజిత్, వినేష్, మహేష్, దుస్స భాస్కర్, సీత రాజు, బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.




# గచ్చిబౌలి పబ్ లలో ఈగల్ టీం తనిఖీలు

**హైదరాబాద్ , ఏప్రిల్ 3 (వుదయం జిల్లా ప్రతినిధి) :**

గచ్చిబౌలి పోలిస్ స్టేషన్ పరిధిలో పబ్ లలో ఈగల్ టీం పోలీసులు తనిఖీలు నిర్వహించారు.కోండాపుర్ లోని క్వాక్ ఎరినా పబ్ లో తనిఖీలు నిర్వహించారు. గురువారం రాత్రి సౌత్ ఆఫ్రికా కు చెందిన ప్రముఖ డీజే బ్లాక్ కాఫీ పేరిట పబ్ నిర్వాహకులు భారీ ఈవెంట్ నిర్వహించారు. ఈ నేపధ్యంలో ఈగల్ టీమ్ తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 8 మందికి డ్రగ్స్ పాజిటివ్ గా గుర్తించారు. డ్రగ్స్ పాజిటివ్ వచ్చిన వారికి గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ కి తరలించారు. గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# పురుగుల మందు తాగి సర్పంచ్ ఆత్మహత్యాయత్నం

- ఆసుపత్రికి తీసుకెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదం




నిర్మల్ జిల్లా కడెం మండలం మాసాయిపేట గ్రామంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సర్పంచ్ లహరిక గమనించి లహరికను కారులో ఆసుపత్రికి తీసుకెళ్తుండగా రోడ్డు ప్రమాదం అదుపుతప్పి రోడ్డు పక్కన నిలిపి ఉంచిన ట్రాక్టర్ నాగళ్లను బలంగా ఢీకొట్టిన కారుఈ ప్రమాదంలో లహరిక పరిస్థితి మరింత విషమించి మార్గమధ్యంలోనే మృతి లహరిక ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.



# సొంత ఇంట్లోనే బంగారు ఆభరణాల దొంగతనం

- కుమారుడితో సహా ముగ్గురు నిందితుల అరెస్ట్ - 137 గ్రాముల బంగారం స్వాధీనం

కేసు వివరాలు: ఈ ఏడాది మార్చి 31న, హఫీజ్ బాబా నగర్‌కు చెందిన శ్రీ మహ్మద్ రహ్మత్ షరీఫ్ (56) కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జనవరి 17న తన భార్య మరియు కుమార్తెకు చెందిన బంగారు ఆభరణాలను (2 చిన్న నెక్లెస్‌లు, 1 పెద్ద నెక్లెస్, 2 బంగారు గొలుసులు) బీరువాలో భద్రపరిచామని, మార్చి 29న తనిఖీ చేయగా అవి కనిపించలేదని పేర్కొన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఈ దొంగతనానికి పాల్పడి ఉంటారని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై కంచన్‌బాగ్ పోలీసులు FIR No. 62/2026, u/s 305 (a) BNS కింద కేసు నమోదు చేశారు.
నిందితుల అరెస్ట్: ఈ కేసును దర్యాప్తు చేసిన పోలీసులు, ఈరోజు (02042026) ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు:

1. A1: మహ్మద్ అద్నాన్ షరీఫ్ (19) విద్యార్థి (ఫిర్యాదుదారుని కుమారుడు).
2. A2: మహ్మద్ రెహాన్ ఉద్దీన్ (25) వ్యాపారి.
3. A3: మహ్మద్ సమీర్ (22) మెడికల్ సేల్స్‌మెన్.

స్వాధీనం చేసుకున్న సొత్తు:

- సుమారు 137 గ్రాముల (13.7 తులాల) బంగారు ఆభరణాలు.
- 4 సెల్ ఫోన్లు.
- ఒక వెర్నా కారు.

నేర విధానం (Modus Operandi): నిందితుడు A1 (కుమారుడు) ఒక కుటుంబ వేడుకలో తన తల్లి, సోదరి ధరించిన బంగారు ఆభరణాలను గమనించి, అవి ఇంట్లోని బీరువాలో ఉండటాన్ని చూశాడు. విలాసవంతమైన జీవితానికి అలవాటు పడి, సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో తన స్నేహితులైన A2 మరియు A3లతో కలిసి దొంగతనానికి ప్లాన్ చేశాడు. జనవరి నెల నుండి మొత్తం నాలుగు సార్లు ఇంట్లో ఎవరికీ తెలియకుండా బంగారం దొంగిలించి, వాటిని విక్రయించమని A2, A3లకు అప్పగించాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వారు కూడా ఈ నేరంలో భాగస్వాములయ్యారు.పోలీసు బృందం: చాంద్రాయణగుట్ట డివిజన్ ఏసీపీ శ్రీ ఎ. సుధాకర్ గారి పర్యవేక్షణలో, కంచన్‌బాగ్ ఎస్.హెచ్.ఓ శ్రీ వై. కమల్ కుమార్, ఎస్.ఐ కె. రాజు మరియు క్రైమ్ స్టాఫ్ పకడ్బందీగా ఆధారాలు సేకరించి నిందితులను పట్టుకున్నారు.కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన పోలీసు బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు. నిందితులు A1 నుండి A3లను గౌరవనీయ న్యాయస్థానం ముందు జుడిషియల్ రిమాండ్ నిమిత్తం హాజరుపరుస్తున్నారు.

## నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా

# పోరాటం చేసిన మహనీయుడు దొడ్డి కొమరయ్య

- ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**సంగారెడ్డి, ఏప్రిల్ 3(వుదయం):**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరుడు దొడ్డి కొమరయ్య జయంతి సందర్భంగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమరయ్య విగ్రహానికి మంత్రి దామోదర రాజనరసింహ, స్థానిక ఎమ్మెల్యే చింత ప్రభాకర్, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ...**



నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా రైతుల హక్కుల కోసం అన్యాయానికి ఎదురు నిలిచిన మహనీయుడు దొడ్డి కొమరయ్య అని కొనియాడారు. ఆయన చూపిన పోరాట స్ఫూర్తి నేటి తరాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. తెలంగాణ చరిత్రలో దొడ్డి కొమరయ్య త్యాగాలు చిరస్థాయిగా నిలిచిపోయాయని తెలిపారు.
రైతాంగ హక్కుల సాధనలో ఆయన ప్రదర్శించిన ధైర్యసాహసాలు ఎప్పటికీ మరువలేనివని, సమానత్వ సమాజ నిర్మాణానికి ఆయన ఆశయాలు మార్గదర్శకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని దొడ్డి కొమరయ్యకు ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, డా. శ్రీహరి, పట్టణ అధ్యక్షుడు ఆర్ వెంకటేశ్వర్లు, లాడే మల్లేశం, మాజీ జడ్పీటీసీ కొండల్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి గ్రామంలో

# సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

- సీఐ రఘువీర్ రెడ్డి

**వెల్దండ, ఏప్రిల్ 3 (వు దయం) :**

ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నేరాలను అరికట్టే చేయాలని సీఐ రఘువీర్ రెడ్డి సూచించారు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు ఉప సర్పంచ్లు తో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా సీఐ రఘువీర్ రెడ్డి, ఎస్సై కురుమూర్తి తో కలిసి గ్రామాల్లో ప్రధానంగా యువత చెడు అలవాట్లు దిశగా మత్తు పదార్థాల వాడకం, పోకిరి చేష్టలు, అమలు చిన్న చిన్న తగాదాలు జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు అన్ని గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేపట్టాలని తెలిపారు

## విద్యార్థి అయాన్‌ను

# పరామర్శించిన మాజీ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్

**నారాయణపేట, ఏప్రిల్ 3 (వుదయం ప్రతినిధి):**

జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల హాస్టల్ లో విద్యార్థి అయాన్ ను ఉపాధ్యాయుడు తీవ్రంగా కొట్టి గాయపరిచిన సంఘటన విషయాన్ని తెలుసుకున్న మాజీ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్ శుక్రవారం ఆ విద్యార్థిని నీ పరామర్శించారు. నారాయణపేట మండలం జాజాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థి ఆయాన్ ను పరామర్శిస్తూ మాట్లాడుతూ నారాయణపేట జిల్లా మైనార్టీ గురుకుల పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న ఆయన్ అనే విద్యార్థి మీద కాంట్రాక్ట్ బేసిక్ మీద చదువు చెప్పే ఉపాధ్యాయుడు ఎలాంటి కారణాలు లేకుండా కొట్టి తీవ్రంగా గాయపరిచిన సంఘటన తీవ్రంగా కలకాలం లేపిన ఇప్పటికీ జిల్లా కలెక్టర్ జిల్లా యంత్రాంగం, స్థానిక ఎమ్మెల్యే ఎవరు స్పందించకపోవడం ఏంటని ఆయన ప్రశ్నించారు.గురుకులాల్లో నిరుపేద మైనారిటీ విద్యార్థులు చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలనే లక్ష్యంతో టిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ స్థాపించిన గురుకులాలను నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆన వాళ్లను




చెరిపేసే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ఒకపక్క గురుకులాల్లో ఫుడ్ పైసింగ్ మరోపక్క ఇలాంటి టీచర్లు విద్యార్థులను అకారణంగా కొట్టి హాస్టల్ నుంచి వెళ్లిపోయే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. దాంతో మైనారిటీ గురుకులాలను మూసే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. ఇలాంటి ప్రయత్నాలను ప్రజలు ఎప్పటికప్పుడు గమనిస్తున్నారని దీనికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదనే ఆయన హెచ్చరించారు. క్వాలిఫికేషన్ లేకుండా వారికి కావాల్సిన వారినే గురుకులాల్లో ఉపాధ్యాయులుగా నియమించుకొని విద్యను వ్యాపారంగా మార్చడం జరిగిందన్నారు.విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని దీనికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు. ఈ విద్యార్థిని కొట్టిన ఉపాధ్యాయుడు మీద ఇప్పటిదాకా జిల్లా కలెక్టర్ కానీ జిల్లా మైనార్టీ కి సంబంధించిన అధికారులు ఎవరూ పూర్తిస్థాయిలో విచారణ చేయలేదని ఈ విషయం మీద పూర్తి విచారణ చేసి బాధ్యుల మీద చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున విద్యార్థుల తరపున పోరాటాన్ని చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మహమ్మద్ దానేష్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జడ్చర్ల, సయ్యద్ ఆరిఫ్ ఖాద్రి మండల మైనారిటీ అధ్యక్షులు, మహమూద్ అన్సారీ మైనారిటీ టౌన్ అధ్యక్షులు, అన్వర్, రహీం, ఇంతియాజ్, ఫహీం,అబుల్ సలీం అడ్వకేట్ సీనియర్ నాయకులు, తాజుద్దీన్ టింగలీ, ఫిరోజ్, చాంద్ పాషా, జాకీర్ హజారి, ఇర్ఫాన్ తౌసిఫ్,ఖిజార్, వహీద్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఇండ్లు కూల్చే మీ నుంచి మేం నేర్చుకోవాలా..?

- సీఎం రేవంత్ పై కేరళం సీఎం పినరయి విజయన్ ఫైర్
- తెలంగాణలో పేదల ఇళ్లపై బుల్డోజర్లు నడిపిస్తున్నరు
- కేరళం అభివృద్ధి గురించి మాకు పాఠాలు చెప్పొద్దు
- అవినీతిలో ఆరో స్థానంలో తెలంగాణ

**హైదరాబాద్, ఏప్రిల్ 03 (వుదయం ప్రతినిధి) :**



తెలంగాణలో పేదల ఇండ్లను కూల్చే కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి పాఠాలు నేర్చుకోవాల్సిన దుస్థితిలో కేరళం ప్రజలు, ప్రభుత్వం లేదని కేరళ సీఎం పినరయి విజయన్ స్పష్టం చేశారు. తెలంగాణలో పేదల ఇళ్లపై బుల్డోజర్లు నడిపిస్తున్న విషయాన్ని మరిచిపోయి, కేరళం అభివృద్ధి గురించి పాఠాలు చెప్పడానికి రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఆయన్ని ఎవరో తప్పుదోవ పట్టించారని విజయన్ ఎద్దేవా చేశారు. కేరళంలో అసెంబ్లీ ఎన్నికల సమరంలో యూడీఎఫ్ తరపున ప్రచారానికి వెళ్లిన రేవంత్ రెడ్డి అక్కడ ప్రధాని మోడీ, సీఎం విజయన్‌లను "మోడీ బ్రదర్స్" అని సంబోధిస్తూ విమర్శలు గుప్పించారు. కేరళంలో అవినీతి, అడ్మినిస్ట్రేటివ్ వైఫల్యాలు ఉన్నాయని, పినరయి విజయన్ పాలన 'చీకటి యుగం' అని ఆయన ఆరోపించారు.ఈ వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. వీటికి పినరయి విజయన్ శుక్రవారం సోషల్ మీడియా వేదికగా ఘాటుగా సమాధానమిచ్చారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను "సమాచారం లేని విమర్శలు"గా విజయన్ కొట్టిపారేశారు. నీతి ఆయోగ్ సుస్థిర అభివృద్ధి సూచీ (2023-24) ప్రకారం, కేరళం దేశంలోనే అత్యంత తక్కువ అవినీతిరహిత గల రాష్ట్రంగా అగ్రస్థానంలో ఉందన్నారు. తెలంగాణ 6వ స్థానంలో ఉందని ఆయన గుర్తు చేశారు. కేరళంలో పేదరికం రేటు కేవలం 0.55శాతం మాత్రమేనన్న పినరయి.. ఇది దేశంలోనే అత్యల్పమని పేర్కొన్నారు. అక్షరాస్యత, శిశు మరణాల రేటు తగ్గించడంలో కేరళం ఎంతో ముందుందని, తెలంగాణ కంటే మెరుగైన స్థితిలో ఉందని గణాంకాలను వివరించారు. జీతాలు, పెన్షన్లు సక్రమంగా చెల్లించలేని ప్రభుత్వం నడుపుతున్న వ్యక్తి నుండి కేరళం నేర్చుకోవాల్సింది ఏమీ లేదు. కేరళం నుండి పాలన పాఠాలు నేర్చుకోవాల్సింది రేవంత్ రెడ్డే," అని విజయన్ చురకలంటించారు.

# తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో భేటీ ఎంపీ డీకే అరుణ

**బీజేపీజాతీయఉపాధ్యక్షురాలు**

**ఊర్కొండ , 3 (వుదయం ప్రతినిధి):**

లోక్ భవన్ లో తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తో భేటీ అయిన బీజేపీజాతీయఉపాధ్యక్షురాలు,ఎంపీ డీకే అరుణ .మహబూబ్ నగర్ ఖేల్ సంసద్ మహోత్సవ్ ముగింపు వేడుకకు ముఖ్య అతిథిగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ని ఆహ్వానించిన ఎంపీ డీకే అరుణ.ఏప్రిల్ 9వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే క్రీడా మహోత్సవం గురించి గవర్నర్ కి వివరించిన ఎంపీ డీకే అరుణ .24వ తేదీన మహబూబ్ నగర్ వేదికగా జరిగే ముగింపు వేడుకకు హాజరవుతానని సానుకూలంగా స్పందించిన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా .ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి MJR మహబూబ్నగర్ కార్పొరేటర్ కిరణ్ కుమార్ మరియు బిజెపి నాయకులు పాల్గొన్నారు



# ఎస్ఐఆర్ లో గద్వాల జిల్లా అద్భుత ప్రగతి

- 21వ స్థానం నుంచి మూడవ స్థానానికి చేరువ

**గద్వాల, ఏప్రిల్ 3 (వు దయం ప్రతినిధి):**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు ఇటీవలి కాలంలో స్పష్టమైన కార్యాచరణతో ముందుకెళ్లడంతో జిల్లా ఎస్ఐఆర్ నివేదికలో విశేషమైన పురోగతిని సాధించినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవస్థలో ఉన్న లోపాలను సమగ్రంగా గుర్తించి, వాటిని వేగంగా సరిదిద్దే దిశగా జోగులాంబ గద్వాల జిల్లా అధికార యంత్రాంగం తీసుకున్న నిర్ణయాల కారణంగా ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)లో జిల్లా 21వ స్థానం నుంచి మూడవ స్థానానికి చేరుకున్నట్లు తెలిపారు. ఓటరు



జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ చేస్తున్న సూపర్వైజర్లు, బూత్ లెవెల్ అధికారులపై పర్యవేక్షణ పెంచడంతో ఎస్ఐఆర్ 63 శాతం నుండి 74 శాతంకు పెరిగి భారీ మెరుగుదల నమోదు చేసిందన్నారు. ఫలితంగా జిల్లా 27.02.2026 నాటికి రాష్ట్రస్థాయిలో 21వ స్థానంలో ఉండగా, 31.03.2026 నాటికి 3వ స్థానానికి చేరుకుందన్నారు. ప్రత్యేకంగా బూత్ స్థాయి అధికారులతో సమావేశాలు, మండల స్థాయి సమీక్షా సమావేశాలు నిర్వహించడంతో పాటు, రాజకీయ ప్రతినిధులు, సంబంధిత వర్గాలను భాగస్వామ్యం చేయడం ద్వారా సమన్వయాన్ని పెంచి, పారదర్శకతతో ముందుకెళ్లామన్నారు. ప్రస్తుత దృఢ నాయకత్వం, క్రమశిక్షణ, సమష్టి కృషి, సమన్వయం భవిష్యత్తులోనూ కొనసాగుతుందన్నారు.రాబోయే ఎస్ఐఆర్ షెడ్యూల్‌ను దృష్టిలో ఉంచుకుని, ఇదే విధమైన కట్టుదిట్టమైన కార్యాచరణ కొనసాగించాలని, త్వరలోనే మన జిల్లా ఎస్ఐఆర్ నివేదికలో మొదటి స్థానానికి చేరుకునేలా కృషి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సంబంధిత అధికారులకు, సిబ్బందికి పిలుపునిచ్చారు.



## గోనుపాడులో

# చలివేంద్రం ప్రారంభం

**గద్వాల ఏప్రిల్ 3 (వుదయం ప్రతినిధి)**

గద్వాల నియోజకవర్గ గోనుపాడు గ్రామం లో పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని గోనుపాడు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సర్పంచ్ శ్రీమతి జి.' రాములమ్మ అధ్యక్షతన ప్రారంభమైన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలకు చల్లని పానీయాలు అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు వేసవి కాలంలో ప్రజలు ఎండల బాధ నుంచి ఉపశమనం పొందేందుకు సర్పంచ్, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి కలిసి ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వడ్డే పరుష రాముడు మజ్జిగను స్పాన్సర్ చేసి సహకరించారు గ్రామ ప్రజలు కూడా ముందుకు వచ్చి చలివేంద్రం నిర్వహణకు మజ్జిగ, రాగి జావ వంటి పానీయాలను స్పాన్సర్ చేయాలని గ్రామ నాయకులు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్, ఎన్.హెచ్ ఖాజా, బొట్టు అంజి, బి. నాగరాజు, సింగారం అంజి, డీలర్ చంటి, పెద్ద వెంకటన్న, అంజనేయులు, పెద్ద నర్సింహులు, నర్సింహ, మల్లికార్జునతో పాటు గ్రామ యువకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

## ఎడాపెడా తినేస్తే లేనిపోని చిక్కులు..



బొప్పాయిలోని పోషకాలు అనేక వ్యాధులను కూడా నివారించగలవు. ఈ పండు ఆరోగ్యానికి ఎంత మేలు చేసేదైనప్పటికీ, కొన్ని రకాల వ్యాధులతో బాధపడేవారి ఆరోగ్యానికి బొప్పాయి అంత మంచిది కాదు. అంటే బొప్పాయి అందరికీ ఒకే విధంగా ప్రయోజనం చేకూర్చదన్నమాట. బొప్పాయి పోషకమైన పండు. ఈ పండులో అవసరమైన విటమిన్లు, అనేక ఇతర ఆరోగ్య ప్రయోజనాలు అందించే పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఈ పండులో విటమిన్ సితో పాటు ఫైబర్, కెరోటిన్, విటమిన్ ఇ, ఎ, శరీరానికి చాలా ప్రయోజనకరమైన అనేక ఇతర ఖనిజాలు కూడా ఉన్నాయి. బొప్పాయిలోని పదార్థాలు అనేక వ్యాధులను కూడా నివారించగలవు. ఈ పండు ఆరోగ్యానికి ఎంత మేలు చేసేదైనప్పటికీ, కొన్ని రకాల వ్యాధులతో బాధపడేవారి ఆరోగ్యానికి బొప్పాయి అంత మంచిది కాదు. అంటే బొప్పాయి అందరికీ ఒకే విధంగా ప్రయోజనం చేకూర్చదన్నమాట. కాబట్టి బొప్పాయి తినేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. బొప్పాయిలో పీచుపదార్థం అధికంగా ఉండి, కేలరీలు తక్కువగా ఉంటాయి. ఇందులో విటమిన్లు ఎ, సి, అలాగే యాంటీఆక్సిడెంట్లు కూడా అధికంగా ఉంటాయి. అందువల్ల ఇది జీర్ణక్రియకు, రోగనిరోధక శక్తిని పెంచడానికి, చర్మ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. కాబట్టి ప్రతిరోజూ బొప్పాయి తినడం మంచిది. అయితే ఈ కింది ఆరోగ్య సమస్యలు ఉన్నవారు మాత్రం దీనిని తినకూడదు. పచ్చకామెర్లు, ఆస్తమా వంటి వ్యాధులతో బాధపడేవారు బొప్పాయిని తినేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. బొప్పాయిలో పాపైన్ వంటి ఎంజైమ్‌లు, బీటా-కెరోటిన్ వంటి సమ్మేళనాలు ఉంటాయి. కొన్ని సందర్భాల్లో కామెర్లు, ఆస్తమాతో బాధపడేవారిలో ఇవి పరిస్థితిని మరింత తీవ్రతరం చేయగలవు. మూత్రపిండాల వ్యాధులు ఉన్నవారు, మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడే ప్రమాదం ఉన్నవారు బొప్పాయిని పరిమిత పరిమాణంలో మాత్రమే తినాలి. ఎందుకంటే బొప్పాయిలో విటమిన్ సి ఉంటుంది. దీనిని శరీరంలో అధికంగా తీసుకుంటే అది ఆక్సలేట్‌గా మారే అవకాశం ఉంది. ఈ అదనపు ఆక్సలేట్ మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడటానికి దారితీస్తుంది. ఇప్పటికే ఉన్న రాళ్ల పరిమాణాన్ని పెంచే అవకాశం కూడా లేకపోలేదు. అధిక రక్తపోటు, గుండె సమస్యలు ఉన్నవారు బొప్పాయిని పరిమితంగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ వ్యాధులు ఉన్నవారు తీసుకునే కొన్ని మందులతో బొప్పాయిలోని ఎంజైమ్‌లు చర్య జరిపి దుష్ప్రభావాలను కలిగిస్తాయి. దీనివల్ల అలర్జీలు, దురద, శరీరంపై దద్దుర్లు వస్తాయి. అందుకే వైద్యుల సలహా మేరకు మాత్రమే బొప్పాయి తినాలి. అంతేకాకుండా ఏవైనా ఇతర దీర్ఘ కాలిక ఆరోగ్య సమస్యలు ఉన్నవారు కూడా తప్పకుండా వైద్యుడిని సంప్రదించిన తర్వాత మాత్రమే బొప్పాయి తీసుకోవాలి.

## మామిడి చేసే మేలు!




మామిడి పండ్లు రుచికే కాదు, ఆరోగ్యానికీ మేలు. ముఖ్యంగా పోస్ట్‌మెనోపాజ్ దశలో ఉన్న మహిళల్లో ఇది గుండె ఆరోగ్యానికి తోడ్పడుతుంది. యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియా చేపట్టిన ఓ అధ్యయనం ఈ అంశాలను వెల్లడించింది. 50–70 ఏళ్ల మధ్య వయసు మహిళలు ఒక కప్పున్నర మామిడి పండ్ల ముక్కలను రోజులో రెండు విడతలుగా తీసుకున్నప్పుడు వాళ్లలో బీపీ, కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గాయట. ఈ అధ్యయనంలో భాగంగా అధిక బరువున్న 24 మంది మహిళలకు రెండు వారాలపాటు మామిడి పండ్లను అందించారు. వాటిని తిన్న రెండు గంటల తర్వాత ఆ మహిళల్లో సిస్టోలిక్ బీపీ ఆరు పాయింట్లు తగ్గడం గమనించారు. రెండు వారాలకు వీళ్లలో చెడు కొలెస్ట్రాల్ 13 పాయింట్లు తగ్గడం విశేషం.

## ఆవలింతల ఎందుకు వస్తాయి..?

ఆవలింతలు అదుపు తప్పి వస్తున్నాయా? పగటిపూట కూడా రు విపరీతమైన ఆవలింతలతో ఇబ్బంది పడుతున్నారా? అయితే శరీరం ఒక ప్రమాదకరమైన అనారోగ్యానికి సంకేతం ఇస్తోంది. గుండె సమస్యల నుండి శ్వాసకోస ఇబ్బందుల వరకు.. తరచుగా వచ్చే ఆవలింతల వెనుక అనేక ఆరోగ్య కారణాలు దాగి ఉన్నాయి. ఆఫీసులో పని చేస్తున్నప్పుడో లేదా పుస్తకం పట్టుకుని చదువుతున్నప్పుడో అకస్మాత్తుగా ఆవలింతలు రావడం సహజం. అప్పుడు మనకు నిద్ర సరిపోలేదని అనుకుంటాము. కానీ ఈ ఆవలింతలు ప్రతిరోజూ, పదే పదే వస్తుంటే మాత్రం ఖచ్చితంగా అలర్ట్ అవ్వాల్సిందే. తరచుగా వచ్చే ఆవలింతలు కేవలం అలసటకు సంకేతం మాత్రమే కాదు, మన శరీరంలో ఏదో అసాధారణ స్థితి నెలకొందని చెప్పడానికి మెదడు చేసే ప్రయత్నం అని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మెదడు తన ఉష్ణోగ్రతను నియంత్రించుకోవడానికి, చురుకుదనాన్ని పెంచుకోవడానికి చేసే ఒక సహజమైన ప్రక్రియే ఆవలింత. నిద్రలో అవాంతరాలు: రాత్రిపూట స్మార్ట్‌ఫోన్ స్క్రీన్‌ల ముందు గడపడం వల్ల నిద్ర నాణ్యత తగ్గుతుంది. దీనివల్ల పగటిపూట మేల్కొని ఉండటానికి మెదడు పదే పదే ఆవలింతలను ఆశ్రయిస్తుంది. డీహైడ్రేషన్: శరీరంలో నీటి శాతం తగ్గినప్పుడు రక్త ప్రసరణ మందగిస్తుంది. ఫలితంగా త్వరగా అలసట చెంది ఆవలింతలు పెరుగుతాయి. మిర్రర్ న్యూరాన్లు: ఎదుటివారు ఆవలింత తీయడం చూసినప్పుడు మనకు కూడా రావడం అనేది మెదడులోని మిర్రర్ న్యూరాన్‌ల వల్ల కలిగే న్యాచురల్ ఇమిటేషన్. స్లీప్ అప్నియా: నిద్రలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలగడం వల్ల ఆక్సిజన్ స్థాయిలు తగ్గి, పగటిపూట విపరీతమైన అలసట కలుగుతుంది. ఆక్సిజన్ లోపం: ఊపిరితిత్తులు లేదా గుండె రక్తానికి తగినంత ఆక్సిజన్‌ను అందించలేనప్పుడు తరచుగా ఆవలింతలు వస్తాయి. నిద్ర రుగ్మతలు: నార్కోలెప్సీ మరియు దీర్ఘకాలిక నిద్రలేమి వంటి సమస్యల వల్ల శరీరం సరిగ్గా విశ్రాంతి తీసుకోలేకపోతుంది. ఒత్తిడితగ్గింపు: యోగా, ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతతను పొందాలి. ఆహార నియమాలు: నిద్రపోయే ముందు భారీ ఆహారం తీసుకోవడం మానుకోవాలి.



## యువతలో సడెన్ హార్ట్ ఎటాక్ దీని వెనుక అసలు కథ ఇదే!



ఇటీవలి కాలంలో గుండె సంబంధిత వ్యాధులు సర్వసాధారణం అయిపోయాయి. ముఖ్యంగా యువతలో కూడా గుండెపోటు కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. గుండె నరాలలో అడ్డంకి ఏర్పడటం గుండెపోటుకు ప్రధాన కారణం. గుండె ధమనులలో కొవ్వు లేదా కొలెస్ట్రాల్ పేరుకుపోవడం వల్ల రక్త ప్రసరణ సరిగ్గా జరగదు. దీనివల్ల గుండెకు తగినంత రక్తం, ఆక్సిజన్ అందక గుండెపోటు ప్రమాదం పెరుగుతుంది. వైద్య పరిభాషలో దీనిని కరోనరీ ఆర్టరీ వ్యాధి అంటారు. అయితే గుండెలో ఈ అడ్డంకి అకస్మాత్తుగా ఏర్పడదు. దీర్ఘకాలిక ఆహారపు అలవాట్లు, జీవనశైలి కారణంగా ఇది సంభవిస్తుంది. ఈ సమస్య లక్షణాలు చాలా కాలం క్రితమే కనిపించినప్పటికీ, చాలా మంది వాటిని నిర్లక్ష్యం చేయడం వల్ల ప్రమాదం అంచులకు చేరుతుంటారు. గుండెలో అడ్డంకికి అత్యంత సాధారణ లక్షణం ఛాతీ నొప్పి. ఛాతీలో ఒత్తిడి వంటి నొప్పి ఉంటుంది. ఈ నొప్పి కొన్నిసార్లు ఎడమ చేయి, భుజం, మెడ నుంచి దవడకు వ్యాపిస్తుంది. కొంతమంది మామూలుగా నడుస్తున్నప్పుడు కూడా ఆయాసపడుతుంటారు. గుండెకు సరైన మోతాదులో రక్తం అందకపోవడం వల్ల శరీరానికి ఆక్సిజన్ లోపిస్తుంది. దీనివల్ల స్వల్ప శారీరక శ్రమ చేసినా కూడా శ్వాస వేగంగా సాగుతుంది. అంతేకాకుండా అకస్మాత్తుగా తల తిరగడం, కారణం తెలియకుండా చెమట పట్టడం కూడా గుండె సంబంధిత సమస్యలకు సంకేతాలు కావచ్చు. వైద్యుల ప్రకారం కుటుంబంలో గుండె జబ్బులు, అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్ ఫ్యామిలీ హిస్టరీ ఉన్న వారికి ఈ ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఇవన్నీ కరోనరీ ఆర్టరీ వ్యాధి లక్షణాలు. ఎవరికి ఎక్కువ ప్రమాదం ఉందో తెలిసింది కాబట్టి గుండె సంబంధిత వ్యాధులకు దూరంగా ఉండటానికి ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, ప్రతిరోజూ వ్యాయామం చేయడం, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడం, రక్తపోటును అదుపులో ఉంచుకోవడం వంటివి అవసరమని వైద్యులు సూచిస్తున్నారు.


## ఎంత సహజమైనా... జాగ్రత్త!

ఖరీదైన బ్యూటీ చికిత్సల వెంట పరుగెత్తలేం అనుకున్నవాళ్లు చూసేది వంటగది వైపే! అక్కడ వాడే ఎన్నో పదార్థాలు మన సౌందర్యాన్నీ పెంచేస్తాయి మరి. వంటింటి చిట్కాలు వాడటం మేలే కానీ... సరిగానే వాడుతున్నారా? కొన్ని మేలు చేయకపోగా హానికరం కావొచ్చు మరి. నిమ్మ: విటమిన్ సి చర్మానికి మేలు చేస్తుందని చాలా మంది నిమ్మని ముఖానికి రాస్తుంటారు. కానీ నిమ్మచెక్కను ముఖానికి రుద్దడం, నేరుగా నిమ్మరసాన్ని రాయడం మంచిది కాదు. చర్మం పొడిబారి... దద్దుర్లు, దురదలకు కారణమవుతుంది. కొన్ని చుక్కలు అది కూడా దేనిలోనైనా కలిపి రాసుకుంటేనే ప్రయోజనం. దాల్చిన చెక్క: దీన్ని ఎక్కువగా మొటిమలు ఉన్నవాళ్లు రాస్తుంటారు. ఇదీ దద్దుర్లు, రంగు మారిపోవడం కొన్ని సార్లు చర్మం మీద మంటకీ కారణమవుతుంది. ఈ నూనె కూడా కొందరిలో ఇరిటేషన్‌కి దారితీస్తుంది. కాబట్టి, గమనించుకోవాల్సిందే. చక్కెర: స్క్రబింగ్‌లో దీన్ని నిమ్మకాయ లేదా టొమాటో మీద వేసి, కాఫీలో కలిపి రాస్తుంటారు. మృతకణాలు పోగొట్టడానికి మేలు చేస్తుందన్న మాట వాస్తవమే కానీ... గాయాలకీ దారితీస్తుంది. చర్మం ఎంత సున్నితంగా ఉంటుందో తెలిసిందేగా! పంచదార గుళికల ఉపరితం కాస్త పదునుగా ఉంటుంది. ఇవి చర్మ కణజాలానికి గాయం చేస్తాయి. యాక్నే, మొటిమలు ఉంటే సమస్యని మరింత జఠిలం చేస్తాయి. కాబట్టి, కరిగే దాకా ఆగడం మేలు. లేదంటే ప్రత్యామ్నాయాలనైనా ఎంచుకోవాలి. యాపిల్ సిడార్ వినెగర్: దీనిలో ఆమ్ల గుణాలెక్కువ. ఇదీ చర్మంపై కాలిన గాయాలకు కారణమవగలదు. కాబట్టి, నేరుగా వాడొద్దు. నీటిలో గానీ వేరే ఇతర వాటిలోగానీ కలిపి రాయాలి. సున్నిత చర్మతత్వం ఉన్నవాళ్లు వీలైనంత దూరంగా ఉంటే మంచిది.



## కళ్ల కింద నల్లటి వలయాలు తగ్గాలంటే..!

కళ్ల కింద నల్లటి వలయాలు.. చాలామందిని ఇబ్బంది పెట్టే సమస్యల్లో ఇది కూడా ఒకటి. అయితే ఈ సమస్యను కొన్ని సహజ చిట్కాలతోనే తగ్గించుకోవచ్చంటున్నారు నిపుణులు. నిద్రలేమి, అలసట, కంప్యూటర్/మొబైల్ ఎక్కువసేపు వాడడం, ఒత్తిడి, పోషకాహార లేమి, తగినన్ని నీళ్లు తీసుకోకపోవడం.. ఇలా చాలా అంశాలు కళ్ల కింద నల్లటి వలయాలకు కారణం కావచ్చంటున్నారు నిపుణులు. అదేవిధంగా హైపర్ పిగ్మెంటేషన్, వృద్ధాప్యం, ఎగ్జిమా, కొన్ని రకాల ఎలర్జీలు, ఎండలో ఎక్కువగా తిరగడం, మేకప్ పూర్తిగా తొలగించుకోకపోవడం.. వంటి కారణాల వల్ల కూడా కళ్ల కింద చర్మం నల్లగా మారే అవకాశం ఉందంటున్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవాలి. పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవడంతో పాటు రోజూ కనీసం 7–8 గంటలు కంటి నిండా నిద్ర పోవాలి. ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్ల వినియోగాన్ని తగ్గించాలి. ఒత్తిడి, ఆందోళనల నుంచి దూరంగా ఉండాలి. ఇందుకోసం ధ్యానం, యోగా.. మొదలైన వాటిని జీవనశైలిలో భాగం చేసుకోవాలి అని సూచిస్తున్నారు నిపుణులు. ముఖాన్ని శుభ్రపరచుకోవడం కోసం చర్మతత్వానికి సరిపడే సబ్బులను ఎంచుకోవాలి. మధ్యాహ్నం లంచ్ తర్వాత చాలామందికి నిద్ర ముంచుకొస్తుంటుంది. అయితే పని వల్లో, ఇతర కారణాల వల్లో ఆ నిద్రను ఆపుకోవడం.. లేదా కాఫీ, టీలతో నిద్రను దూరం చేసుకోవడం చేస్తుంటారు. ఇది మంచిది కాదు. ఇంట్లో ఉండే వారు వీలైతే మధ్యాహ్న సమయంలో కాసేపు కునుకు తీయడం వల్ల కంటి ఆరోగ్యం మెరుగవుతుంది. అయితే అది అరగంటకు మించకుండా చూసుకోవడం మంచిది. అర్ధరాత్రి వరకు మేల్కొనకుండా సాధ్యమైనంత త్వరగా నిద్రకు ఉపక్రమించాలి. దీనివల్ల కళ్లపై ఒత్తిడి తగ్గుతుంది. ఒత్తిడి, ఆందోళన కలిగించే వ్యక్తులు, వస్తువులకు పూర్తి దూరంగా ఉండాలి. ముఖ్యంగా ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్ల వాడకాన్ని తగ్గించాలి. అయితే కళ్ల కింద నల్లటి వలయాలు ఒక్కోసారి అంతర్లీనంగా ఉండే కొన్ని ఆరోగ్య సమస్యలకు కూడా సంకేతం కావచ్చు. అందువల్ల పైన చెప్పిన చిట్కాలు పాటించినా సమస్య తగ్గకపోతే.. అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్య నిపుణులను సంప్రదించాలి.



## కొబ్బరి నీళ్లు ఎప్పుడు తాగితే మంచిది..?

కొబ్బరి నీళ్లు కేవలం రుచికరమైన పానీయం మాత్రమే కాదు.. అవి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటాయి. రోజూ కొబ్బరి నీళ్లు తాగడం వల్ల శరీరం శక్తివంతంగా, తాజాగా ఉంటుంది. కొబ్బరి నీళ్లలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు, మెగ్నీషియం, సోడియం, పొటాషియం, కాల్షియం వంటి ఎలక్ట్రోలైట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచి, క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తాయి. కొబ్బరి నీళ్లు సహజంగా లభించే ఒక శ్రేష్టమైన పానీయం. వీటిని సూపర్‌ఫుడ్ అని కూడా పిలుస్తారు. కొబ్బరి నీళ్లు రోజూ తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని పేర్కొంటున్నారు ఆరోగ్య నిపుణులు.. కొబ్బరి నీళ్లతో పాటు లేత కొబ్బరిని కూడా తినడం వల్ల రుచికి రుచి, ఆరోగ్యానికి ఆరోగ్యం లభిస్తాయంటున్నారు.. ఎలక్ట్రోలైట్లతో నిండిన ఈ పానీయం ఎన్నో రకాల అనారోగ్యాల నుంచి మనల్ని రక్షిస్తుందని.. అందుకే.. ప్రతి ఒక్కరూ కొబ్బరి నీటిని తాగవచ్చని సూచిస్తున్నారు. అయితే.. కొబ్బరి నీళ్లు తాగడానికి ఉత్తమ సమయం ఉదయం ఖాళీ కడుపుతో (ఉదయం పూట) తాగడం.. ఇలా నిత్యం తాగడం వల్ల.. ఇది శరీరంలోని మలినాలను తొలగించి, రోజంతా ఎనర్జీని ఇస్తుంది. అయితే, మధ్యాహ్నం, వ్యాయామం తర్వాత లేదా దాహం వేసినప్పుడు కూడా తీసుకోవచ్చు.. ఇది శరీరానికి ఎలక్ట్రోలైట్స్.. తక్షణ శక్తిని అందిస్తుందని పేర్కొంటున్నారు. రోగనిరోధక శక్తి పెరుగుదల: కొబ్బరి నీళ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచి, ఇన్ఫెక్షన్ల బారి నుండి శరీరాన్ని కాపాడుతుంది. క్యాన్సర్ ప్రమాదం తగ్గింపు: అధ్యయనాల ప్రకారం, కొబ్బరి నీళ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయి. చర్మ ఆరోగ్యం మెరుగుదల: యాంటీ ఆక్సిడెంట్లు సూర్య కిరణాల నుండి చర్మాన్ని రక్షించి, చర్మాన్ని హైడ్రేటెడ్‌గా, ఆరోగ్యంగా ఉంచుతాయి. జీర్ణక్రియ సహాయం: కొబ్బరి నీళ్లు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. మలబద్ధకం వంటి సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయి. జీర్ణ సంబంధిత సమస్యలున్నప్పుడు ఆయుర్వేద వైద్య సలహా తీసుకోవడం మంచిది. బరువు తగ్గడంలో తోడ్పాటు: కొబ్బరి నీళ్లలో తక్కువ కేలరీలు, అధిక ఫైబర్ ఉంటాయి. ఇది కడుపు నిండిన భావన కలిగించి, ఆహారం తక్కువగా తినడానికి దోహదపడుతుంది. ఉదయం తాగడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయి. రక్తంలో చక్కెర నియంత్రణ: ఇందులో ఉండే మెగ్నీషియం రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. గుండె ఆరోగ్యం: కొబ్బరి నీళ్లలోని మెగ్నీషియం రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంతో పాటు గుండె ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది. గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. జుట్టు ఆరోగ్యం మెరుగుదల: కొబ్బరి నీళ్లు జుట్టును హైడ్రేటెడ్‌గా ఉంచి, దాని ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. కండరాల ఆరోగ్యం: ఎలక్ట్రోలైట్లు కండరాల రికవరీకి సహాయపడతాయి. వ్యాయామం తర్వాత అలసిన కండరాలకు శక్తినిచ్చి, తాజాగా ఉంచుతాయి. రక్తపోటు నియంత్రణ: కొబ్బరి నీళ్లలో ఉండే మెగ్నీషియం అధిక రక్తపోటును తగ్గించి, దానిని నియంత్రణలో ఉంచుతుంది. శరీర హైడ్రేషన్: శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడంలో కొబ్బరి నీళ్లు అద్భుతంగా పనిచేస్తాయి. వేసవిలో శరీరానికి హాని చేసే కూల్ డ్రింక్స్‌కు బదులుగా కొబ్బరి నీళ్లను ఎంచుకోవడం ఉత్తమం. ఎలక్ట్రోలైట్ సమతుల్యత: కొబ్బరి నీళ్లలో సోడియం, పొటాషియం, మెగ్నీషియం, కాల్షియం వంటి ఎలక్ట్రోలైట్లు ఉంటాయి. ఇవి శరీరంలో ఎలక్ట్రోలైట్ అసమతుల్యతను సరిదిద్ది, కండరాలకు, శరీర ఆరోగ్యానికి మేలు చేస్తాయి. వృద్ధులలో ఈ సమస్య తరచుగా కనిపిస్తుంది.. అలాంటి వారికి కొబ్బరి నీళ్లు అమృతంలా పని చేస్తాయి.



## వేసవి తాపాన్ని జయించే లిక్విడ్

వేసవి కాలం రాకతో అందరిలోనూ దాహం పెరిగిపోతుంది, దీనివల్ల ప్రజలు ఐస్ క్రీమ్ పార్లర్లు లేదా జ్యూస్ షాపుల వైపు పరుగులు తీస్తుంటారు. ప్రకృతి ప్రసాదించిన కొబ్బరినీళ్లు శరీరానికి ఎంతో మేలు చేస్తాయనేది నిజమే అయినప్పటికీ, ప్రస్తుతం వాటి ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయాయి. ఒక్కో కొబ్బరిబొండం ధర 50 రూపాయల నుండి ప్రారంభమై కొన్ని ప్రాంతాల్లో 80 రూపాయల వరకు పలుకుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రతిరోజూ కొబ్బరినీళ్లు కొనడం అందరికీ సాధ్యం కాకపోవచ్చు. అయితే శరీర వేడిని తగ్గించడానికి, దాహాన్ని తీర్చుకోవడానికి అతి తక్కువ ఖర్చుతో కూడిన ఒక అద్భుతమైన పానీయం మనందరికీ అందుబాటులో ఉంది. అదే చల్లని మజ్జిగ. మనం రోజూ ఇంట్లో పాలు వాడుతుంటాం, ఆ పాలతో తోడుపెట్టిన పెరుగు నుండి సులభంగా మజ్జిగను తయారు చేసుకోవచ్చు. పెరుగులో తగినంత నీరు కలిపి చిలికితే ఆరోగ్యకరమైన మజ్జిగ సిద్ధమవుతుంది. ఇందులో కొవ్వు శాతం చాలా తక్కువగా ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారికి ఇది ఒక అద్భుతమైన ఎంపిక. మజ్జిగలో క్యాల్షియం, పొటాషియం, ప్రోటీన్, విటమిన్లు, మెగ్నీషియం మరియు రకరకాల ఎంజైములు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో అనవసరమైన కొవ్వు పేరుకు పోకుండా చూస్తూనే మనకు అవసరమైన శక్తిని అందిస్తాయి. ఇది తాగినప్పుడు కడుపు నిండుగా ఉన్నట్లు అనిపిస్తుంది కాబట్టి అనారోగ్యకరమైన ఆహారం తీసుకోవాలనే కోరికను తగ్గిస్తుంది. మజ్జిగ తయారీలో అల్లం, మిరియాలు, జీలకర్ర వంటి మసాలా దినుసులను ఉపయోగించడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. భారీ భోజనం చేసిన తర్వాత ఒక గ్లాసు మజ్జిగ తాగడం వల్ల ప్రేగులలో పేరుకుపోయిన కొవ్వు వ్యర్థాలను తొలగించి జీర్ణవ్యవస్థను శుభ్రపరుస్తుంది. అజీర్ణం, శరీరంలో అధిక వేడి వంటి సమస్యలకు ఇది ఒక ఉత్తమ సహజ ఔషధం. మజ్జిగలో ఉండే ప్రోబయోటిక్ సూక్ష్మజీవులు కడుపు సంబంధిత వ్యాధులకు కారణమయ్యే క్రిముల పెరుగుదలను అడ్డుకుంటాయి. ముఖ్యంగా ఎండల వల్ల విపరీతంగా పట్టే చెమటను నియంత్రించి, శరీరానికి తక్షణ ఉపశమనాన్ని కలిగిస్తుంది. మజ్జిగలో 90 శాతం కంటే ఎక్కువ నీరు ఉంటుంది, దీనితో పాటు ఎలక్ట్రోలైట్స్ పుష్కలంగా లభిస్తాయి. ఇందులో ఉండే పొటాషియం శరీరంలోని ద్రవాల సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుంది. వేసవిలో శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించడానికి ఇది ఒక థెరప్యూటిక్ డ్రింక్ లా పనిచేస్తుంది. ముఖ్యంగా మెనోపాజ్ దశలో ఉన్న మహిళలకు శరీర వేడి సమస్య ఎక్కువగా ఉంటుంది, అటువంటి వారికి ఒక గ్లాసు మజ్జిగ తాగడం వల్ల మంచి ఉపశమనం లభిస్తుంది. ఉప్పు, జీలకర్ర, పుదీనా కలిపిన మజ్జిగ శరీరానికి అమృతంతో సమానం. కాబట్టి ఈ వేసవిలో ఖరీదైన పానీయాల కంటే తక్కువ ధరలో లభించే ఈ ఆరోగ్యకరమైన మజ్జిగను దైనందిన జీవితంలో భాగం చేసుకోండి. చల్లని మజ్జిగను సేవించండి, ఆరోగ్యంగా ఉండండి.




## చిన్న తప్పుతో హెల్త్ ప్రాబ్లమ్స్!



వంటనూనె కొనేటప్పుడు చాలామంది ప్యాకెట్ లేదా ప్లాస్టిక్ బాటిల్ ఎంచుకుంటారు. అయితే ఆరోగ్యానికి ఏది సురక్షితం అనే విషయంలో 99 శాతం మంది తెలియక తప్పులు చేస్తుంటారు. మనం వాడే నూనె నాణ్యత ఎంత ముఖ్యమో, దానిని ఏ విధంగా నిల్వ చేస్తున్నాం అనేది కూడా మన ఆరోగ్యంపై అంతే ప్రభావం చూపుతుంది. చాలామంది తక్కువ ధరకే లభిస్తాయని ప్లాస్టిక్ పౌచ్‌లు కొంటుంటారు. కానీ ఈ ప్లాస్టిక్ పొరలు ఎండ తగిలినప్పుడు లేదా వేడి వాతావరణంలో ఉన్నప్పుడు కరిగి నూనెలో కలిసే ప్రమాదం ఉంది. ప్లాస్టిక్ బాటిళ్లు కొంచెం గట్టిగా ఉన్నా, వాటిలో ఎక్కువ కాలం నూనె నిల్వ ఉండటం వల్ల ప్లాస్టిక్‌లోని రసాయనాలు నూనెలోకి చేరే అవకాశం ఉందని పరిశోధనలు చెబుతున్నాయి. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ సైన్సెస్ నిర్వహించిన అధ్యయనం ప్రకారం, ప్లాస్టిక్ పౌచ్‌లలో నిల్వ ఉంచే నూనెలు ఆరోగ్యానికి అత్యంత ప్రమాదకరంగా మారుతున్నాయి. ప్లాస్టిక్ తయారీలో ఉపయోగించే బిస్ఫినాల్-ఎ, థాలేట్స్ వంటి రసాయనాలు నూనెలో సులభంగా కరిగిపోతాయి. ఇవి మన శరీరంలో చేరి హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీస్తాయి. ముఖ్యంగా ఎండాకాలంలో ప్లాస్టిక్ నుండి వెలువడే విషపూరిత అణువులు వేగంగా నూనెలోకి విడుదలవుతాయి. దీని వల్ల థైరాయిడ్ సమస్యలు, సంతానలేమి వంటి దీర్ఘకాలిక ఆరోగ్య ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. చాలా మంది నూనె ప్యాకెట్లను కొనుగోలు చేసిన తర్వాత, వాటిని తిరిగి ప్లాస్టిక్ డబ్బాల్లోనే నిల్వ చేస్తారు. నూనెకు వెలుతురు, వేడి తగిలినప్పుడు అది వేగంగా ఆక్సీకరణకు గురవుతుంది. ఈ ప్రక్రియ వల్ల నూనెలోని పోషకాలు నశించి, అది విషపూరితంగా మారుతుంది. ప్లాస్టిక్ డబ్బాల్లో నూనెను నిల్వ ఉంచడం వల్ల అందులోని కెమికల్స్ నూనెతో చర్య జరిపి దాని గుణాన్ని మార్చేస్తాయి. మనం ఆరోగ్యకరమైన నూనెను వాడుతున్నామని అనుకున్నా, నిల్వ చేసే విధానం సరిగ్గా లేకపోతే అది శరీరానికి మేలు చేయకపోగా కీడు చేస్తుంది. వంటనూనెను ఎల్లప్పుడూ గాజు సీసాలు లేదా స్టీల్ కంటైనర్లలో మాత్రమే నిల్వ చేయాలి. నూనె ప్యాకెట్లు లేదా ప్లాస్టిక్ బాటిళ్లు కొన్న వెంటనే, వాటిని స్టీల్ లేదా గాజు పాత్రల్లోకి మార్చుకోవడం ఉత్తమమైన పద్ధతి. నూనె డబ్బాలను ఎప్పుడూ చల్లని, చీకటిగా ఉండే ప్రదేశంలో ఉంచాలి. స్టవ్ పక్కన లేదా ఎండ తగిలే చోట నూనెను ఉంచకూడదు.

## వరల్డ్ టాప్ 2 లో ఎయిర్‌టెల్




భారతదేశానికి చెందిన ప్రముఖ టెలికాం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ అంతర్జాతీయ స్థాయిలో సరికొత్త రికార్డును సృష్టించింది. ప్రపంచవ్యాప్తంగా 65 కోట్లకు పైగా చందాదార్లను కలిగి ఉండటం ద్వారా, చైనా మొబైల్ తర్వాత ప్రపంచంలోనే రెండో అతిపెద్ద టెలికాం సేవల సంస్థగా ఎయిర్‌టెల్ అవతరించింది. జీఎస్ఎంఏ ఇంటెలిజెన్స్ నివేదిక ప్రకారం.. వినియోగదారుల సంఖ్య పరంగా ఎయిర్‌టెల్ ఈ ఘనతను సాధించినట్లు సంస్థ అధికారికంగా ప్రకటించింది. భారత్‌తో పాటు ఆఫ్రికాలోని 14 దేశాలలో విస్తరించిన ఎయిర్‌టెల్ నెట్‌వర్క్, తన వినియోగదారుల సంఖ్యను గణనీయంగా పెంచుకుంటూ అంతర్జాతీయ వేదికపై పటిష్టమైన స్థానాన్ని సంపాదించుకుంది.




# తీవ్ర ఆర్థిక సంక్షోభ దిశగా భారత్

దేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభం దిశగా సాగుతోందని మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు (సిఇఎ) అరవింద్ సుబ్రమణ్యం హెచ్చరించారు. యుద్ధం వల్ల చమురు, గ్యాస్, ఎరువుల సరఫరా నిలిచిపోవడం వల్ల దేశ జిడిపి 1 శాతం పైగా పడిపోయి, ద్రవ్యోల్బణం 1.5 శాతం పెరిగే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు ఎంతో కాలం కొనసాగవని, చివరికి సామాన్యుడిపై ధరల భారం పడక తప్పదని విశ్లేషించారు. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధం కారణంగా భారత ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన స్తబ్దత ముప్పులో ఉందన్నారు. అంతర్జాతీయంగా చమురు, సహజ వాయువు, ఎరువుల సరఫరా గొలుసు దెబ్బతినడం వల్ల భారత్ వంటి దిగుమతులపై ఆధారపడిన భారత్ రెండంచుల నష్టాన్ని చవి చూడబోతోందని ఆయన హెచ్చరించారు. ఇప్పటికే గ్యాస్ కొరత కారణంగా



రెస్టారెంట్లు మూతపడటం వంటి ఆర్థిక మందగమన సంకేతాలు క్షేత్రస్థాయిలో కనిపిస్తున్నాయని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత సంక్షోభం నుండి గట్టెక్కడానికి ప్రభుత్వం ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ వీలైతే అక్కడ నుండి తక్కువ ధరకే ఇంధన, ఎరువుల నిల్వలను యుద్ధ ప్రాతిపదికన సేకరించాలని సుబ్రమణ్యం సూచించారు. దేశీయంగా ఎక్సైజ్ సుంకాల కోత, సబ్సిడీల వంటి చర్యలు స్వల్పకాలిక ఉపశమనాన్ని ఇచ్చినప్పటికీ సుదీర్ఘ కాలం పాటు పెరిగిన భారాలను ప్రభుత్వం మోయలేదన్నారు. చివరికి ఆ భారం సామాన్య వినియోగదారుడిపైనే వేయనుందన్నారు.భారీ అప్పుల కారణంగా ప్రభుత్వాలకు ఆర్థికంగా నిలదొక్కుకునే శక్తి తగ్గిపోవడం ఈ సంక్షోభంలో మరో ప్రధాన ప్రతికూలాంశమన్నారు. రూపాయి విలువ పతనం కావడం కూడా విధానకర్తలకు ఒక గట్టి సవాలేనని అన్నారు. ఈ సంక్షోభాన్ని ఒక గుణపాఠంగా భావించి, భవిష్యత్తులో శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలన్నారు.. దీర్ఘకాలిక వ్యూహంతో పునరుత్పాదక ఇంధన వనరులను పెంచుకోవడం, కీలక వస్తువుల వ్యూహాత్మక నిల్వలను నిర్మించుకోవడం ద్వారానే ఇలాంటి ప్రపంచ స్థాయి దిగ్బంధనాలను ఎదుర్కోగలమన్నారు.

# కఠిన వ్యాపార వాతావరణానికి సిద్ధంగా ఉండండి

పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం ఫలితంగా సరఫరా వ్యవస్థలకు అంతరాయం ఏర్పడుతుండటంతో, మరింత కఠిన వ్యాపార వాతావరణానికి సిద్ధంగా ఉండాలని టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ గ్రూప్ కంపెనీలకు చెందిన 30 మందికి పైగా సీఈఓలు, మేనేజింగ్ డైరెక్టర్లకు సూచించారు. యుద్ధ పరిణామాలపై గురువారం జరిగిన సమీక్షా సమావేశంలో.. టాటా గ్రూప్‌నకు సంబంధించి వోల్టాస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), ఇండియన్ హోటల్స్ కంపెనీ లిమిటెడ్, టన్ కంపెనీలకు చెందిన 10,000 మందికి పైగా టాటా ఉద్యోగులు పశ్చిమాసియా ప్రాంతంలో ఉన్నారని చంద్రశేఖరన్ తెలిపారు. వారిని తిరిగి రప్పించే చర్యలను వివరించారని ఒక అధికారి తెలిపారు. సరఫరా అంతరాయాలు, పెరుగుతున్న వస్తువుల ధరల వల్ల గిరాకీ తగ్గుతుందని, నిర్వహణ ఖర్చులు పెరిగి కంపెనీల లాభాలపై ఒత్తిడి పడుతుందని ఆయన వివరించారు. నగదు జాగ్రత్తగా నిర్వహించాలి: కంపెనీలు సామర్థ్యం కంటే తక్కువ ఉత్పత్తికి పరిమితం కావాలని, మౌలిక సదుపాయాల రంగం లేదా నిర్మాణ రంగ కంపెనీల పనులు పూర్తవ్వడంలో ఆలస్యం చోటుచేసుకోవచ్చని తెలిపారు. గిరాకీ మందగించడం, సరఫరా అంతరాయాల వల్ల ప్రాజెక్టులు ఆలస్యం కావడం, చమురు ధరల పెరుగుదల – కొరత, కరెన్సీ విలువ హెచ్చుతగ్గులు, లాజిస్టిక్స్ వ్యయాలు



వంటి వాటితో కఠిన వ్యాపార వాతావరణానికి సిద్ధంగా ఉండాలని ఛైర్మన్ వారికి సూచించారు. నగదును జాగ్రత్తగా నిర్వహించడంపై దృష్టి సారించాలనీ వివరించారు. ప్రాజెక్టుల ప్రారంభ సమయాన్ని జాగ్రత్తగా ఎంచుకోవాలని, అవసరమైతే కాలపట్టికలను పునఃసమీక్షించుకోవాలని సలహా ఇచ్చారు.

# యుద్ధ సెగతో తయారీ రంగం కుదేలు



అమెరికా యుద్ధోన్మాదం, అధిక టారిఫ్‌లు భారత తయారీ రంగాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోన్నాయి. ముఖ్యంగా పశ్చిమాసియాలో నెలకొన్న ఘర్షణతో మార్చి నెలలో తయారీ రంగ పీఎంఐ 53.9కి పడిపోయిందని హెచ్‌ఎస్‌బీసీ ఇండియా మ్యాన్యుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) వెల్లడించింది. ఇంతక్రితం నెల ఫిబ్రవరిలో 56.9 పాయింట్లుగా ఉండగా.. మార్చి నాటికి అది ఒక్కసారిగా 53.9 పాయింట్లకు తగ్గి నాలుగేండ్ల కనిష్టానికి దిగజారింది. జూన్ 2022 తర్వాత నమోదైన అత్యల్ప ఉత్పత్తి ఇదే కావడం గమనార్హం. సాధారణంగా 50 పైన పీఎంఐ ఉంటే మెరుగ్గా.. దిగువన ఉంటే ప్రతికూలంగా ఉన్నట్లుగా గుర్తిస్తారు. గత రెండేండ్లలో ఎప్పుడూ లేనంతగా కొత్త ఆర్డర్లు, ఉత్పత్తి సామర్థ్యం మందగించాయి. ముడిసరుకుల ధరలు మూడున్నరేండ్ల గరిష్టానికి చేరడం తయారీదారుల నడ్డి విరుస్తోంది. ఖర్చులు పెరిగినా పోటీ తట్టుకోవడానికి విక్రయ ధరలను పెంచలేకపోవడం వల్ల కంపెనీల లాభాలు ఆవిరవుతున్నాయి. డిమాండ్ తగ్గడం, ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితి భారత పారిశ్రామిక వేగాన్ని ప్రశ్నార్థకం చేస్తున్నాయని హెచ్‌ఎస్‌బీసీ విశ్లేషించింది. ''తీవ్రమైన మార్కెట్ పోటీ, ముడిసరుకుల ధరల పెరుగుదల, అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితి వల్ల కొత్త ఆర్డర్ల ప్రవాహం నెమ్మదించింది. ముఖ్యంగా అల్యూమినియం, రసాయనాలు, ఇంధనం, జనపనార, తోలు, వస్త్రాలు, ఉక్కు వంటి వస్తువుల ధరలు గత మూడేండ్లలో ఎన్నడూ లేనంతగా పెరిగాయి. దీనివల్ల తయారీదారులపై పెట్టుబడి భారం పెరిగినప్పటికీ, వినియోగదారులకు చేరే తుది వస్తువుల ధరలను కంపెనీలు ప్రస్తుతానికి నియంత్రణలోనే ఉంచుతున్నాయి.'' అని హెచ్‌ఎస్‌బీసీ చీఫ్ ఇండియా ఎకనామిస్ట్ ప్రాంజల్ భండారీ పేర్కొన్నారు. కొత్త ఆర్డర్లు, ఉత్పత్తి సామర్థ్యం 2022 మధ్య కాలం తర్వాత ఎన్నడూ లేనంత నిదానంగా నమోదవ్వడం ఆందోళన కలిగిస్తోంది. యుద్ధం కారణంగా అంతర్జాతీయ సరఫరా గొలుసు దెబ్బతినడం, మార్కెట్ పరిస్థితులు సవాలుగా మారడంతో డిమాండ్ భారీగా మందగించింది. ముడి ఖర్చులు ఆకాశాన్నంటుతున్నప్పటికీ, ఉన్న కస్టమర్లను కాపాడుకోవడానికి, కొత్త వారిని ఆకర్షించడానికి కంపెనీలు తమ విక్రయ ధరలను పెంచలేకపోతున్నాయి. దీనివల్ల తయారీదారుల లాభాల మార్జిన్లు కుంచించుకుపోతున్నాయి. అంతిమంగా పెరుగుతున్న వ్యయాలు, తగ్గుతున్న డిమాండ్‌తో భారత పరిశ్రమలు కుదేలవుతున్నాయి.

## పెట్రోకెమికల్‌పై కస్టమ్స్ సుంకాన్ని

### మినహాయించిన ప్రభుత్వం

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, ప్రపంచ సరఫరాలో అంతరాయాలు పెరుగుతున్న నేపథ్యంలో పెట్రోకెమికల్ ముడిసరుకులపై ఆధారపడిన పరిశ్రమలకు కేంద్రం తాత్కాలిక ఉపశమన చర్యలను ప్రకటించింది. ప్రధానంగా వీటి ధరలు పెరిగితే, ప్రజలపై భారం పడుతుందనే కారణంతో ప్రభుత్వం పరిష్కార నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా కీలక పెట్రోకెమికల్ ఉత్పత్తులపై దిగుమతి సుంకాన్ని మినహాయించింది. ఈ నిర్ణయం గురువారం(ఏప్రిల్ 2) నుంచి జూన్ 30 వరకు పరిమిత కాలం వర్తిస్తుందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. దేశీయంగా పరిశ్రమలకు ముఖ్యమైన పెట్రోకెమికల్ ముడిసరుకు లభ్యత, సరఫరాకు ఇబ్బందుల్లేకుండా, వీటిపై ఆధారపడిన రంగాలకు ఖర్చుల భారం తగ్గించాలని భావిస్తున్నాం. దీనివల్ల కీలక ఫార్మా, ఆటో, టెక్స్‌టైల్స్, ప్లాస్టిక్, కెమికల్ రంగాలకు ప్రయోజనం కలుగుతుంది.

# మహీంద్రా కీలక నిర్ణయం.. ఏప్రిల్ 6 నుంచి పెరగనున్న ధరలు

మహీంద్రా వాహనాలు కొనుగోలు చేసే వారికి ఊహించని షాక్ తగిలింది. తమ వాహనాల ధరలను పెంచబోతున్నట్లు అధికారికంగా ప్రకటించింది మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీ. మార్కెట్లో మహీంద్రా కంపెనీకి మంచి డిమాండ్ ఉన్న సంగతి తెలిసిందే. చాలా మంది, మిగతా కంపెనీలను కాదని ఈ మహేంద్ర కంపెనీకి సంబంధించిన కార్లు, ఇతర వాహనాలు కొనుగోలు చేస్తూ ఇంట్రెస్ట్ చూపిస్తారు. అయితే అలాంటి వారికి షాక్ ఇస్తూ, తాజాగా ఈ మహేంద్రాకు సంబంధించిన వాహనాల ధరలను అమాంతం పెంచేందుకు నిర్ణయం తీసుకున్నారు. నాన్-ఎలక్ట్రిక్‌లు, వాణిజ్య వాహనాల ధరలను గరిష్టంగా 2.5% పెంచబోతున్నట్లు కంపెనీ స్పష్టం చేసింది. ఇక మొత్తం వాహన పోర్టు పోలియోపై ధరల పెంపు సగటున 1.6 పర్సెంటేజ్ ఉంటుందని వివరణ ఇచ్చింది మహేంద్రా కంపెనీ. ఇక పెంచిన ధరలు ఏప్రిల్ ఆరవ తేదీ నుంచి అమలులోకి వస్తాయని కీలక ప్రకటన చేసింది. పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాల భారాన్ని తగ్గించుకునేందుకుగాను తమ వాహనాల ధరలను పెంచుతున్నట్లు స్పష్టం చేసింది. ఇక ఈ పెంపుదల నేపథ్యంలో మోడల్, వేరియంట్ ను బట్టి వాహనాల ధర వేరువేరుగా పెరుగుతుంది. అటు ఇటీవల మహేంద్ర నుంచి వచ్చిన వెహికల్ ధర మాత్రం మొదటి నలభై వేల మంది కొనుగోలుదారులకు మాత్రమే పెరగబోదని స్పష్టం చేసింది. ఆ తర్వాత కొనుగోలు చేసిన వాళ్లందరికీ పెంపుదల వర్తిస్తుందని మహీంద్రా వెల్లడించింది.







## కోల్‌కతా చిత్తు.. బోణీ కొట్టిన హైదరాబాద్



ఐపీఎల్ 2026 సీజన్‌లో హైదరాబాద్ సన్‌రైజర్స్ తొలి విజయం దక్కించుకుంది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ మైదానంలో కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో ఆరెంజ్ ఆర్మీ నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లు కోల్పోయి 226 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం 227 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కోల్‌కతా.. 15.6 ఓవర్లలోనే అన్ని వికెట్లు కోల్పోయి 161 పరుగులు మాత్రమే చేసింది. దీంతో 65 పరుగుల తేడాతో హైదరాబాద్ ఘన విజయం సాధించడమే కాకుండా ఈ సీజన్ లో పాయింట్ల టేబుల్ లో ఖాతా తెరిచింది. కోల్‌కతా బ్యాటర్స్ లో రఘువంశీ (52), రింకు సింగ్ (35), ఫిన్ అలెన్ (28) పరుగులు చేయగా.. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. హైదరాబాద్ బౌలర్లలో ఉనద్కత్ 3, నితీశ్ 2, ఎషాన్ మలింగ, 2, హర్ష్ దూబె ఒక వికెట్ తీశారు.

# లక్నో తడబ్యాటు ఢిల్లీ క్యాపిటల్స్ ఘన విజయం



లక్నో సూపర్‌జెయింట్స్(ఎల్‌ఎస్‌జి) తొలి మ్యాచ్‌లోనే తడబడింది. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లు ఎన్గిడి(3/27), నటరాజన్(3/29)కి తోడు కుల్దీప్ యాదవ్(2/31) కట్టడిగా బౌల్ చేశారు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన లక్నో జట్టు 18.4ఓవర్లలో 141 పరుగులకే ఆలౌంది. ఛేదన లో భాగంగా ఢిల్లీ జట్టు 26పరుగులకే 4వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడ్డా.. ఇంపాక్ట్ ప్లేయర్ గా బ్యాటింగ్‌కు దిగిన సర్ రిజ్వీ అర్ధసెంచరీకి తోడు స్టబ్స్ మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించారు. ముఖ్యంగా రిజ్వీ(70 నాటౌట్; 47 బంతుల్లో 5ఫోర్లు, 4సిక్సర్లు) ధనా ధన్ ఇన్నింగ్స్‌కి తోడు స్టబ్స్(39నాటౌట్; 32బంతుల్లో 3ఫోర్లు, సిక్సర్) రాణించారు. వీరిద్దరూ 5వ వికెట్‌కు 119 పరుగుల రికార్డు భాగస్వామ్యం నెలకొల్పారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లక్నోకు శుభారంభం దక్కలేదు. కెప్టెన్ రిషబ్ పంత్(7) రనౌట్ కావడంతో జట్టు వికెట్ల పతనం మొదలైంది. ఆ తర్వాత మార్‌క్రమ్(11), బడోనీ(0), పూరన్(8) నిరాశపరి చారు. దీంతో లక్నో 71పరుగులకే సగం వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో అబ్దుల్ సమద్ (36), మిచెల్ మార్ష్(35)కి తోడు షాబాజ్ అహ్మద్ (15), ముకుల్ చౌదరి(14) లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌లో రాణించారు. కానీ చివర్లో ష(1), నోర్జె(0), మొహిసిన్ ఖాన్(0) స్వల్ప స్కోర్లకే పెవిలియన్‌కు చేరడంతో లక్నో ఇన్నింగ్స్ 141పరుగులకు ముగిసింది. ఛేదనలో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్‌కూ శుభారంభం దక్కలేదు. కెఎల్ రాహుల్(0)ను మహ్మద్ ష బౌల్డ్ చేయగా.. నిస్సంకను ప్రిన్స్ యాదవ్ త్వరగా పెవీలియన్‌కు పంపాడు. నితీశ్ రాణాకు తోడు కెప్టెన్ అక్షర్ పటేల్(0) డకౌట్ కావడం తో ఢిల్లీ జట్టు 26పరుగులకే 4వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో ఇంపాక్ట్ ప్లేయర్‌గా బ్యాటింగ్‌కు దిగిన సర్ రిజ్వీ కెప్టెన్ నమ్మకాన్ని వమ్ము కానీయలేదు. ఫోర్లు, సిక్సర్లతో అర్ధ సెంచరీ సాధించి జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించాడు. లక్నో బౌలర్లు ప్రిన్స్ యాదవ్‌కు రెండు, ష, మొహిసిన్ ఖాన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సర్ రిజ్వీకి దక్కింది.

# కపిల్, ధోనికి క్షమాపణలు చెప్పాలనుకుంటున్నా..



కపిల్ దేవ్ హయాంలో తనకు.. ధోని సారథిగా వచ్చాక తన కుమారుడు యువరాజ్ సింగ్‌కు అన్యాయం జరిగిందని ఇటీవల పలు ఇంటర్వ్యూల్లో యోగ్‌రాజ్ సింగ్ వ్యాఖ్యానిస్తూ వచ్చారు. టీమ్‌ఇండియాకు వరల్డ్ కప్‌లను అందించిన సారథులపై ఇలా కామెంట్లు చేయడం సరికాదంటూ సోషల్ మీడియా వేదికగా అభిమానులు స్పందించారు. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన టీమ్ ఇండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఇద్దరు దిగ్గజాలకు క్షమాపణలు చెప్పాలనుకుంటున్నట్లు వెల్లడించారు. ''ఈ సందర్భంగా కపిల్ దేవ్, ఎంఎస్ ధోనికి క్షమాపణలు చెప్పాలనుకుంటున్నా. మా నాన్న ఇచ్చిన ఇంటర్వ్యూలను చూశా. అలాంటివి నేనూ విన్నా. ఇప్పటికే పలుమార్లు 'ఇది సరైంది కాదు' అని చెప్పా. అందుకే, ఆయన తరఫున నేను వారిద్దరికీ క్షమాపణలు చెబుతున్నా'' అని యువరాజ్ తెలిపాడు. ఈ ఇంటర్వ్యూలో తన శిష్యుడు అభిషేక్ శర్మ ఆట పైనా స్పందించాడు. విరాట్, కోహ్లీ, సంజు శాంసన్, పంత్‌తో పాటు యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి సంబంధించిన పలు విషయాలను వెల్లడించాడు. అంతకుముందు ఓ కార్యక్రమంలో క్రికెటర్లు గోల్ఫ్ కూడా ఆడాలని సూచించాడు. ఒత్తిడి తగ్గించుకొనేందుకు అది మంచి మార్గమని చెప్పాడు. విదేశీ క్రికెటర్లు చాలామంది చిన్నప్పటినుంచే గోల్ఫ్ ఆడుతున్నట్లు గుర్తు చేశాడు.

## చెన్నై బోణీ కొట్టేనా?

ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా శుక్రవారం చెన్నై సూపర్‌కింగ్స్, పంజాబ్ కింగ్స్ జట్లు తలపడనున్నాయి. చెన్నైలోని చేపాక్ వేదికగా జరగనున్న ఈ మ్యాచ్ సీఎస్కే జట్టుకు చావోరేవో అన్నట్లుగా




మారింది. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మొదటి మ్యాచ్‌లో చెన్నై ఘోరంగా ఓడిపోయిన సంగతి తెలిసిందే. కేవలం 127 పరుగులకే ఆలౌట్ అయిన చెన్నైపై రాజస్థాన్ సునాయాసంగా గెలిచింది. సొంత గడ్డపై ఆడుతున్న ఈ మ్యాచ్‌లోనైనా గెలిచి బోణీ కొట్టాలని రుతురాజ్ గైక్వాడ్ సేన పట్టుదలగా ఉంది. ఈ సీజన్‌లో రూ.18 కోట్లకు ట్రేడ్ ద్వారా చెన్నైలోకి వచ్చిన సంజు శాంసన్, మొదటి మ్యాచ్‌లో కేవలం 6 పరుగులకే అవు నిరాశపరిచాడు. ఎంఎస్ ధోనీ గాయం కారణంగా అందుబాటులో లేని ప్రస్తుత పరిస్థితుల్లో, సంజు తన బ్యాటింగ్, వికెట్ కీపింగ్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి జట్టును ఆదుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు. రూ.14.20 కోట్ల భారీ ధరకు అమ్ముడైన ఈ 19 ఏళ్ల యువ ఆటగాడైన కార్తీక్ శర్మ.. రాజస్థాన్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో 18 పరుగులు చేసి కొంత ఆకట్టుకున్నాడు. ధోనీ లేని లోటును భర్తీ చేసే సత్తా ఇతనికి ఉందని మేనేజ్‌మెంట్ గట్టిగా నమ్ముతోంది. గాయం కారణంగా మొదటి మ్యాచ్‌కు దూరమైన డెవాల్డ్ బ్రెవిస్, ఈ మ్యాచ్‌కు అందుబాటులో ఉంటాడా లేదా అనేది తెలియాల్సి ఉంది. మరోవైపు శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని పంజాబ్ కింగ్స్ తన మొదటి మ్యాచ్‌లో గుజరాత్ టాన్స్‌ను ఓడించి మంచి జోరుదుంది. అర్షదీప్ సింగ్, యుజువేంద్ర చాహల్ వంటి బౌలర్లతో పంజాబ్ బౌలింగ్ విభాగం చాలా బలంగా ఉంది. చేపాక్ పిచ్ సాధారణంగా స్పిన్నర్లకు అనుకూలిస్తుంది కాబట్టి, ఇరు జట్ల స్పిన్నర్లు ఇక్కడ కీలక పాత్ర పోషించనున్నారు. మరి ఈ మ్యాచులో విజయం ఎవరిని వరిస్తుందో వేచి చూడాలి.

# క్యాచ్ వివాదం.. అభిషేక్ శర్మకు ఫైన్

సన్ రైజర్స్, కేకేఆర్ మధ్య గురువారం జరిగిన మ్యాచ్ లో అభిషేక్ శర్మ ఔట్ అయిన విధానం వివాదంగా మారిన సంగతి తెలిసిందే. అయితే ఈ సంఘటన నేపథ్యంలో అంపైర్ నిర్ణయంపై సన్ రైజర్స్ ఆటగాడు అభిషేక్ శర్మ అసంతృప్తి వ్యక్తం చేశాడు. తాను నాటౌట్ అంటూ స్టేడియంలో అసహనం వ్యక్తం చేశాడు. ఈ నేపథ్యంలో అభిషేక్ శర్మకు మ్యాచ్ ఫీజులో 25% జరిమానా విధించింది ఐపీఎల్ క్రికెట్ కౌన్సిల్. కోడ్ ఆఫ్ కండక్ట్ ను ఉల్లంఘించినందుకుగాను ఒక డీమెరిట్ పాయింట్ విధించినట్లు అధికారికంగా ప్రకటన చేసింది ఐపీఎల్. దీంతో అభిషేక్ శర్మకు ఊహించని ఎదురు దెబ్బ తగిలింది. కేకేఆర్, సన్ రైజర్స్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. ఇందులో అద్భుతంగా రాణించిన అభిషేక్ శర్మ, 48 పరుగుల వద్ద క్యాచ్ ఇచ్చి ఔట్ అయ్యాడు. అయితే అభిషేక్ శర్మకు సంబంధించిన క్యాచ్ ను వరుణ్



చక్రవర్తి బౌండరీ గేటు దగ్గర అందుకున్నాడు. అతడు బంతిని పట్టుకునే క్రమంలో స్లైప్ అయినట్లు రివ్యూలో కనిపించింది. అయినప్పటికీ థర్డ్ అంపైర్ మాత్రం క్లియర్ ఔట్ అని ప్రకటించేశాడు. ఈ నేపథ్యంలోనే అసంతృప్తి వ్యక్తం చేశాడు అభిషేక్ శర్మ. దీంతో తాజాగా ఫైన్ విధించింది ఐపీఎల్ క్రికెట్ కౌన్సిల్. కాగా ఈ మ్యాచ్ లో 65 పరుగులు తేడాతో కేకేఆర్ పై సన్ రైజర్స్ విజయం సాధించింది.

## ఐపీఎల్‌కు వెళ్లనివ్వరా?..

### సొంత క్రికెట్ బోర్డుపై ఆర్సీబీ స్టార్ బౌలర్ కేసు!

ఐపీఎల్ 2026 సీజన్‌లో ఆడేందుకు 'నిరభ్యంతర పత్రం' ఇవ్వకపోవడంపై శ్రీలంక స్టార్ పేసర్, ఆర్సీబీ ఆటగాడు నువాన్ తుషారా కొలంబో జిల్లా కోర్టును ఆశ్రయించాడు. తనకు వెంటనే ఎన్‌ఓసీ ఇచ్చేలా శ్రీలంక క్రికెట్ బోర్డును ఆదేశించాలని కోరుతూ పిటిషన్ వేశాడు. ఈ పిటిషన్‌లో ఎస్‌ఎల్‌సీ అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారితో పాటు సీఈఓను ప్రతివాదులుగా చేర్చాడు. నిర్ణీత ఫిట్‌నెస్ ప్రమాణాలు లేవన్న సాకుతోనే బోర్డు తనకు ఎన్‌ఓసీ నిరాకరించిందని తుషారా ఆరోపించాడు. 2026 మార్చి 31తో బోర్డుతో తన కాంట్రాక్ట్ ముగిసిందని, దాన్ని పొడిగించుకునే ఉద్దేశం లేదని, అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమవుతున్నట్లు బోర్డుకు



ముందే స్పష్టం చేశానని తెలిపాడు. గతం (2024, 2025)లో ఇదే ఫిట్‌నెస్‌తో ఉన్నప్పుడు ఐపీఎల్‌కు అనుమతిచ్చిన బోర్డు.. ఇప్పుడు జాతీయ జట్టుకు కూడా ఎంపిక చేయకుండా ఇలా అడ్డుకోవడం అన్యాయమని వాదించాడు. ఎన్‌ఓసీ రాకపోతే ఐపీఎల్‌లో ఆర్సీబీ తన స్థానంలో మరొకరిని తీసుకుంటుందని, తద్వారా భారీ ఆదాయంతో పాటు కెరీర్ అవకాశాలు కోల్పోతానని తుషారా ఆవేదన వ్యక్తం చేశాడు.




# రౌడీ జనార్ధన పోస్టర్ రిలీజ్



స్టార్ హీరో విజయ్ దేవరకొండ ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ లో నటిస్తున్న క్రేజీ మూవీ "రౌడీ జనార్ధన". స్టార్ ప్రొడ్యూసర్స్ దిల్ రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. టాలెంటెడ్ యంగ్ డైరెక్టర్ రవి కిరణ్ కోలా ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. రూరల్ యాక్షన్ డ్రామా నేపథ్యంతో భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ గా "రౌడీ జనార్ధన"సినిమా రూపొందుతోంది. ఈ సినిమాకు బ్యూటిఫుల్, ఇంపాక్ట్ ఫుల్ విజువల్స్ అందిస్తున్నారు ప్రముఖ సినిమాటోగ్రాఫర్ ఆనంద్ సి చంద్రన్. ప్రేమమ్, హెలెన్, భీష్మపర్వం, ఆనందం, గోల్డ్, ఛతా పచ్చ వంటి ఎన్నో చిత్రాలకు క్రియేటివ్ విజువల్స్ అందించి మాస్టర్ ఆఫ్ విజువల్ పొయెట్రీగా పేరు తెచ్చుకున్నారు ఆనంద్ సి చంద్రన్. ఈ రోజు ఆయన పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు చెబుతూ "రౌడీ జనార్ధన"మూవీ టీమ్ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేసింది. ఈ సినిమాను సిల్వర్ స్క్రీన్ పై చూసేందుకు రౌడీ ఫ్యాన్స్ తో పాటు మూవీ లవర్స్ వెయిట్ చేస్తున్నారు.

# సందడిగా ఎఫ్ఎన్ సిసి







ఫిలింనగర్ కల్చరల్ సెంటర్, పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ లీగ్ అనౌన్స్ మెంట్ కార్యక్రమంలో ఈ రోజు ఎఫ్ఎన్ సిసిలో సందడిగా జరిగింది. ఈ నెల 4, 5 తేదీలలో ప్రారంభమయ్యే ఈ లీగ్ వచ్చే నాలుగైదు వారాలు వీకెండ్స్ లో శని, ఆదివారాలు నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా టాప్ 10 మెన్ అండ్ వుమెన్ బ్యాడ్మింటన్ ప్లేయర్ ఈ లీగ్ లో పాల్గొనబోతున్నారు. ఈ అనౌన్స్ మెంట్ కార్యక్రమంలో ఎఫ్ఎన్ సిసి ప్రెసిడెంట్ కె.ఎస్. రామారావు మాట్లాడుతూ తెలంగాణ బ్యాట్మింటన్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ చాముండేశ్వరీనాథ్, ఎఫ్ఎన్ సిసి బ్యాడ్మింటన్ కమిటీ ఛైర్మన్ పురుషోత్తం గార్ల చొరవతో ఎఫ్ఎన్ సిసి పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ లీగ్ ప్రారంభిస్తున్నాం. ఈ నెల 4, 5వ తేదీల్లో ప్రారంభమయ్యే ఈ లీగ్ పోటీలు వచ్చే నాలుగైదు వారాలు వీకెండ్స్ లో నిర్వహిస్తాం. క్రికెట్ తో పాటు బ్యాడ్మింటన్ లాంటి ఇతర క్రీడలను ప్రోత్సహించాలి, యువతను అన్ని స్పోర్ట్స్ వైపు తీసుకెళ్లాలి అనే ప్రయత్నంలో భాగంగా ఈ లీగ్ నిర్వహిస్తున్నాం. మా ఎఫ్ఎన్ సిసి నుంచి ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, సెక్రటరీ.. ఇలా టీమ్స్ ఉంటాయి. ఇక నుంచి ఎఫ్ఎన్ సిసిలో ఏటా టెన్నిస్, బ్యాడ్మింటన్, పికిల్ బాల్ వంటి పోటీలు నిర్వహించబోతున్నాం. అన్నారు. ఎఫ్ఎన్ సిసి బ్యాడ్మింటన్ కమిటీ ఛైర్మన్ పురుషోత్తం మాట్లాడుతూ ఎఫ్ఎన్ సిసి పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ లీగ్ ప్రారంభించుకోవడం సంతోషంగా ఉంది. ఈరోజు గోపీచంద్ గారు కూడా రావాల్సింది. రేపు జరిగే కార్యక్రమానికి వస్తామని చెప్పారు. మా ఎఫ్ఎన్ సిసిలో టోర్నమెంట్ పెట్టి నాలుగైదేళ్లవుతోంది. అందుకే మా సభ్యుల సూచన మేరకు మొదట క్లబ్ టోర్నమెంట్, ఆ తర్వాత ఇంటర్ క్లబ్ టోర్నమెంట్ ఆ తర్వాత నేషనల్స్ టోర్నమెంట్ నిర్వహించాలని అనుకున్నాం. ఈ టోర్నమెంట్ నిర్వహణకు ముందుకొచ్చిన మా ప్రెసిడెంట్, సెక్రటరీతో పాటు సపోర్ట్ చేస్తున్న చాముండేశ్వరీనాథ్ గారికి థ్యాంక్స్. అన్నారు. తెలంగాణ బ్యాట్మింటన్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ చాముండేశ్వరీనాథ్ మాట్లాడుతూ స్పోర్ట్స్ ను ఎంకరేజ్ చేసేందుకు ఎఫ్ఎన్ సిసి కార్యవర్గం ఎప్పుడూ ముందుంటుంది. గతంలో ఇక్కడే టెన్నిస్ నేషనల్స్, బ్యాడ్మింటన్ నేషనల్స్ టోర్నమెంట్స్ కండక్ట్ చేశాం. ఇప్పుడు పుల్లెల గోపీచంద్, ఎఫ్ఎన్ సీసీ లీగ్ ప్రారంభిస్తున్నాం. నేషనల్ వైడ్ టాప్ 10 మెన్ అండ్ వుమెన్ ప్లేయర్స్ ఈ టోర్నమెంట్ లో పాల్గొంటారు. మేనేజ్ మెంట్ తరుపున ప్రెసిడెంట్, సెక్రటరీ టీమ్స్ ఉంటాయి. పురుషోత్తం గారితో పాటు ఎవరైనా టీమ్స్ పాల్గొంటే 10 లక్షల రూపాయల చొప్పున చెల్లించాలి. అవి ఈ టోర్నమెంట్ విజేతలకు ప్రైజ్ మనీ ఇచ్చేందుకు ఉపయోగిస్తాం. అన్నారు. ఫిలింనగర్ సొసైటీ సెక్రటరీ, ఎఫ్ఎన్ సిసి కమిటీ మెంబర్ కాజా సూర్యనారాయణ మాట్లాడుతూ ఎఫ్ఎన్ సిసి అనేది ఒక క్లబ్ మాత్రమే కాదు ఇక్కడ ఎన్నో కల్చరల్ ఈవెంట్స్ చేస్తామని మా ప్రెసిడెంట్ కేఎస్ రామారావు గారు నిరూపించారు. ఏ క్లబ్ కు లేనంత మంచి స్పోర్ట్స్ కాంప్లెక్స్ మన దగ్గర ఉంది. చాముండేశ్వరీనాథ్ గారు వచ్చాక మన స్పోర్ట్స్ కాంప్లెక్స్ రూపురేఖలు మారిపోయాయి. దేశవ్యాప్తంగా వివిధ క్రీడల్లో పేరున్న ఎంతోమందిని ఆయన మన దగ్గరకు తీసకొచ్చారు. ఈ టోర్నమెంట్ కూడా బాగా జరగాలి. అన్నారు. ఎఫ్ఎన్ సిసి సెక్రటరీ తుమ్మల రంగారావు మాట్లాడుతూ గత రెండు మూడు నెలలుగా ఈ టోర్నమెంట్ గురించి చర్చలు జరుగుతున్నాయి. చాముండేశ్వరీనాథ్ గారి చొరవతో, మా ప్రెసిడెంట్ ఇతర కార్యవర్గ సపోర్ట్ తో ఎఫ్ఎన్ సిసి పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నాం. మా ప్రెసిడెంట్ ఏ కార్యక్రమం చేపట్టినా మా పూర్తి సహకారం అందిస్తాం. అన్నారు. ఎఫ్ఎన్ సిసి మెంబర్ సోమరాజు మాట్లాడుతూ దేశంలో ఎన్నో క్లబ్స్ ఉంటాయి. కానీ ఎఫ్ఎన్ సిసిలో మాత్రమే ఎన్నో స్పోర్ట్స్ ఈవెంట్స్ జరుపుతున్నారు. మా చాముండేశ్వరీనాథ్ గారు ఇక్కడికి వచ్చాక సానియా మిర్జా, లియాండర్ పేస్, పుల్లెల గోపీచంద్ వంటి ఎంతమంది స్టార్స్ ను తీసుకొచ్చారు. అన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎన్ సిసి వైస్ ప్రెసిడెంట్ ఎస్ ఎన్ రెడ్డి, ట్రెజరర్ శైలజ జూజాల, ఎఫ్ఎన్ సిసి కమిటీ మెంబర్స్ వేణు, ఏడిద రాజా, కమిటీ మెంబర్ మరియు స్పోర్ట్స్ కమిటీ కన్వీనర్ కోగంటి భవానీ, తదితరులు పాల్గొన్నారు.

# 5న బెల్లంకొండ వారి నిశ్చితార్థం



యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, కావ్య రెడ్డి రోకా వేడుక గత నెలలో అంగరంగ వైభవవంగా జరిగింది. సంప్రదాయం, వేడుక, కుటుంబ ఆత్మీయతల కలయికతో జరిగిన ఈ వేడుక, వారి వివాహ ప్రయాణానికి ఒక పరిపూర్ణమైన ఆరంభాన్ని ఇచ్చింది. వివాహానికి ముందు జరిగే వేడుకలు అధికారికంగా ప్రారంభం కాగా, నిశ్చితార్థం ఏప్రిల్ 5న జరగనుంది. విశాలమైన ఫామ్‌హౌస్‌లో జరగనున్న ఈ కార్యక్రమం వైభవం, ఆత్మీయతల కలయికగా ఉంటుంది. ఈ వేడుకలో సినీ పరిశ్రమ మిత్రులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులు పాల్గొనున్నారు.

వీరి వివాహ వేడుక ఏప్రిల్ 29న, దివ్యమైన తిరుమల ప్రాంగణంలో జరగనుంది. అత్యంత పవిత్రమైన ఆధ్యాత్మిక క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన ఈ ప్రదేశం చిరస్మరణీయమైన కలయికకు సరైన వేదికగా నిలుస్తుంది.

# సైరాబాను మూవీ లాంచ్






'శంబాల' చిత్రంతో తన కెరీర్‌లోనే బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌ను అందుకున్న హీరో ఆది సాయి కుమార్, ఇప్పుడు స్ట్రాంగ్ కమర్షియల్, కాన్సెప్ట్ బేస్డ్ చిత్రాల వైపు దృష్టి పెడుతున్నారు. ఫణి కృష్ణ సిరికి దర్శకత్వంలో తెరకెక్కనున్న తన నెక్స్ట్ ప్రాజెక్ట్‌ను ఆయన ఈరోజు అధికారికంగా ప్రకటించారు. 'కెర్యాంప్' సంచలన విజయంతో దూసుకుపోతున్న సక్సెస్ ఫుల్ నిర్మాత రాజేష్ దండా, హాస్య మూవీస్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, కృష్ణకాంత్ పరుచూరి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంలో ఆది సాయి కుమార్ సరసన బంధవి శ్రీధర్ కథానాయికగా నటిస్తున్నారు. 'సైరాబాను' అనే ఆసక్తికరమైన టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని, ఆకట్టుకునే పోస్టర్ ద్వారా ఆవిష్కరించారు. ఈ పోస్టర్ డిజైన్ ఉత్సాహభరితమైన రొమాంటిక్ వాతావరణాన్ని ప్రజెంట్ చేస్తోంది. సాఫ్ట్ పాస్టెల్ రంగులతో అద్దిన ఒక హార్ట్ షేప్ గులాబీ మేఘం, పోస్టర్ పైభాగంలో తేలుతున్నట్లుగా ఉంది. దాని కింద "A Fun Filled Journey of Love, Faith & Destiny." అనే ట్యాగ్‌లైన్ ఆకట్టుకుంది. పోస్టర్ లో నీటితో తడిసిన చార్మినార్, ప్రశాంతమైన వైజాగ్ బీచ్ రోడ్, రాజమండ్రి గోదావరి వంతెన, ఇవన్నీ బ్యాక్ డ్రాప్ లో వుండటం మరింత ఆసక్తిని పెంచుతోంది. నిర్మలమైన, ప్రశాంతమైన ఆకాశం, చెల్లాచెదురుగా ఉన్న మేఘాలు ఈ విజువల్‌కు మరింత అందాన్ని జోడించాయి.

# కటాలన్‌కు బస్రూర్ మ్యూజిక్



కేజీఎఫ్, మార్కో వంటి సినిమాలతో దక్షిణ భారతంలో సంచలనంగా మారిన రవి బస్రూర్, మరోసారి తన సంగీతంతో మ్యూజికల్ సంచలనం సృష్టించడానికి రెడీ అయ్యారు. క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై షరీఫ్ మహమ్మద్ నిర్మిస్తున్న భారీ యాక్షన్ థ్రిల్లర్ "కటాలన్" కోసం ఆయనను సంగీత దర్శకుడిగా తీసుకున్నారు. ముందుగా ఈ చిత్రానికి బి. అజనీష్ లోకనాథ్ సంగీతం అందిస్తారని వార్తలు వచ్చాయి, కానీ ఇప్పుడు అధికారికంగా రవి బస్రూర్ ఈ బాధ్యతలు చేపట్టినట్లు ప్రకటించారు. పాన్ఇండియా స్థాయిలో ప్లాన్ చేసిన ఈ చిత్రం మే 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. మలయాళ సినీ చరిత్రలోనే అతిపెద్ద విడుదలల్లో ఒకటిగా ఇది నిలవనుందని భావిస్తున్నారు. ఈ చిత్రానికి కొత్త దర్శకుడు పాల్ జార్జ్ దర్శకత్వం వహిస్తున్నారు. క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ నుంచి మార్కో తర్వాత వస్తున్న ఈ చిత్రంలో హీరోగా ఆంటోని వర్గీస్ నటిస్తున్నారు. కేజీఎఫ్ 1, కేజీఎఫ్ 2, సలార్, మార్కో వంటి సినిమాల్లో తన పవర్‌ఫుల్ సాంగ్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో గుర్తింపు పొందిన రవి బస్రూర్, మళ్లీ మలయాళంలోకి వస్తూ థియేటర్లలో ఉత్కంఠభరితమైన అనుభవాన్ని ఇవ్వబోతున్నారు. భారీ యాక్షన్‌తో పాటు ఆయన ప్రత్యేకమైన సంగీతం "కటాలన్"పై అంచనాలను మరింత పెంచింది.

# డెకాయిట్ 4న ట్రైలర్ రిలీజ్



బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్లతో అలరిస్తున్న అడివి శేష్ ఏప్రిల్ 10న థియేటర్లలోకి రాబోతున్న పాన్ఇండియా యాక్షన్‌రొమాంటిక్ థ్రిల్లర్ 'డెకాయిట్'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రంతో షానియల్ డియో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. శేష్ సరసన మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటించారు. అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రంలో శేష్ తొలిసారిగా మాస్, రగ్గడ్ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషన్స్ ఫుల్ స్వింగ్‌లో కొనసాగుతున్నాయి. పోస్టర్లు, గ్లింప్స్, టీజర్, అలాగే 'రుబారు' చిచ్చుబుడ్డి పాటలు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన పొందుతూ సినిమాపై భారీ అంచనాలు నెలకొల్పాయి. ట్రూ బైలింగ్వల్ ప్రాజెక్ట్‌గా తెలుగు, హిందీ భాషల్లో ఒకేసారి రూపొందుతున్న ఈ చిత్రం తాజాగా రెండు భాషల్లో సెన్సార్ పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డ్ ఈ చిత్రానికి యూ/ఏ సర్టిఫికేట్ ఇచ్చింది. సినిమా అద్భుతంగా వుందని సెన్సార్ సభ్యులు మూవీ టీంని అభినందించారు.

# బ్లాక్ శారీలో పిచ్చెక్కిస్తున్న నభా



తెలుగు తెరపై తనదైన ముద్ర వేసిన అందాల భామ నభా నటేష్, తాజాగా సోషల్ మీడియాలో సెగలు పుట్టిస్తోంది. బ్లాక్ కలర్ శారీలో తన హాట్ అందాలను ఆరబోస్తూ ఆమె ఇచ్చిన స్టిల్స్ ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. కొన్ని రోజుల తర్వాత రీ-ఎంట్రీ ఇచ్చిన ఈ 'ఇస్మార్ట్' పిల్లా, వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉండటమే కాకుండా.. గ్లామర్ డోస్ పెంచి అభిమానుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది.

# క్విట్ డ్రగ్స్ యాడ్ ఫిల్మ్ పోస్టర్ రిలీజ్




డ్రగ్స్ కి నో చెప్పండి, మీ భవిష్యత్ ను,మీ జీవితాన్ని కాపాడుకోండి.. అనే నినాదం తో కదం తొక్కారు. యువ దర్శకుడు బి.సురేష్ పాణి, ఈయన రూపొందించిన యాడ్ ఫిల్మ్ గత జూన్ 26/2025,న,గద్దర్ అవార్డు ఇంటర్నేషనల్ డ్రగ్స్ డే,ఫంక్షన్లో 'తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రశంసలు పొందింది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జరుపుతున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో " క్విట్ డ్రగ్స్" థియేట్రికల్ యాడ్ ఫిల్మ్ పోస్టర్ ను ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ శ్రీ సందీప్ శాండిల్య క్విట్ డ్రగ్స్, థియేట్రికల్ యాడ్ ఫిల్మ్, పోస్టర్ ను లాంఛనంగా ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కె. క్రాంతి కిరణ్ రెడ్డి, (జనప్రియ మేనేజింగ్ డైరెక్టర్) వి.కమల్ కిషన్ (డైరెక్టర్ మార్కెటింగ్) ఎన్.సతీష్‌కుమార్ సిఎఫ్ ఓ, మరియు తెలంగాణ ఈగల్ ఫోర్స్ అవేర్నెస్ వింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ థియేట్రికల్ యాడ్ ఫిలిం లో నటించి, సపోర్టు చేసిన హీరోలు శ్రీ గోపీచంద్, శ్రీ అల్లరి నరేష్, శ్రీ నిఖిల్ సిద్ధార్థ్ , శ్రీ నారా రోహిత్, శ్రీ బెల్లంకొండ సాయి శ్రీనివాస్, గార్లకు కృతజ్ఞతలు. తెలియజేస్తున్నాము., ఈ చిత్రానికి, దర్శకత్వం బీ.సురేష్ పాణి, స్పాన్సర్స్ జనప్రియ అప్ స్కేల్ మరియు సాంకేతిక నిపుణులు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రమేష్ మట్ట, మేనేజర్, వెంకట్రావు పెద్దపూడి, ఎడిటర్ కె సి బి హరి. డిఓపి బన్నీ, కాగా ఈ థియేట్రికల్ యాడ్ ఫిల్మ్, మార్చి మొదటివారం. నుండి తెలంగాణ లోని అన్ని థియేటర్స్ లలో ప్రద్శించనున్నారు.

# #SDT19 అనౌన్స్ మెంట్

మెగా సుప్రీమ్ హీరో సాయి దుర్గ తేజ్ #SDT19 ఊహకు అందని స్థాయిలో రూపొందుతోంది. గ్రాండ్ స్కేల్ లో తెరకెక్కనున్న ఈ చిత్రం అనౌన్స్మెంట్ సినీ ప్రియుల్లో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది.

#SDT19 సాయి దుర్గ తేజ్ కెరీర్‌లో ఒక పవర్ ఫుల్ ఫేజ్ కి నాంది పలుకుతోంది. విభిన్నమైన కథలతో ముందుకు సాగుతున్న ఆయన 'యుగాలుగా బయటకు రాని రహస్యాలు, ఊహకు అందని శక్తులు' చుట్టూ తిరిగే ప్రపంచంలోకి అడుగుపెడుతున్నట్టు ఫస్ట్ పోస్టర్ సూచిస్తోంది. దర్శక ద్వయం సుజిత్ & సందీప్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. వీరు "క" సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. #SDT19తో వీరి విజన్ మరింత విస్తరించబోతోందని స్పష్టంగా కనిపిస్తోంది. మిథిక్ సైఫై నేపథ్యంలో హైఆక్టేన్ కథనాన్ని మిళితం చేస్తూ, గొప్ప సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించడానికి సిద్ధమవుతున్నారు.



# 17న తిమ్మరాజుపల్లి టీవీ




న్యూ టాలెంట్ ను ఎంకరేజ్ చేస్తూ హీరో కిరణ్ అబ్బవరం సుమైర స్టూడియోస్ తో కలిసి తన కేఏ ప్రొడక్షన్స్ పై నిర్మిస్తున్న సినిమా "తిమ్మరాజుపల్లి టీవీ". తేజ వేల్పుచర్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంతో సాయి తేజ్, వేద జలంధర్ హీరో హీరోయిన్స్ గా పరిచయమవుతున్నారు. "తిమ్మరాజుపల్లి టీవీ" చిత్రంతో వి.మునిరాజు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో సాగే పీరియాడిక్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా ఈ నెల 17న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.

"తిమ్మరాజుపల్లి టీవీ" సినిమాను ఓవర్సీస్ లో శ్లోక ఎంటర్ టైన్ మెంట్స్, వైబ్రెంట్ మూవీస్ రిలీజ్ చేయబోతున్నాయి. ఎన్నో సూపర్ హిట్ చిత్రాలను ఓవర్సీస్ ప్రేక్షకులకు అందించిన ఈ రెండు డిస్ట్రిబ్యూషన్ సంస్థలు "తిమ్మరాజుపల్లి టీవీ" కంటెంట్ పై పూర్తి నమ్మకంతో డిస్ట్రిబ్యూషన్ కు ముందుకొచ్చాయి. ప్రమోషనల్ కంటెంట్ తో "తిమ్మరాజుపల్లి టీవీ" సినిమా ఇప్పటికే ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ క్రియేట్ చేస్తోంది.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : Sirikonda AUGUSTIN . RNI No.: APTEL/2013/52694. E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.